# మూసీ
# MUSI

◆ Samputi : 27 ◆ Sanchika : 02 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ December 2023


UGC Care List
Approved Journal

- కుతుబ్‌షాహీల ఆస్థానంలో తెలుగు కవులు
- శ్రీమద్భగవద్గీత - కర్మనిష్ఠ (యోగశాస్త్రం) విశేషాలు
- బహుముఖ ప్రతిభాశాలి 'ఆదిరాజు వీరభద్ర రావు'
- అధునిక తత్త్వగీతాల అలుపెరుగని వాగ్గేయకారుడు - గోరటి వెంకన్న
- శేషాద్రి రమణకవులు పరిశోధన వ్యాసమంజరి
- కుమార భారతి దర్శనంలో అగ్ని రాయబారం
- తెలుగు వాఙ్మయవికాసము - పునరుద్ధరణ
- తెలంగాణ గిరిజన తెగల కథలు - సామాజిక చిత్రణ



మూసీ వ్యవస్థాపకులు :

**కీ॥ శే॥ భిన్నూరి నరసింహ శాస్త్రిగారి 91వ జయంతి**




వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 27 సంచిక : 2
డిసెంబర్ - 2023
'శోభకృత్' కార్తీక, మార్గశిర మాసాలు

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)


చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక'** (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.



వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com



INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


కుతుబ్‌షాహీల ఆస్థానంలో తెలుగు కవులు - సాహితీ సేవ ... బట్టు విజయ్‌కుమార్ 7
శ్రీమద్భగవద్గీత - కర్మనిష్ఠ (యోగశాస్త్రం) విశేషాలు ... డా. వీపూరి వెంకటేశ్వర్లు 11
గట్టి మనిషి మెరుపు (బందారం కథలు -23) ... డా. నందిని సిధారెడ్డి 15
పద్యమనోహరం- 47 ... గన్నవరం గిరిజామనోహర్ బాబు 20
బహుముఖ ప్రతిభాశాలి 'ఆదిరాజు వీరభద్ర రావు' - వైద్యం గార్గేయి 21
భారతీయీకరణ17 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
ఆధునిక తత్త్వగీతాల అలుపెరుగని వాగ్గేయకారుడు-గోరటి వెంకన్న...బానోతు వెంకటేశ్వర్లు 25
శేషాద్రి రమణకవుల పరిశోధన వ్యాసమంజరి (గ్రంథాంతరంగం-29) ... ఘట్టమరాజు 27
పరిశోధక వరేణ్యులు 'వైద్యం వేంకటేశ్వరాచార్యులు'...మూసీ ముచ్చట... డా. అట్టెం దత్తయ్య 31
జానపద బాణీ పాటల్లో స్త్రీ మనోభావాలు - సోషల్ మీడియా పాత్ర ... డా. కె.రామస్వామి 37
కుమార భారతి దర్శనంలో అగ్ని రాయబారం ... డా. సుద అంకమ్మ 41
తెలుగు వాఙ్మయవికాసము - పునరుద్ధరణ ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 44
ఒగ్గు-మందెచ్చు కథాగానాలు - సాహిత్యాంశాలు ... కావటి సతీష్ కుమార్ 45
తెలంగాణ గిరిజన తెగల కథలు - సామాజిక చిత్రణ ... అజ్మీరా సుజాత 49
డి.కె. చదువుల బాబు బాలకథాసాహిత్యం - బాలవికాసాంశాలు ... జి.అశోక్‌కుమార్ 53


### కవితలు


శ్రీ నృసింహశాస్త్రీ! విజ్ఞతానిధాన!! ... డా. వేముగంటి నరసింహాచార్య - 5; రాతిరి జాగారం ... అరుణ ధూళిపాళ - 6; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; జీవన సాఫల్యత ... డా. గన్నోజు శ్రీనివాసాచార్య - 29 ; మీకు తెలుసా..? ... మల్యాల మనోహర రావు - 40; ప్రాణ ధాతువులు ... డా. గంద్ర లక్ష్మణ రావు - 60; జయహో 2024 ... అవుసుల భానుప్రకాశాచార్య - 62.


### సమీక్షలు


మౌనస్వామి పీ.వీ. అంతరంగ వివేచనం ... డా. వెలుదండ నిత్యానందరావు 55
శ్రీరంగస్వామి 'కావ్యావలోకనం' ... డా. గుమ్మా సాంబశివరావు 57
పలు భావాలు! పసందైన కవితలు!! ఎన్నో వర్ణాలు!!! ... దేవకాటమరాజు నరసింహులు 58
స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**



*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక    సంపుటి -27 : సంచిక - 2

UGC Care List Approved Journal
హైదరాబాద్    డిసెంబర్ : 2023

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**



# స్థాయి


లోకంలో చాలా అంశాలకు స్థాయి అనేది ఉంటుంది. జీవన విధానంలో ఆ విషయమే ప్రత్యేకంగా కనిపిస్తుంది. మనుషులదంతా ఒకే స్థాయి అంటూ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రయత్నాలు జరిగినా స్థాయీ భేదాలు అంగీకరించక తప్పడం లేదు. స్థాయిని శక్తిని బట్టి అంచనావేస్తుంటారు. శక్తి అనేక రూపాలుగా విస్తరించి ఉంది. ఆరోగ్యం, సంతోషం, తృప్తి, ప్రశాంతత మొదలైనవి దేహానికి, మనస్సుకు సంబంధించిన శక్తిని సూచన చేస్తుంటాయి. ఆర్థిక వ్యవహారాలు, చేసే ఉద్యోగాదులు సామాజిక ఆర్థిక స్థాయిలను నిర్ణయిస్తుంటాయి. అంతేకాకుండా వ్యాపారాలలోనూ, రాజకీయాల్లోనూ కూడా వ్యాపనాన్ని బట్టి, పెట్టుబడిని స్థాయి నిర్ణయించబడుతుంది. పెద్ద స్థాయి వానికి గుర్తింపు అధికం అవుతుంది. చిన్న స్థాయి వాడు గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంటాడు. ఏ స్థాయిలో ఉన్నవాడు తనపై స్థాయికి చేరడానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తుంటాడు.

చిన్న పానీపూరి బండి నుండి ఫైవ్ స్టార్ హోటల్ వరకు అన్నీ ఆహార సంబంధిత వ్యాపారాలే. స్థాయీ భేదం మనకు కనిపిస్తూనే ఉంది. చిన్న ఊరిలో వార్డ్ మెంబర్ నుండి భారత ప్రధానమంత్రి వరకు అన్నీ రాజకీయాలే. చిన్న డైలీ కార్మికుని స్థాయి నుండి ప్రతి గంటకు లక్షల్లో సంపాదించే వారు కూడా ఉన్నారు. శారీరక మానసిక సామాజిక ఆర్థిక వ్యవహారాల్లో ఎవరి స్థాయి వారిదే. కొందరు ఒకచోట ఆగిపోయి జీవనవిధానం కొనసాగిస్తే మరికొందరు ఎదగడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఆర్థిక వ్యవహారాలను బట్టి జీవన విధానం ఉంటుంది. ఇట్లా మనం ఆలోచిస్తుంటే ప్రతి విషయంలోనూ స్థాయి అనేది తప్పనిసరిగా కనిపిస్తుంది.

వ్యక్తి, వ్యక్తిత్వం, ఆకర్షణ, ప్రశాంతత విషయాల్లోనూ ఇటువంటి అంశాలే ప్రాధాన్యం వహిస్తాయి. ఎంత ప్రశాంతంగా, తృప్తిగా, ధైర్యంగా, ఉన్నతంగా ఉంటే అంత శక్తివంతంగా మారుతారు. దానివల్ల వారికి కావలసి నంత ఆకర్షణ ఏర్పడుతుంది. వాళ్ళు విస్తరించడం మొదలు పెడతారు. పదిమంది మనసుల్లో చేరుతారు. తొందరపాటు, చికాకు, అనవసరమైన ఆలోచనలు, స్వార్థం, భయం మొదలైన వ్యవహారాల వల్ల వ్యక్తిలో బలహీనత మొదలవుతుంది. వారు ఉన్నస్థాయి నుండి తగ్గిపోవడం లేదా స్థాయిని కోల్పోవడం జరుగుతుంది.

ఈ జీవన ప్రయాణంలోనూ స్థాయీ భేదాలు అనేక రూపాలలో అర్థం అవుతూనే ఉంది. పుట్టుకతోనే గొప్ప స్థాయిల్లో కొందరు, బలహీనమైన స్థాయిల్లో మరికొందరు పుట్టడం జరుగుతుంది. వారున్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి చేరడానికి చేసే ప్రయత్నమే జీవన ప్రయాణం. వారిలోని శక్తిని బట్టి స్థాయి నిర్ణయం అవుతుంది. కరెంటుబల్బు స్థాయిని బట్టి విద్యుత్తు ప్రవహిస్తుంది కదా! అదేవిధంగా మనలోని శుద్ధత, ప్రశాంతత, అనవసరమైన ఆలోచనలకు దూరం కావడం, పెద్ద స్థాయి, శక్తి ఉన్నవానిని నిరంతరం స్మరించడం వంటి పనుల వల్ల వ్యక్తిలో వ్యాపనం జరుగుతుంది. ఆ వ్యాపన శక్తి మాత్రమే వారి స్థాయిని పెంచుతుంది. ఈ విధానమే నేడు లక్ష్యాలు, గోల్స్ అనే పదాలలో ఉపయోగిస్తున్నాం. స్థాయి పెరిగేటప్పుడు పరీక్షలు తప్పవు. ఎదుర్కోవాల్సి ఉంటుంది. పదవ తరగతి నుండి ఇంటర్మీడియెట్‌కు చేరాలంటే పరీక్ష రాయాల్సిందే కదా! అదే విధంగా మన స్థాయి పెరగాలని ప్రయత్నం చేస్తుంటే కొన్ని పరీక్షలు రాయాల్సి ఉంటుంది. జీవన విధానంలో కూడా ఇదే పద్ధతి. ఆ పరీక్షలను ఎదుర్కొని నిలబడ్డవానిని ప్రకృతి వరిస్తుంది. ఇదే ప్రకృతివరణం. వెనుకబడిన వారు మళ్ళీ పరీక్షలు రాసి మాత్రమే ముందుకు రావాల్సి ఉంటుంది. ఈ విషయాలను అర్థం చేసుకుని మన స్థాయిని మనం పెంచుకోవడానికి, ప్రశాంతంగా ఉండి, స్వార్థం వీడి లోకానికి, ప్రకృతికి, పశుపక్ష్యాదులకు వినియోగపడతారో వారి స్థాయి తప్పక పెరుగుతుంది.

# శ్రీ నృసింహ శాస్త్రీ! విజ్ఞతానిధాన!!




శ్రీమద్భిన్నూరి వంశా
రామ లలిత పారిజాత రాజిత మూర్తీ!
నీ మహిత కీర్తి కుసుమ ప
రీమళముల దెసల ముసిరె రెక్కొన, శాస్త్రీ !

ప్రథిత యశులు సరస్వతీ రామకృష్ణ
పుణ్యదంపతులకు కూర్మి పుత్రుడవయి
జననమందిన నీదు పావన విధాన
జీవన ధన్యమయ్యె నృసింహ శాస్త్రి!

విష్ణుకుండిన రాజవిభవమ్ము లోకాన
ప్రకటించు అనుపమ ప్రతిభ నీది
సంస్కృతాంధ్రాది భాషా విశేషములు
సాధించినట్టి నిశిత ధిషణ నీది
మండల సర్వస్వ మహిత గ్రంథములు
సంధానించు నిష్ఠితోద్యమము నీది
కాసంతయును కీర్తికై ప్రాకులాడని
గణుతింపదగు మేలి గుణము నీది.

నీ చరిత పరిశోధనోన్మేష కలన –
కలరుచు తెలుగు విశ్వవిద్యాలయమ్ము
ఘన విశిష్ట పురస్కారమును నొసంగి
గౌరవించుట నీ కృషి గరిమ కాదె?
శ్రీ నృసింహ శాస్త్రీ! విజ్ఞతానిధాన!

భాసుర ధిషణాభరణో
ద్భాసిత చాతుర్యధుర్య! భాసిల్లు శిలా
శాసనలిపి వాణి పద
న్యాస విలాసమ్ము నీ మనఃఫలకమునన్

వలిగొండ కూతు మగనిని
గొలుచుచు వలిగొండలోని గుమి వేల్పుల కో
వెల నిర్మించిన పుణ్యో
జ్జ్వల చరితా! శ్రీ నృసింహశాస్త్రి! సూరివతంసా!

నవలలు, నాటకాది రచనల్ ప్రచురించియు, నిరంతర
ప్రవణత స్ఫూర్తిదాయిగను భారతదేశ చరిత్ర సంస్కృతి
వ్యవహృతమౌ బృహత్ కృతిని వ్రాయుచునుండిన శ్రీ నృసింహశా
స్త్రి! విమల జీవనా! విబుధ సేవన! పావన భావభాజనా!

భిన్నూరి వంశ జలధిని
పున్నమ చందురుడవగుచు పుట్టిన గుణ సం
పన్నుడవని నా కబ్బపు
కన్నె వరించినది నిన్ను గైకొను శాస్త్రీ!

తీయని గుండెలలో ఆ
త్మీయత కలబోసుకున్న ధీరాగ్రణి! దీ
ర్ఘాయురనామయ వృద్ధి
శ్రీయుతుడవు గమ్ము చంద్రశేఖర కరుణన్!

పాషాణమ్ముల వ్రాతలందు మరుగై వాసించు చారిత్రకా
శేషాంశమ్ములు సంతరించుచు శాస్త్రీ! భూరి గ్రంథావళీ
భోషాణమ్ముగ గూర్చినాడవు భవత్ బుద్ధి ప్రభావమ్ము వా
గ్యోషా భూషలుగా లసించుచు బుధామోదమ్ము నొందిన్ కడున్

**కీ.శే. వేముగంటి నరసింహాచార్య**

**(రచయిత తన 'ప్రియదర్శి' కావ్యాన్ని మూసీ వ్యవస్థాపకులు, పరిశోధకులు శ్రీ బి.ఎన్.శాస్త్రి గారికి అంకితం ఇస్తూ... చెప్పిన పద్యాలు.)**

# రాతిరి జాగారం ...




చుట్టూ ఇరుగ్గా గోడలు
ఒకదానికొకటి చుక్కెదురు
చూసుకుంటూ ఉంటాయి
కలుసుకునే వీల్లేక


ఆ చూపుల్లో ఎంత కలవరమో!
వాటి ముందు జరుగుతున్న
జీవిత చక్రపు గమనాన్ని
చెప్పుకోలేని
దాచుకున్న కథనాల
మౌన సాక్ష్యమై నిలిచినందుకు .



వాటి నడుమన
రెండు మనసులు
కల్లోల భాష్యంగా..
చెప్పాలని ఎంతున్నా
చెప్పేవి ఎన్నున్నా...
దగ్గరున్న దూరాలతో
గుప్పెడు గుండెను
మథిస్తున్న భావరాశిని
కనుపాపల్లో ముద్రిస్తూ...



మౌనానికి ఆవాసమిచ్చి
శబ్దాన్ని నిద్దుర పుచ్చి
ఊసులు ఊగని జోలతో
రాతిరి జాగారం...



మనసుకు కలుపుకోవడం
నేర్పనంతవరకు
సర్దుబాటు లేకున్నంతవరకు
జతగా వున్నా
చేసే ఒంటరి ప్రయాణం

**అరుణ ధూళిపాళ**
భువనగిరి, ఫోన్ : 87123 42323

# తుకారాం అభంగం

మనసు మంచిదైతే
మాట మంచిదగునోయి
మమత లోగిళ్ళ తనువు
మహా మందిరంబగునోయి

ముఖ భూషణమ్ము మాట
ముల్లు కానియ్యకోయి
కఠిన వాక్కుతోని పరుల
యదలు గాయపరచకోయి

కాలుతున్న తోట ప్రపంచం
పొదమాటలందు కాలకుమా
వెన్న వెండికొండ మాటలతో
ఎదుటి గుండె గెలువుమయ్యా

తుకా మాట శక్తి స్వరూపం
అమ్మలాంటిది మాట
మాటలోనే మహా సముద్రం
మాటే కదా మనిషి జీవితం




**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
ఫోన్ : 83283 33720

# కుతుబ్‌షాహీల ఆస్థానంలో తెలుగు కవులు – సాహితీ సేవ

**బట్టు విజయ్ కుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9505520097

తెలుగు భాష ఎంతో పురాతనమైనది. ఈ తెలుగు భాషను ఎంతో మంది పరదేశీయులు పొగిడారు. శ్రీకృష్ణదేవరాయలు **"దేశభాషలందు తెలుగు లెస్స"** అని, ఇటలీ దేశ రాయబారి అయిన నికోలోకాంటే **"ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్"** అని తెలుగు భాషను కొనియాడారు.

ఈ తెలుగు దేశంపై ఎంతో మంది విదేశీయులు దండయాత్రలు చేశారు. ఈ దేశాన్ని హిందూ, ముస్లిం, తెల్లదొరలు పరిపాలించారు. కానీ, తెలుగు భాషలో ఉన్న సంస్కృతి- సంప్రదాయాలు ఏమాత్రం చెక్కుచెదరలేదు. తెలుగు భాషలో ఉన్న మాధుర్యానికి ఆకర్షితులైనారు. తెలుగు సాహిత్యానికి ఆదరించి, అభ్యసించారు. తెలుగు దేశాన్ని పరిపాలించేవారు పరమతస్థులైన తెలుగును అత్యంత ప్రేమాభిమానంతో ఆదరించి, తెలుగు సాహిత్యపోషణ గావించారు.

కాకతీయులు, బహమని సుల్తానుల రాజ్య పతనానంతరం కుతుబ్‌షాహీలు రాజ్యానికి వచ్చారు. వీరు స్వతంత్రం ప్రకటించుకుని గోల్కొండను రాజధానిగా చేసుకుని పరిపాలించారు. కానీ, తెలుగు భాషను విస్మరించలేదు. ఈ వంశీయులు పార్శీతో పాటు తెలుగు సాహిత్యాన్ని, తెలుగు కవులను పోషించినవారు.

కుతుబ్‌షాహీ రాజ్యస్థాపకుడు సుల్తాన్ కులీ. ఇతనికి 'బడేమాలిక్', 'కుతుబ్-ఉల్-ముల్క్'. అతడు తురుష్క తెగ ఖారాకునీల్‌కు చెందినవాడు.

ఈ కుతుబ్‌షాహీలు గోల్కొండను కేంద్ర బిందువుగా చేసుకుని పాలించారు. వీరు గోల్కొండను క్రీ.శ. 1512 నుంచి క్రీ.శ. 1687 వరకు పాలించారు. వారు ...

1. కులీ – కుతుబ్ – ఉల్ – ముల్క్ (క్రీ.శ. 1518 – 1543)
2. జంషీద్ – కులీ (క్రీ.శ. 1543 – 1550)
3. సుభాన్ – కులీ (క్రీ.శ.1550 – 1550)
4. ఇబ్రహీం – కులీ – కుతుబ్‌షా (క్రీ.శ. 1550 – 1580)
5. మహమ్మద్ – కులీ – కుతుబ్‌షా (క్రీ.శ. 1580 – 1612)
6. మహమ్మద్ – కుతుబ్‌షా (క్రీ.శ. 1612 – 1626)
7. అబ్దుల్లా – కుతుబ్‌షా (క్రీ.శ. 1626 – 1676)
8. అబుల్‌హసన్ తానీషా (క్రీ.శ. 1672 – 1687)

(ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి. పుట:3)

గోల్కొండను స్వతంత్రగా ప్రకటించి రాజ్యస్థాపన చేశాడు సుల్తాన్‌కులీ-కుతుబ్-ఉల్-ముల్క్. ఇతడు మొఘల్ వంశస్థాపకుడైన బాబర్‌కు, చివరి ఢిల్లీ సుల్తాన్ అయిన ఇబ్రహీంలోడికి, శ్రీకృష్ణదేవ రాయలకు, మహమ్మద్‌షాకు, యూసఫ్ ఆదిల్‌షాకి సమకాలీకుడు.



ఇతని పూర్వీకులు మధ్య ఆసియాలోని దక్షిణ ఇరాన్‌లోని 'హందం' రాజ్యాధిపతులు. ఇతడు క్రీ.శ. 1451లో హందంలో జన్మించాడు. తల్లి మాలిక్ స్వాలె, తండ్రి షేక్‌కులీ. వీరు మధ్య ఆసియాలో రాజకీయ ప్రాబల్యం కోసం క్రీ.శ. 1463కి ముందే వీరికి మరో తెగ 'ఆకునేవ్'తో పోరాడారు. ఓటమిపాలైన ఇతని తండ్రి, అతని పినతండ్రి అల్లాకులీతో కలిసి యువకుడైన కులీ-కుతుబ్-ఉల్-ముల్క్ భారతదేశానికి వచ్చారు.

ఈయన తన పినతండ్రితో కలిసి దక్కన్‌లోని బహమనీ రాజ్య కేంద్రమైన గుల్బర్గాకు చేరుకున్నారు. వేటలో అతని ప్రావీణ్యాన్ని గమనించిన సుల్తాన్ సంతోషంతో అతని ఖర్చులకోసం కురంగల్ జాగీరును ప్రసాదించాడు. (తారీఖె మహమ్మద్ కుతుబ్ షా చరిత్ర గ్రంథం).

బహమనీ సుల్తానులు వీరిని ఆశ్రయం కల్పించారు. క్రీ.శ. 1496లో బహమనీ ప్రభువు సుల్తాన్ కులీని, కుతుబ్-ఉల్-ముల్క్ అనే బిరుదు ఇచ్చి, తెలుగు దేశంపైన అధికారిగా నియమించాడు. గోల్కొండ 'తరఫ్‌దార్'గా సుల్తాన్ కులీ పరిపాలించాడు. క్రీ.శ. 1518లో బహమనీ ప్రభువు మహమ్మద్‌షా మరణించేవరకు సామంతుడుగానే పరిపాలించాడు. ఆ తరువాత 'కుతుబ్‌షా' అనే బిరుదును పొంది స్వతంత్రుడయ్యాడు. బహమనీ పరిపాలనలో వరంగల్లు వరకే పరిమితమైన రాజ్యాన్ని క్రీ.శ. 1543 నాటికి మచిలీపట్నం దాకా విస్తరించాడు. గోల్కొండను కేద్ర బిందువుగా చేసుకున్నాడు.

గోల్కొండకు పూర్వం కొంత చరిత్ర కనిపిస్తుంది. అది గొల్లల కొండ. పాతకాలంలో గొల్లలు తమ గొర్రెలను, మేకలను ఆ పర్వత

సానువుల్లో మేపుకునేవారు. అందుకే ఆ గొల్లలకొండ జన వ్యవహారంలో గోల్కొండగా రూపెత్తిందని చరిత్ర చెబుతుంది. తన రాజ్యంలోని ప్రజలు ఎక్కువ శాతం హిందువులే ఉండటం చూశాడు. వాళ్ళ హృదయాలను గెలుచుకుంటే కానీ, తెలుగు దేశంలో తన రాజ్యాన్ని సుస్థిరం చేయలేనని సుల్తాన్ కులీ తెలుసుకున్నాడు. తాను పరదేశీయుడనీ, ఇతర మతం వాడనే భేదాభిప్రాయాలు రాకుండా ప్రజలను అనురాగంతో చూసుకున్నాడు.

గోల్కొండ రాజ్యస్థాపకుడైన సుల్తాన్ కులీకి ఆరుగురు కుమారులు. వీరు హైదర్ అలీ, కుతుబుద్దీన్, జంషీద్ కులీ, అబ్దుల్ కరీం, దౌలత్‌కులీ, ఇబ్రహీం కులీ కుతుబ్‌షా. వీరిలో ముఖ్యుడు ఇబ్రహీం కులీ కుతుబ్‌షా.

**ఇబ్రహీం కులీ కుతుబ్‌షా :**

తెలంగాణ చరిత్రలో ఇబ్రహీం కుతుబ్‌షా పాలన చాలా విషయాల్లో అద్వితీయమైంది. ఇబ్రహీం క్రీ.శ.1530 మే 29న జన్మించాడు. సుల్తాన్ కులీ సంతానంలో చివరివాడు. అన్న జంషీద్‌కు భయపడి విజయనగరం పారిపోయినప్పుడు అతని వయసు సుమారు పద్నాలుగు సంవత్సరాలు. అళియరామరాయల దగ్గర ఏడు సంవత్స రాలు తలదాచుకున్నాడు. అక్కడే తెలుగు కవులను పోషించడం చూశాడు. తెలుగులోని మాధుర్యాన్ని గ్రహించాడు. అప్పుడే, అక్కడే సాహిత్య బీజాలుపడ్డాయి.

ఇబ్రహీం తిరిగి క్రీ.శ.1550 జూలై 27న గోల్కొండలో కాలు పెట్టాడు. అళియరామరాయల మద్దతుతో గోల్కొండ చేరి, శత్రువులను ఓడించి సింహాసనాన్ని అధిష్టించాడు. గోల్కొండ కేంద్రంగా తెలుగు ప్రజలను సుమారుగా రెండు శతాబ్దాలపాటు పరిపాలించిన కుతుబ్‌షాహీ సుల్తానులు స్థానిక ప్రజల మాతృభాష తెలుగును ఆదరించారు. వీరిలో కొందరు తెలుగు భాషలో పట్టుసాధించారు. వీరి పోషణలో రాజ్య ఆదరణ పర్షియన్, అరబిక్, ఉర్దూ భాషలకు లభించింది. అనేక తెలుగు కవులను, పండితులను వీరు ఆదరించారు. కాకతీయ, విజయనగర రాజుల మాదిరిగా కుతుబ్ షాహీలు పరమతస్థులైనప్పటికీ తెలుగు భాషా వికాసానికి కృషిచేశారు.

**కుతుబ్‌షాహీల తెలుగుభాషా పోషణ :**

గోల్కొండ సుల్తానుల కాలంలో పార్శీ రాజభాషగా ఉండేది. అయినా స్థానిక భాషయైన తెలుగును గౌరవించి తగిన ప్రతిపత్తిని కుతుబ్‌షాహీలు ఇచ్చారు. వీరి ఆస్థానంలో ప్రధానంగా అద్దంకి గంగాధరకవి, పొన్నగంటి తెలగన్న, కందుకూరు రుద్రకవి, సారంగ తమ్మయ్య, మరింగంటి సింగరాచార్యులు కనిపిస్తారు.

ఇబ్రహీం కుతుబ్‌షాకు అద్దంకి గంగాధరకవి తన రచన 'తపతీ సంవరణోపాఖ్యానాన్ని' సుల్తాన్‌కు అంకితమిచ్చాడు. కందుకూరు రుద్రకవి పాండిత్యం వల్ల ప్రభావితుడైన సుల్తాన్ అగ్రహారాన్ని దానంగా ఇచ్చాడు. 'పఠాన్ చెరువు' ప్రాంతానికి అధికారిగా ఉన్న అమీన్‌ఖాన్ పొన్నగంటి తెలగనార్యుణ్ణి ఆదరించారు. తన గ్రంథం 'యయాతి చరిత్ర'ను అంకితం పుచ్చుకున్నాడు. అచ్చ తెలుగులో రాసిన మొట్టమొదటి తెలుగు గ్రంథం యయాతి చరిత్ర. ఇబ్రహీం–కులీ–కుతుబ్‌షా ఔదార్యాన్ని, పాండిత్యాన్ని పొగుడుతూ అనేక మంది కవులు చాటువులు రాశారు.

ఇబ్రహీం కులీ కుతుబ్‌షా వారసుడైన మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో తెలుగు భాష మరింత వికాసం పొందింది. ఇతని ఆస్థానకవి గణేశ పండితుడు. సారంగతమ్మయ్య మహమ్మద్–కులీ–కుతుబ్‌షా ఆస్థానానికి చెందిన మరో తెలుగు కవి. ఇతని రచన 'వైజయంతీ విలాసం'. సారంగతమ్మయ్య గోల్కొండ రెవిన్యూ అధికారిగా (కరణం) పనిచేశాడు. ఇదే యుగానికి చెందిన క్షేత్రయ్య గొప్ప తెలుగు పదకవిత కర్త. ఇతడు అబ్దుల్లా–కుతుబ్‌షాకు సమకాలీకుడు. సుల్తాన్ ఆస్థానాన్ని సందర్శించిన క్షేత్రయ్య అతనిపై వేయ్యికి పైగా పదకీర్తనలు పాడాడని చరిత్రకారులు చెబుతారు.

**తెలుగు కవులు – సాహితీ సేవ :**

కుతుబ్‌షాహీలలో తెలుగు సాహిత్య రుచినాస్వాదించి, తెలుగు కవుల సాంగత్యంతో సాహిత్య పోషణ చేశాడు ఇబ్రహీం కులీ కుతుబ్‌షా.

**అద్దంకి గంగాధరకవి**

కుతుబ్‌షాహీల ఆస్థాన కవులలో అద్దంకి గంగాధరకవి అగ్రగణ్యుడు. ఈయన ప్రసిద్ధ రచన "తపతీ సంవరణోపాఖ్యానం". ఇది ఐదాశ్వాసాల ప్రబంధము. దీనిని ఇబ్రహీం కుతుబ్‌షా అంకితం ఇమ్మని అడిగిన పద్యం–

పెక్కుకృతుల్ చమత్కృతులు పెంపుగ నందితిగాని నీదు స
మ్యక్కృతి కన్యపైగల మమత్వము వర్తిలదెందు లెక్క కుం
బెక్కువగాగ గోపికలు మించి వసించిననేమి రాధపై
మక్కువ యెక్కువై మిగుల మన్నన సేయడె శౌరివేడుకన్
(పీఠిక: పుట–14.)

తే.గీ. అట్లుగావున భారతాఖ్యానమందు
గలుగు తాపత్య చరితంబు ఘనత నరసి
వివిధ శృంగార మహిమల విస్తరించి
కబ్బమొనరింపు నాపేర గవివరేణ్య (పీఠిక: పుట–14.)

గోపికలు ఎంతమంది ఉన్న కృష్ణునికి రాధపైనే మక్కువ ఎక్కువ. కుతుబ్‌షాహీ ఎన్ని గ్రంథాలు అంకితమందుకున్న గంగాధర తపతీసంవరణోపాఖ్యానంపై ఇష్టం ఉందని చెబుతాడు. తపతీసంవరణుల గాథను కుతుబ్‌షాహీ, భాగీరథికి నడుమ నడచిన శృంగార గాథగా మలిచమని కోరాడు.

తపతీసంవరణోపాఖ్యానం అనే ఉపాఖ్యానం మహాభారతంలో ఆదిపర్వంలో ఉంది. ఇందులో ఏడు ఆశ్వాసాలు 23 పద్యగద్యాలతో

నన్నయ రచించారు. దానిని గంగాధరకవి సుమారు 500 పద్యగద్యాలతో ఐదు అశ్వాసాలతో, వివిధ వర్ణనలతో, కల్పనతో శృంగార ప్రబంధంగా చిత్రీకరించాడు.

చ॥ వలపుల పూత పూసి, తలవంకను వెన్నెలపూవుదాల్చి, చెం
గలువ మెఱుంగురంగు గలకంబు ధరించి మిటారిజంగమై
వెలదిని జట్టుకూతుమది వెన్నవలెం గరగించు దేవుడి
**మ్మలికిభరాము శాహి**కి సమంచిత సంపద లిచ్చుగావుతన్
(ప్రథమా.పుట:67)

తెలుగు కవులు అతన్ని 'ఇభరాముడు, మల్కిభరాముడు' అనే పేర్లతో కీర్తించారు.

**పొన్నగంటి తెలగన**

ఈయన అచ్చ తెలుగు కావ్యానికి ప్రాణం పోశాడు. ఈయన రచన "యయాతి చరిత్ర". తెలుగు సాహిత్యంలోనే మొదటి అచ్చ తెలుగు కావ్యానికి గోల్కొండ వేదిక అయ్యింది. ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలోని ఉపాఖ్యానం యయాతి కథ, దీనినే తెలగన తన పాండిత్యప్రకర్షతో 775 గద్యపద్యాలతో ఐదు ఆశ్వాసాల ప్రబంధంగా తీర్చిదిద్దారు. గోల్కొండ రాజ్యంలోని పొట్లచెర్వు (నేటి పటాన్ చెరువు) అధికారి అయినా అమీన్‌ఖాన్‌కు ఈ రచనను అంకితం చేశాడు. ఇదే తెలుగులో మొట్టమొదటి అచ్చతెనుగు కావ్యం.

సంస్కృత భాషా పదాలను వాడకుండా దేశి తద్భవ పదాలను మాత్రమే వాడి కవి ఈ కావ్యాన్ని రచించాడు. కొన్ని సంస్కృత పదాలను కవే స్వయంగా అనువదించి దేశీపదాలను తయారు చేసుకున్నాడు కూడా. ఉదా॥ పంచవదనుడు = ఐదు మోముల వేల్పు. హిరణ్యగర్భుడు = కడుపు బంగారు బొక్కసము చేసిన మేటి. వాల్మీకి = కనువినుకలి తావు చూలి. బ్రహ్మ = నీటి పుట్టుగు పట్టి, పక్కడాల్ వేలుపు, పొక్కిలి పసిబిడ్డ. హిమవంతుడు = మరుమేపుకందొక మామగారు. కవి అష్టాదశ వర్ణనలు చేశాడు. అచ్చతెనుగులో ఒక్క పద్యం వ్రాయటమే కష్టం. అటువంటిది మొత్తం కావ్యాన్ని వ్రాయటం అద్భుత కార్యమే. కవి దాన్ని ఇట్లా చెప్పుకున్నాడు.

ఉ॥ అచ్చతెనుంగుపద్యమొకటైనను గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుండురది యెన్నుచు నేర్పున బొత్తమెల్లని;
ట్లచ్చ తెనుంగునన్నొడువ నందుల చందమెఱుంగువారునిన్,
మెచ్చరొయబ్బురం బనరొమేలనరో కొనియాడరో నినున్
(పుట:11)

కావ్యంలో ఒక్క అచ్చతెలుగు పదం వస్తేనే ఎంతో మెచ్చుకుంటారు. అదే కావ్యం మొత్తం అచ్చతెలుగులో ఉంటే అందులోని అందచందలను చూసి అబ్బురమని, మేలని కొనియాడుతారని ఈ పద్యంలో చెప్పుకున్నాడు.

**సారంగు తమ్మయ**

సారంగ తమ్మయ్య 'వైజయంతి విలాస'మనే శృంగార ప్రబంధాన్ని వ్రాసాడు. దీనికి 'విప్రనారాయణ చరిత్ర' అని కూడా పేరు. ఇది 4 ఆశ్వాసాల ప్రబంధం. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర గోల్కొండ సుల్తాను మహమ్మదు కుతుబ్ షా (క్రీ.శ. 1581-1611) కాలంలో గోల్కొండ కరణంగా పనిచేసాడు. ఈ కవి తన కావ్యాన్ని తన ఇష్టదైవం శ్రీరాముని అంకితంగా ఇయ్యడం విశేషం. తమ్మయ సంస్కృతంలో ఉన్న దివ్యసూరి చరితము అనుసరించి విప్రనారాయణుని కథను వ్రాసాడు. ఇతని కవిత్వం సరసంగా ఉంటుంది. అక్కడక్కడ ఔచిత్యాన్ని మించిన శృంగార వర్ణనలున్నాయి. పాత్రచిత్రణలను కవి సహజంగా చేసాడు. తమ్మయ్య విశిష్టాద్వైత మతానుయాయి. వైష్ణవ సంప్రదాయాలను అక్కడక్కడ వర్ణించాడు.

ఉ॥ కాకులు రావిపండ్లు దిని క్రక్క శిలామయ దేవ మందిరా
నీకములందు రావులు జనించును సజ్జన చిత్తవృత్తియ
వ్యాకుల లీలఱాతిగుడి వంటిది లోకములోన వేశ్యలున్
గాకుల వంటి వారలటుగాన బ్రమాదము చేర నిచ్చినన్
(ద్వితీయా. పుట:50)

ఆనాటి కాలంలో వేశ్యావృత్తి బలంగా ఉండేది. ఎంతవారలైన వేశ్యలు దిగజార్చిన సంఘటనలున్నాయి. రాతిగుడి వలె గట్టితనం పవిత్రత కలిగిన సజ్జనుల మనసులో రాగివృక్షం అనే రాగాన్ని ఉదయింపచేయగల నీచజాతి పక్షులైన కాకుల వంటివారని వివరించాడు.

**మరింగంటి సింగరాచార్యులు**

మరింగంటి సింగరాచార్యుల కుటుంబీకులు సంస్కృతాంధ్ర పండితకవులు. ఇభరాముని యాశ్రితులే. సింగరాచార్యులు ఇబ్రహీం ద్వారా మణిమాణిక్యాలను పొందినట్లు ప్రతీతి. ఈయన 'దశరథ రాజనందన చరిత్ర', 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము సుప్రసిద్ధ గ్రంథాలు. వైష్టవ సంప్రదాయానికి అంకితమైన వంశం వీరిది.

చ. యువతి వసంత, సంతత సముజ్జ్వల నీతివిధాన, దానవై
భవగుణ దక్ష, దక్షరిపుభావ సరోరుహ సంగ, సంగర
ప్రవిమల సత్య, సత్వరిత పక్షినృపాలక కాండ, కాండస
ద్భువన నివాస, వాసవ సభోగమునిస్తుత విక్రమక్రమా
(ద్వితీయ. పుట:123)

ఈ పద్యం చూస్తే సింగరాచార్యుల శైలీ, పాండిత్యం కనిపిస్తుంది. ఇందులో ఛేకానుప్రాస అలంకారం కనిపిస్తుంది. ఈ పద్యం చక్కగా, సరళంగా నడిచింది.

**కందుకూరి రుద్రకవి**

కందుకూరి రుద్రకవి విశ్వబ్రాహ్మణుడని చాటుపద్యాల వల్ల తెలుస్తున్నది. గోల్కొండ రాజు మల్కిభరాముడు రుద్రకవికి నల్లగొండ జిల్లాలోని చింతలపాళెంను అగ్రహారంగా దానమిచ్చినట్లు ఒక

శాసనం (క్రీ.శ.1558) వల్ల తెలుస్తున్నది. కందుకూరి రుద్రకవి 'జనార్దనాష్టకము', 'సుగ్రీవ విజయమ'నే యక్షగానం, 'నిరంకుశో పాఖ్యాన' కావ్యం రచించాడు. జనార్దనాష్టకములో "కందుకూరి జనార్దనా" మకుటంతో ఎనిమిది పద్యాలున్నాయి. ఇది శృంగార రసభరితం. వర్ణనలు రమ్యంగా ఉన్నాయి. "దనుజ మర్దన కందుకూరి జనార్దన" మకుటంతో ఉంది. మాత్రా ఛందస్సులో వ్రాయబడింది. ఆ తర్వాత తెలుగులో అష్టకాల రచన జరిగింది. రుద్రకవి రచన రమణీయంగా ఉంది.

"సుగ్రీవ విజయం" తెలుగులో మొట్టమొదట యక్షగానం. సీతాన్వేషణ నుంచి సుగ్రీవుని పట్టాభిషేకం వరకు రామాయణ వృత్తాంతం ఉన్నది. కరుణాది రసాలను బాగా పోషించాడు. దీనిలో పాటలు, ఏలలు, వచనాలు, ద్విపదలు ఉన్నాయి. సంగీతబద్ధం, యక్షగానం కాబట్టి సంవాద శైలికే ప్రాధాన్యం ఉంది. దీన్ని రుద్రకవి కందుకూరి జనార్దన దేవునికి అంకితంగా ఇచ్చాడు. ఆ జనార్దనదేవుని వసంతోత్సవ సమయంలో ఈ యక్షగాన నాటకం ప్రదర్శింపబడి వుంటుంది.

నిరంకుశోపాఖ్యానంలో నాయకుడు నిరంకుశుడు. ఈ కృతిలో నిరంకుశుని భార్యను కవి వ్యక్తిత్వం గల పాత్రగా చిత్రించడం విశేషం. ఇది నాలుగు ఆశ్వాసాల కావ్యం. కందుకూరులో వెలసిన సోమేశ్వరునికి అంకితంగా ఇచ్చాడు. ఇది ప్రౌఢశైలిలో ఉంది. వర్ణనలు రమ్యంగా ఉన్నాయి. కందుకూరు నల్లగొండ జిల్లాలో ఉ ందని ప్రసిద్ధ చారిత్రకులు బి.ఎన్.శాస్త్రి అన్నారు.

కుతుబ్‌షాహీ కాలంలో తెలుగును అత్యంత ఆదరణ లభించింది. దానికై తెలుగు కవులు చాటువులుగా పద్యాలు చెప్పుకున్నారు. ఇబ్రహీం హఠాత్తుగా మరణించాడనే మరణవార్త విని తట్టుకోలేక ఒక కవి ఈ కింది చాటు పద్యం విధాతను నిందిస్తూ–

ఉ॥ రార విధాత యోరి వినరా! తగురా! తలకొట్టమారి! ని
స్సారపు లోభిరాజులను చంపక మల్కిభరామభూవరున్
చారు యశోధనున్ సుగుణి చంపి యవార్థులకేమి దిక్కురా!
చేరిక నింత రాజును సృజింపగ నీ తరమా! వసుంధరన్!
(చాటువు)

కవులను, సాహిత్యాన్ని పోషించిన కవిరాజు చనిపోవడం వల్ల తమ దు:ఖము ఆపుకోలేక కవులు బ్రహ్మను నిందించారు. ఇలాంటి రాజు మళ్ళీ ఈ భూమిపైన పుట్టించగలవా! అని ప్రశ్నించారు.

ఉ॥రాముడు దుక్కిముచ్చు, రఘురాముడు క్రోతుల రోజు, రేణుకా
రాముడు పోటుబంటు, పటురాగ సమంచితుడైన గోపికా
రాముడు వెర్రి గొల్ల, డిక రాష్ట్రములందు సమానులేరయా
రాముల నెంచి చూడ నిభరామ మహీధర భవ్య వైభవా!
(చాటువు)

ఈ చాటువులో మన పురాణాలలోని ఏ రాముడూ ఇతనికి సాటిరారని కీర్తిస్తూ పదిహేడవ రాజుగా కీర్తించారు.

**ముగింపు**

తెలుగు సాహిత్యంలో ఈ కుతుబ్‌షాహీల యుగం ఒక విశిష్టతను సంతరించుకుంది. పార్శీ, ఉర్దూ భాషలు ఉన్న సమయంలో తెలుగు సౌందర్యాన్ని, మాధుర్యాన్ని ఆకర్షితులైనారు. తెలుగు కవులను, సాహిత్యాన్ని పోషించడమే కాకుండా అంకితం పుచ్చుకున్నారు.

వీరి కాలంలోనే అచ్చతెలుగు కావ్యం 'యయాతి చరిత్ర' పురుడు పోసుకుంది. ముస్లింల పాలనలో ఉర్దూ భాష చలామణిలో ఉన్న సమయంలో తెలుగుపై ఆ భాషల ప్రభావం పడకుండా జాగ్రత్తపడి అచ్చ తెలుగు పురుడుపోసుకోవడం అంటే గర్వించదగ్గ విషయం.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. అరుణకుమారి, జి. గంగాప్రసాద్, మల్లెగోడ. (సంపా), (2018), కాకతీయుల నుండి అసఫ్ జాహిల వరకు తెలంగాణ, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్.
2. ఆరుద్ర. (2003), సమగ్రాంధ్ర సాహిత్యం, తెలుగు అకాడమి, హైదరాబాద్.
3. గంగాధరుడు, అద్దంకి. (2018), తపతీ సంవరణము, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్.
4. చక్రపాణి, కాకాని. (2011), కుతుబ్‌షాహీలు, ఎమెస్కో బుక్స్, హైదరాబాద్.
5. చిరంజీవి, నార్ల. భాగ్యనగరము, (1965), తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్.
6. ప్రతాపరెడ్డి, సురవరం. (1949), ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హైదరాబాద్.
7. భారతి మాసపత్రిక, (1926), *గోలకొండ కుతుబ్‌షాహి వంశము*, చెన్న పట్టణము.
8. శాస్త్రి, బి.ఎన్. (1990), ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి, మూసీ పబ్లికేషన్స్, హైదరాబాద్.
8. శ్రీకాంత్ కుమార్, ఎం. (సంపా), (2015), తెలంగాణ – గోల్కొండ తెలుగు కవుల సాహిత్య సేవ, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్.
9. సింగరాచార్య, మరింగంటి. (2019), దశరథ రాజనందన చరిత్ర, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్.
10. సుజాతారెడ్డి, ముదిగంటి.(2015), *తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర*, తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 11 హైదరాబాద్ డిసెంబర్ : 2023

# శ్రీమద్భగవద్గీత – యోగనిష్ఠ (కర్మయోగం) విశేషాలు

డా॥ వీపూరి వెంకటేశ్వర్లు, కర్నూలు, ఫోన్ : 9885585770



భగవద్గీత జగత్తులో ఉన్న మానవమాత్రుణ్ణి, అంటే మానవుడని చెప్పబడే ప్రతీ ఒక్కణ్ణీ, ఉద్దేశించి చేసిన మహోదాత్తోపదేశం. అందుచేత ఇది విశ్వజనీనం. జగత్తులో ఉన్న ప్రతీ మానవునికీ అభ్యుదయాన్నీ, (ఇహలోక – పరలోకాలలో సౌఖ్యాన్ని) శ్రేయస్సునూ (మోక్షాన్నీ అంటే శాశ్వతానందమయ స్థితినీ) సమకూర్చే ఇలాంటి ఉపదేశం చేసిన శ్రీకృష్ణుడు జగద్గురువు అనడంలోనూ, దేశ–కాల–జాతి భేదాదులకు అతీతమైన భగవద్గీత, కేవలం భారతదేశానికి మాత్రమే సంబంధించిన రాష్ట్రీయ గ్రంథం కాకుండా విశ్వజనీన గ్రంథం అనడంలోనూ సందేహం ఉండడానికి ఏ మాత్రమూ అవకాశం లేదు.

ఎందుకంటే సనాతన ధర్మానికి చెందిన ఉత్కృష్టమైన గ్రంథాల్లో ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత అనేవి చాలా ముఖ్యమైనవి. వీటిని ప్రస్థానత్రయం అంటారు. భారతావనిలోని ఆధ్యాత్మికతత్త్వ సారమంతా ఈ గ్రంథాల్లో నిక్షిప్తమై ఉంది. అందుకే త్రిమతాచార్యులు ప్రస్థాన త్రయానికి భాష్యాలు రాసి, ఆత్మతత్త్వాన్నీ – ధర్మతత్త్వాన్నీ చక్కగా వివరించారు.

వేదాల యొక్క చివరి భాగాలైన ఉపనిషత్తుల్ని 'వేదాంతాలు' అని పేర్కొంటారు. ఆ ఉపనిషత్తుల సారమే భగవద్గీత.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।**
**పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**
**(గీతామాహాత్మ్యం – 6)**

ఉపనిషత్తులన్నీ గోవులు. పాలు పిదికేవాడు గోపాలబాలుడైన కృష్ణుడు. అర్జునుడు దూడ. బుద్ధిమంతుడైనవాడే ఆ క్షీరాన్ని సేవించ దగినవాడు. భగవంతుడు గొప్పదైన 'గీత' అనే అమృతాన్ని ఆ గోవులనుంచీ పిదికాడు.

ఈ శ్లోకం భగవద్గీత ఉపనిషత్తుల సారమని ప్రకటిస్తున్నది. గీతలనే పేరుతో పలుగీతలు ప్రచారంలో ఉన్నాయి. శివగీత, రామగీత, అష్టావక్రగీత... ఇలా నలుబదికి పైగా గీతలు పురాణాలలో, తదితర గ్రంథాలలో మనకు కన్పిస్తున్నాయి. శివుడు చెప్పిన గీత శివగీత అన్న విధంగా ఆయా వక్తల పేర్లతోనే ఆ గీతలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ శ్రీకృష్ణుడు చెప్పిన గీతను 'కృష్ణగీత' అని కాక, 'భగవద్గీత' అనే పేరుతో లోకంలోకి ప్రచారం వచ్చింది. ఈ పేరు కూడా ఈ గ్రంథం యొక్క ఉత్కృష్టతను చాటుతుంది.

భగవద్గీతను ఉపనిషత్తులనే కాక 'బ్రహ్మ విద్య, యోగ శాస్త్రం' అని కూడా వ్యవహరిస్తారు. బ్రహ్మప్రాప్తికి అవసరమైన విద్యను బోధించిన గ్రంథం కాబట్టి ఇందులోని విద్య బ్రహ్మ విద్యగా ప్రసిద్ధిపొందింది. భగవద్గీతలో ప్రసక్తానుప్రసక్తంగా అనేక విషయాలను గూర్చి చెప్పడం జరిగింది. అయితే వీటి అన్నింటిలోను ప్రధానమైన విషయం ఆత్మస్వరూప నిరూపణం. ఆత్మ అంటే అఖండమైన చైతన్యం. ఇది అంతటా వ్యాపించి ఉన్న పరమార్థ సత్యం. దీనికే 'బ్రహ్మ' అని పేరు. అందుకే ఈ గ్రంథానికి 'బ్రహ్మ విద్య' అనే పేరు వచ్చింది. అలాగే కర్మ – భక్తి – ధ్యాన – జ్ఞాన యోగాల్ని చెప్పిన శాస్త్రం కాబట్టి యోగశాస్త్రమయింది. శ్రీకృష్ణార్జునుల సంవాద రూపంలో అది వ్యాసుడిచే విరచితమైనది.

గీత ఒక స్వతంత్ర గ్రంథం కాదు. మహాభారతంలోని భీష్మ పర్వంలో 25వ అధ్యాయం నుంచి 42వ అధ్యాయం వరకు గల 18 అధ్యాయాలే భగవద్గీత. ఇందులో మొత్తం 700 శ్లోకాలున్నాయి. భగవద్గీతలోని అధ్యాయాల పేర్ల చివర 'యోగము' అని పేర్కొనడం గమనార్హం. ఈ 18 అధ్యాయాలలో ప్రతిపాదించిన విషయాలను బట్టి ఒక్కొక్క అధ్యాయానికి 'అర్జున విషాదయోగః', 'సాంఖ్యయోగః' ఇత్యాది నామధేయాలు ఇవ్వబడ్డాయి. కనుక ఒక్కొక్క అధ్యాయం ఒక్కొక్క యోగాన్ని బోధిస్తున్నదనీ, అవి సాంఖ్యయోగ – కర్మయోగాలు ఎంత ప్రధానమైనవో అంత ప్రధానమైనవనీ సమర్థించవలసిన పనిలేదు.

శత్రువుల్ని ఒక నిమిషంలో హతమారుస్తానని ప్రతిజ్ఞ చేసిన అర్జునుడు తీరా రణరంగంలోకి వెళ్ళిన తర్వాత ఇరుపక్షాల్లోనూ ఉన్న బంధువుల్ని చూసి, వాళ్ళను చంపాల్సి వచ్చినందుకు శోకించాడు. బంధువ్యామోహం అతణ్ణి కర్తవ్య విముఖుణ్ణి చేసింది. మళ్లీ అతణ్ణి కర్తవ్య సుముఖుణ్ణి చేయడానికి శ్రీకృష్ణుడు ఆత్మతత్త్వాన్ని వివరించే గీతను బోధించాడు. దీనిని కొందరు అధ్యాత్మజ్ఞాన సంపాదనకు విషాదం కూడ చాలా ముఖ్యమైన ఆవశ్యకస్థితి అనీ, అందుచేతనే

భగవద్గీత అర్జున విషాదంతో ప్రారంభమయినదనీ కొందరంటుంటారు. అయితే ఇలాంటివన్నీ విషయ ప్రవేశం తక్కువగా ఉన్న వారికి మాత్రమే శ్రవణ మనోహరంగా ఉండే మాటలు. ఆత్మ జ్ఞానానికి కావలసింది విషాదం కాదు; విషాదగంధ శూన్యమైన వైరాగ్యం. అందుచేతనే శ్రీకృష్ణుడు ప్రసంగ వశం చేత అర్జునునికి జ్ఞాన మార్గాన్ని గూర్చి చెప్పినా – నీకు కర్మమార్గంలోనే అధికారం **'కర్మణ్యే వాధికారస్తే'** అని కచ్చితంగా అన్నాడు. కనుక ఈ మొదటి అధ్యాయానికి 'అర్జున విషాదయోగం' అని పేరుందంటే అర్థం. దీనిలోని విషయం 'అర్జున విషాద వర్ణనం' అని మాత్రమే! ఇతరాధ్యాయాల పేర్ల విషయంలో కూడా ఇంతే!

మనిషిలో సహజంగా ఉన్న స్వార్థపరత్వాన్ని ఏ మాత్రం నియంత్రణ లేకుండా వదిలిపెడితే భూమండలం మీద సుఖశాంతులు పూర్తిగా కరువైపోతాయి. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పిన 'మాత్స్యన్యాయం' (పెద్ద చేప చిన్న చేపను మ్రింగి వేసే పద్ధతి) ప్రబలమౌతుంది. బలవంతుడు దుర్బలుణ్ణి పీడిస్తాడు. కొన్నాళ్ళకు వాడూ మరొక బలవత్తరుని చేత మ్రింగబడిపోతాడు. లోక వినాశనానికి దారితీసే స్వార్థపరత్వ ప్రవృత్తిని అణచి ఉంచాలంటే రెండే ఉపాయాలు – మొదటిది దండం; రెండవది మానవుని మనస్సులోనే మార్పు తీసుకొని వచ్చే తత్త్వదర్శనం. మొదటి ఉపాయం వల్ల కలిగే ఫలితం తాత్కాలికమైనది. రెండవ దానివల్ల కలిగేది అంతకంటే ఎక్కువ కాలం నిలుస్తుంది. ఈ రెండవ ఉపాయం ద్వారా దారి చూపి, మానవులలోను, తద్ద్వారా సకల ప్రాణి లోకంలోను సుఖశాంతులు నిలపడం కోసం, పరమేశ్వరుడు స్వయంగా అప్పుడప్పుడు వివిధ రూపాలలో అవతరిస్తుంటాడు. లేదా కొందరు మహాపురుషులలో తన అంశను, శక్తిని ప్రవేశపెట్టి తద్ద్వారా ఈ కార్యం సాధిస్తుంటాడు.

అయితే ఒక్క అర్జునుడే కాదు, ప్రతివాడూ తన జీవితంలో ఎన్నో చిక్కు సమస్యల్ని ఎదుర్కొంటాడు. వాటి పరిష్కారానికి ఒక మార్గదర్శకుడి ప్రబోధ సహాయం అవసరమవుతుంది. అట్టి ప్రబోధమే భగవద్గీత. ఇది ఒక్క పార్థుడికే కాక జీవితంలో క్లిష్ట సమస్యలనెదుర్కొనే ప్రతి వ్యక్తికీ అవసరమే!

మహాత్మాగాంధీ తన జీవితంలో ఎదురైన గడ్డు పరిస్థితిని ఎదుర్కోవడానికి భగవద్గీతను చదివేవాడిననీ, గీతలోని ఏదో ఒక శ్లోకం తనకు మార్గదర్శనం చేసేదనీ చెప్పినారు.

నిశితంగా పరిశీలించి చూస్తే అనాది కాలం నుంచి అజ్ఞాన వశంతో సంసారంలో మునకలు చేస్తున్న మానవులను ఉద్ధరించి, వారికి పరమాత్మ ప్రాప్తిని కల్గించడమే గీత యొక్క పరమ లక్ష్యమని స్పష్టమవుతుంది. అందుకే మానవులు తమ ప్రాపంచిక కర్తవ్య కర్మలను చక్కగా ఆచరిస్తూ, పరమాత్మ ప్రాప్తిని పొందుటకు ఇందులో అనేక మార్గాలు సూచించబడినాయి. ఇందులో ప్రతిపాదించబడిన జ్ఞాననిష్ఠ (సాంఖ్యయోగం), యోగనిష్ఠ (కర్మయోగం) అనే రెండు మార్గాలలో మానవులు తమతమ యోగ్యతలను బట్టి (3/3) దేనిని అనుసరించినా పరమాత్మను పొందవచ్చు. దాదాపు శాస్త్రాలన్నింటిలోను భగవత్ప్రాప్తికి కర్మ, భక్తి, జ్ఞాన మర్గాలు మూడు ప్రధానంగా తెల్పబడినాయి. మరి గీతలో రెండే మార్గాలు సూచించబడినాయి. గీతకు భక్తి మార్గం ఆదరణీయం కాదా? అంటే లోకంలో చాలామంది గీతోపదేశం భక్తి ప్రధానమైనదేనని భావిస్తారు. అక్కడక్కడ శ్రీకృష్ణుడు గీతలో భక్తి యొక్క విశేషమహిను (6/47) తెల్పి, భక్తి ద్వారా తనను పొందడం సులభమని (8/14) పేర్కొన్నాడు. అందువల్ల శాస్త్రాలలో ప్రస్తావించబడిన ఉపాసనా (భక్తి) మార్గం జ్ఞాన, యోగనిష్ఠలలో అంతర్భాగమనే తలచాలి. సాధకుడు అభేద భావంతో భగవంతుణ్ణి ఉపాసించినప్పుడు అది సాంఖ్యయోగంలో భాగమని, భేద దృష్టిలో ఉపాసించినప్పుడు అది కర్మయోగంలో అంతర్భాగమని గ్రహించాలి. సాంఖ్య, కర్మ యోగాలలోని తారతమ్యమిదే! అలాగే 13వ అధ్యాయం క్షేత్ర – క్షేత్రజ్ఞ విభాగయోగంలో 24వ శ్లోకంలో–

**"ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా।**

**అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే॥** అని భగవంతుడంటాడు. అంటే కేవలం ధ్యాన సాధన ద్వారా పరమాత్మ ప్రాప్తి కలుగుతుందని తెల్పబడింది. కాని, అక్కడ కూడా ధ్యానాన్ని అభేద దృష్టితో చేస్తే – అది జ్ఞాననిష్ఠలో భాగమనీ, భేద దృష్టితో చేస్తే – అది యోగనిష్ఠలో అంతర్భాగమనీ గ్రహించాలి.

భక్తి భగవత్ప్రాప్తికి ప్రధాన సాధనమేనని గీత ప్రతిపాదించినట్లు లోకులు విశ్వసించడం సరైనదే! అన్ని సందర్భాల్లో భక్తికే పెద్ద పీటవేసి, గీత అర్జునుణ్ణి భక్తుడవుకమ్ము (9/34; 12/8; 18/57, 65, 66) అని ఆజ్ఞాపించింది. కాని గీత రెండు నిష్ఠలనే ప్రతిపాదించింది. అయితే భక్తి మాత్రం యోగ (కర్మ) నిష్ఠలోనే అంతర్భాగం. ఎందుకంటే భక్తిలో ద్వైత భావముంటుంది.

జ్ఞానశబ్దం యొక్క అర్థం కూడ కేవలం 'జ్ఞానయోగం' అని కాదు. వివిధ సాధనా మార్గాల ఫలస్వరూపానికి 'జ్ఞానం' అనే అర్థం. అంటే అది జ్ఞాన, యోగనిష్ఠల రెండింటి ఫలస్వరూపమే! దాన్నే యథార్థ జ్ఞానమనీ, తత్త్వజ్ఞానమనీ పేర్కొనాలి.

జ్ఞాననిష్ఠ అంటే "జగత్తంతా మృగతృష్ణలోని నీటి వలె, స్వప్నంలోని దృశ్యాలవలె మాయామయం. కనుక మాయా కార్య రూపాలైన గుణాలే గుణాలలో వర్తిస్తాయి. ఈ విధంగా భావించి, శరీరేంద్రియ మనస్సుల ద్వారా ఆచరించే సమస్త కర్మలలో కర్తృత్వాభిమానం లేకపోవడం (5/8,9), అట్లే సర్వవ్యాప్తియైన సచ్చిదానంద ఘన పరమాత్మ స్వరూపంలో ఏకీభావంతో నిత్యస్థితులైయుండి, భగవంతుడు తప్ప అన్యమైన దేనిపట్ల అస్తిత్వభావం లేకపోవడం (13/30)". దీన్నే జ్ఞాననిష్ఠ, సాంఖ్యయోగం, కర్మ సన్న్యాసం అని కూడా అంటారు.

యోగనిష్ఠ అంటే సమస్తం భగవంతునికి చెందినదేనని భావించి, సిద్ధి – అసిద్ధిల పట్ల సమభావాన్ని ఉంచి, ఆసక్తి ఫలేచ్ఛలను త్యజించి, భగవదాజ్ఞానుసారం సమస్త కర్మలను ఆచరించడం (2/47-51), మరియు భక్తిశ్రద్ధలతో మనోవాక్కాయాలతో అన్ని విధాలా భగవంతుడిని శరణుజొచ్చి నామ, గుణ, ప్రభావ సహితంగా భగవత్స్వరూపాన్ని నిరంతరం చింతన చేయడం (6/47). దీన్నే భగవంతుడు సమత్వయోగం, బుద్ధి యోగం, తదర్థ కర్మం, మదర్థ కర్మం, సాత్త్విక త్యాగం మొదలైన పేర్లతో పేర్కొన్నాడు.

యోగనిష్ఠలో సామాన్య రూపంలో గాని, విశిష్ట రూపంలో గాని భక్తి తప్పక ఉంటుంది. గీతా ప్రతిపాదితమైన యోగనిష్ఠ ఏ విధంగా చూసినా భక్తిరహితం కాదు. భక్తిని లేక భగవంతుని గూర్చి స్పష్టంగా ప్రస్తావింపబడని చోట్ల కూడా (2/47-51) భగవదాజ్ఞాపాలనం తప్పకుండా ఉంటుంది. ఈ దృష్టితో అక్కడ కూడా భక్తి సంబంధమున్నట్లు తెలుస్తుంది.

జ్ఞాననిష్ఠను ప్రధానంగా నాలుగు భాగాలు చేయవచ్చు. అవేమంటే 1) ఉన్నదంతా బ్రహ్మయే! 2) కన్పించే సమస్త దృశ్య ప్రపంచమంతా మాయామయం (మిథ్య) వాస్తవంగా సచ్చిదానంద ఘన పరబ్రహ్మకు తప్ప మరి దేనికీ అస్తిత్వం లేదు. 3) కన్పించేదంతా నా స్వరూపమే! అంటే నేనే! 4) కన్పించేదంతా మాయామయం, అనిత్యం. వాస్తవంగా లేనేలేదు. కేవలం నిత్య చేతనమైన ఆత్మను నేనే!

ఈ నాల్గు విభాగాలలో 1,2 తత్త్వమసి (తత్+త్వం అసి) అనే మహా వాక్యంలోని 'తత్' అనే పదానికి సంబంధించినవి. తర్వాత 3,4 'త్వం' అనే పదానికి సంబంధించినవి.

ఇక యోగనిష్ఠలో ముఖ్యంగా మూడు భేదాలున్నాయి. అవి.. 1) కర్మ ప్రధాన కర్మయోగం, 2) భక్తి మిశ్రిత కర్మయోగం, 3) భక్తి ప్రధాన కర్మయోగం.

**1) కర్మ ప్రధాన కర్మయోగం :** సమస్త కర్మలలో, సాంసారిక పదార్థాలలో ఫలాసక్తులను సర్వథా త్యజించి, విద్యుక్తాలైన వర్ణాశ్రమ కర్మలను ఆచరించడమే 'కర్మ ప్రధాన కర్మయోగం' ఈ ఉపదేశ సందర్భంలో భగవంతుడు అక్కడక్కడ కేవలం ఫలాన్ని త్యజించాలని (5/12, 6/1, 12/11, 18/11) తెల్పినాడు. కొన్ని చోట్ల కేవలం ఆసక్తిని త్యజించాలని (3/19, 6/4) తెల్పినాడు. మరి కొన్నిచోట్ల ఫలాసక్తులను రెండింటిని విడిచిపెట్టాలని (2/47,48, 18/6,9) తెల్పినాడు. కేవలం ఫలత్యాగాన్ని గురించి తెల్పిన సందర్భంలో ఆసక్తి త్యాగం కూడ అందులో చేరినట్లు గ్రహించాలి. అలాగే ఆసక్తి త్యాగ ప్రస్తావనలో ఫలత్యాగం కూడా అందులో ఉన్నట్లు భావించాలి. ఫలాసక్తులను రెండింటినీ త్యజించినప్పుడే వాస్తవంగా కర్మయోగ సాధన సంపూర్ణమవుతుంది.

**2) భక్తి మిశ్రిత కర్మయోగం :** సమస్త జగత్తంతా పరమేశ్వరుడే వ్యాపించినట్లు తెలుసుకొని తమతమ వర్ణాశ్రమోచిత కర్మల ద్వారా భగవంతుణ్ణి సేవించడమే 'భక్తి మిశ్రిత కర్మయోగం' (18/46) అనబడుతుంది.

**3) భక్తి ప్రధాన కర్మయోగం :** దీనిలో ప్రధానంగా రెండు అవాంతర భేదాలున్నాయి. అ) భగవదర్పణ కర్మ ఆ) భగవదర్థకర్మ.

భగవదర్పణ కర్మ కూడా రెండు విధాలుగా ఉంది. అన్ని కర్మలలో మమతాసక్తులను, ఫలేచ్ఛను త్యజించి "ఇదంతా భగవంతునిదే! నేనూ భగవంతుని వాడనే! నా ద్వారా జరిగే కర్మలు గూడ భగవంతునివే! భగవంతుడే అన్ని కర్మలను నా చేత చేయిస్తున్నాడు. ఇందులో నేనొక ఆటబొమ్మను మాత్రమే!'' అని భావించి, భగవదాజ్ఞానుసారం భగవంతుడిని ప్రసన్నుడిగా చేసుకోవడానికి శాస్త్ర విహితకర్మలను ఆచరించడమే "పూర్ణ భగవదర్పణ కర్మ" (3/30, 12/6, 18/57,66) అవుతుంది.

మొట్టమొదట వేరొక లక్ష్యంతో కర్మను చేసినా, తర్వాత దానిని భగవదర్పణం చేయడం; కర్మలను చేస్తూ మధ్యలోనే ఆ కర్మఫలాదులను భగవంతునికి అర్పించడం; కర్మాచరణం అయిపోయాగానే భగవదర్పణం చేయడం; లేక కర్మఫలాలను మాత్రమే భగవంతునికి అర్పించడం – ఇది కూడా భగవదర్పణం పద్ధతే! భగవదర్పణ కర్మకు ఇది మొదటి మెట్టు. ఇలా చేయగా, చేయగా పైన పేర్కొనబడిన పూర్ణ భగవదర్పణ కర్మ సిద్ధిస్తుంది.

ఇక భగవదర్థ కర్మ కూడా రెండు రకాలు :

1) భగవత్ప్రాప్తికై, భగవదనుగ్రహానికై, భగవంతుణ్ణి ప్రసన్నునిగా చేసుకొనడానికై శాస్త్ర విహిత కర్మలను ఆచరించడం.

2) భగవద్విగ్రహాదులను ఆరాధించడం. భజన-ధ్యాన-ఉపాసనాది కర్మలను భగవన్నిమిత్తమై చేయడం మరియు భగవత్సంబంధమైన కార్యాలను ఆచరించడం.

ఈ రెండు భగవదర్థ కర్మలలో అంతర్గతాలు. ఈ రెండు మత్కర్మ, మదర్థకర్మ అనే పేర్లతో (11/55, 12/10) గీతలో తెలియజేయబడినాయి. అనన్య భక్తి, భక్తి యోగం (8/14,22; 9/13,14,22, 30,34; 10/9; 13/10; 14/26) అనేవి భగవదర్పణ, భగవదర్థ కర్మలయందే సమ్మిళితాలు. వీటన్నింటి ఫలం భగవత్ప్రాప్తియే!

భగవత్ప్రాప్తిని చేకూర్చడానికి యోగనిష్ఠ స్వతంత్ర సాధనమా? లేక జ్ఞాననిష్ఠ యొక్క అంగమా? అంటే యోగనిష్ఠ భగవత్ప్రాప్తికి (మోక్ష ప్రాప్తికి) స్వతంత్ర సాధనం. మళ్ళీ జ్ఞాననిష్ఠకు సహాయకం కూడా! సాధకుడు తన అభిరుచిని అనుసరించి, జ్ఞాననిష్ఠను ఆశ్రయించుకుండా నేరుగా కర్మయోగం ద్వారా పరమసిద్ధిని పొందవచ్చు లేదా కర్మయోగం ద్వారా జ్ఞాననిష్ఠను పొంది, దాని ద్వారా భగవత్ప్రాప్తిని పొందవచ్చు. ఈ రెండు మార్గాలలో దేనిని ఆశ్రయించాలనేది సాధకుని అభిరుచిపై ఆధారపడి ఉంటుంది.

యోగనిష్ఠ స్వతంత్ర సాధనమని భగవంతుడే (5/4,5; 13/

24) స్పష్టపరచాడు. చిత్తాన్ని భగవంతునిపై లగ్నం చేసి, ఆయనను ఉద్దేశించే (తత్ప్రాప్తి కొరకై) కర్మలు చేసేవానికి దైవకృప వల్ల భగవత్ప్రాప్తి కలుగుతుందని అని భగవంతుడే (8/7; 11/54,55; 12/6,8) పలు సందర్భాల్లో చెప్పాడు.

అదేవిధంగా నిష్కామకర్మ, ఉపాసన రెండు జ్ఞాననిష్ఠ యొక్క అంగాలు (5/6, 14/26) కూడా కావచ్చు. కాని జ్ఞానయోగంలో అభేదోపాసన ఉండటం వల్ల జ్ఞాననిష్ఠ భేదోపాసన రూప భక్తి యోగానికి అంటే యోగనిష్ఠకు అంగం కానేరాదు. ఏదో ఒక జ్ఞాననిష్ఠ సాధకుడు తన సాధన కొనసాగిస్తూ అభిరుచి లేదా అభిప్రాయం మారడం వల్ల జ్ఞాననిష్ఠను వదిలి యోగ నిష్ఠను అవలంబించవచ్చు. అనంతరం అతనికి యోగనిష్ఠ ద్వారానే భగవత్ప్రాప్తి కల్గడం సంభవిస్తుంది.

ఇలా కర్మయోగం అంటే కర్మమే యోగంగా కలదని అర్థం. ఈ విధమైన కర్మయోగం యోగులకు అంటే కర్మలను ఆచరించే గృహస్థులకు అనుష్ఠాన పద్ధతిగా చెప్పబడింది. అదే కర్మయోగనిష్ఠ.

కర్మ పరిమితమై, పరిమితమైన ఫలాలను ఇస్తుంది. కనుక కర్మ బంధహేతువు. సాధకుడైన వాడు ఈశ్వర భావనతో కర్మలను ఆచరిస్తాడు. కనుక అవి బంధహేతువులు కాదు. కర్మయోగి కర్మలను ఆచరిస్తాడే గాని, కర్మలచేత గాని, కర్మఫలాల చేతగాని బద్ధుడుకాడు.

**"నేను కర్తను కాను హరియే కర్త (నాహం కర్తా – హరిః కర్తా). పరమేశ్వరుని సేవకుడుగా నేను కర్మలను ఆచరిస్తున్నాను"** (ఈశ్వర భృత్యవత్ అహం కరోమి) అనే భావనలో చరిస్తాడు. కర్మాచరణంలో కర్తృత్వాన్ని విడిచి, ఫలానుభవం నందు సంగత్వం లేకుండా ఉంటాడు. కర్మలను పరమేశ్వరునికి నైవేద్యంగా సమర్పించి, లభించిన ఫలాలను, ప్రసాదంగా స్వీకరిస్తూ, రాగద్వేషాల నుండి విడిపడి ఉంటాడు. ఈ విధంగా విశుద్ధమైన, ప్రసన్నమైన చిత్తాన్ని కర్మయోగ నిష్ఠలో పొందుతాడు. ఇతడే కర్మయోగి. ఇతని అనుష్ఠాన పద్ధతి కర్మయోగనిష్ఠ. ఇతనిది ప్రవృత్తి మార్గం. ఈశ్వర దర్శన ప్రాప్తియే ఇతని కర్మయోగ ఫలం.

అర్జునుడు సన్యాసి కాడు, గృహస్థుడు. కనుక కర్మయోగి కావలసిన వాడే గాని, సర్వకర్మల్ని సన్యసించి జ్ఞాననిష్ఠలో ఉండవలసిన వాడు కాడు. కర్మలు చేయవలసిన వాడే గాని, కర్మలను విడిచిపెట్టవలసినవాడు కాడు.

మోక్షాన్ని పరమావధిగా భావించి, సన్యాసి జ్ఞానయోగంలో ఉంటాడు. మోక్షాన్నే పరమ పురుషార్థంగా భావించి గృహస్థుడు కర్మయోగంలో ఉంటాడు. ఇక్కడే సాధారణ కర్మ కర్మయోగంగా మారుతూ ఉంది.

**ముగింపు :**

**లోకేఽస్మిద్ద్వివిధా నిష్ఠా పురాప్రోక్తా మయాఽనఘ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్॥ (3.3)**

పాపరహితా! పార్థా! ఈ లోకంలో అనుష్ఠాన పద్ధతులు రెండు విధాలని పూర్వం నేనే చెప్పాను. సాంఖ్యాలకు జ్ఞానయోగం, యోగులకు కర్మయోగం.

అర్జునుని జీవితంలో కళంకమనేది కాగడా పెట్టి వెతికినా కనిపించదు. ధర్మమే ఊపిరిగా భావించి జీవించిన పవిత్రాత్ముడు. అందుచేతనే గీతాశ్రవణానికి అర్హుడయ్యాడు. సాక్షాత్తు భగవంతుని కరుణకు పాత్రుడై, ఆదిదేవుణ్ణే ఆచార్యునిగా పొందాడు. అలాంటి వానికి పాపమెక్కడుంటుంది? అందుకే అర్జునుడు అనఘుడు.

అర్జునుడు శ్రేయస్సును అర్థించాడు. శ్రేయస్సు అంటే మోక్షం. అందరికీ మోక్షం కావాలి. కనుక అందరికీ మోక్షమే ఏకైక గమ్యం మరి మోక్షం ఎక్కడుంది? మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం కలిగితేనే మోక్షం కలుగుతుంది. మరి ఈ ద్వివిధా నిష్ఠ అంటే ఏమిటి? ద్వివిధా నిష్ఠ అంటే రెండు రకాలైన వ్యక్తులున్నారు. వాళ్ళను బట్టి రెండు విధాలైన నిష్ఠను బోధించవలసి వచ్చింది. నిష్ఠ రెండు విధాలుగా గోచరిస్తున్నా, మోక్షమనే ఏకగమ్యాన్ని చేరేసరికి, ఒక్క నిష్ఠే మిగిలి ఉంటుంది. అదే జ్ఞాననిష్ఠ.

కర్మలను విడిచినంత మాత్రాన సన్యాసం అనిపించుకోదు. అలాగైతే, సోమరిపోతులందరూ సన్యాసులవుతారు. అలా కావడం చేతనే ప్రధానంగా నేటి సమాజంలో సన్యాసం ప్రశ్నార్థకంగా మారింది.

సన్యాసులు కానివారు కర్మయోగం ద్వారా చిత్తశుద్ధిని పొందాలి. అప్పుడే జ్ఞానయోగానికి అర్హులవుతారు. కర్మయోగం బుద్ధిని శుద్ధి చేస్తుంది. తద్వారా జ్ఞాననిష్ఠకు మర్గాన్ని సుగమం చేస్తుంది. కనుక **'యోగస్థః కురుకర్మాణి' 'యోగస్థుడవై కర్మలను ఆచరించు'** అని అర్జునుని కర్మయోగం వైపుకు త్రిప్పాడు గీతాచార్యుడు. ఇలా కర్మయోగం ద్వారానే జ్ఞాన యోగం సిద్ధిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. జయదయాల్ గోయందకా (వ్యాఖ్యాత) : శ్రీమద్భగవద్గీత తత్త్వ వివేచనీ (అను), గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ (2007)

2. పుల్లెల శ్రీరామచంద్రుడు (వ్యాఖ్యాత) : శ్రీభగవద్గీత, టి.ఎల్.పి.పబ్లిషర్స్, హైదరాబాద్ (2014)

3. స్వామి సుందర చైతన్యానంద (వ్యాఖ్యాత) : చైతన్య భగవద్గీత, సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్ (2010)

**(గీతాజయంతి సందర్భంగా ... ప్రత్యేక వ్యాసం)**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 (15) హైదరాబాద్ డిసెంబర్ : 2023

బందారం కథలు
23

# గట్టి మనిషి మెరుపు

**డా. నందిని సిధారెడ్డి,** ఫోన్ : 9440 381148


ఆ వాడకు అంతగా పరిచయం లేని ఆడమనిషి వేపచెట్టులాగే ఒక్కతే కూచ్చొని కండ్లకు నీళ్లు పెట్టుకుంటున్నది. తను కూర్చున్న చిన్న బండరాయి పక్కన మరి రెండు బండరాళు ్లన్నా ఆమెను పట్టించుకునే స్థితి లేదు. మరికొంచెం దూరంగా వాకిట్లో ఒక ముసలమ్మ మక్క కంకులు వొలుస్తున్నది. బాటలో పడుతున్న గింజలకు ఎడంగా పడిన గింజలను గబాల్న వాలి నోట అందుకున్నదొక కాకి. ముసలమ్మ పక్కనున్న కట్టె విసిరింది. ఒకటో రెండో గింజలు అందుకొని కాకి ఎగిరిపోయి వేపచెట్టు మీద చేరింది. ముసలమ్మ అటువైపు చూసింది. ఎవరో కొత్త మనిషి ఎందుకేడుస్తున్నదో అనుకున్నది. **"ఎవలవవ్వా, గీడొచ్చి ఏడుస్తున్నవు?"** అని గట్టిగానే అన్నది. కానీ కొత్త మనిషి వినిపించుకోలేదు. కండ్ల నీళ్ల ఆగిపోలేదు. దగ్గరగా వెళ్లలేకపోయింది ముసలమ్మ.

రెండు మూడు గూనపెంకల ఇండ్లు. మరికొంచెం దూరంగా రెండు గుడిసెలు. ముందట పెద్ద వాకిండ్లు. సాన్పి ఎండిపోయి నిరాడంబరంగా కనిపిస్తున్నాయి. **"ఊ...ఊ... నన్ను ఏం చెరల పడేస్తివే అవ్వా"** చిన్నగా గులిగినట్టు ఏడుస్తున్నాదామె. కాకి తన పక్కన రాయి మీద వాలి ఎగతాళి చేస్తున్నట్టుగా అరిచింది. ఆమెకు దు:ఖం ఎగేసుకుంటూ వచ్చింది. **"నిన్ను కన్నది నీకు గీ యింత నేర్పలేదా? కైకిలోల్లను తీసుకొచ్చే తెల్వి లేదు. ఎట్ల సంసారం జేస్తవు దరి(ద్రందానా... ఎగేసుకోని వచ్చినావు... ఏం జేత్తనని వొచ్చినవా?"** మాటలు గుర్తుకొచ్చినా కొద్ది ఏడుపొస్తున్నది. **"ఏ కష్టం జెయ్యిమన్నా చేస్తది గని, ఈ కష్టం అలవాటు లేదు. ఊరికి కొత్త. ఈ వాడకు కొత్త. ఎవలు తెలువదంటె ఆయనినడు. ఈడికొచ్చి అడిగితె ఎవ్వలినరు. ఏంజేతు... ఎటు వోదు"** మనసు పరి పరివిధాల తలపోస్తున్నది. కండ్లలోంచి నీల్ను కారిపోతున్నవి. **"కన్నీళ్లొకటి అల్కగున్నయి. ఈ అంటే ఊరుకొస్తయి"** ఆయనెన్నిసార్లు తిట్టినా తన దగ్గరున్నయి గవ్వే. అవ్వ పోయినప్పట్నుంచి ఆదుకున్నయి గవ్వే...

ఆ యిండ్లల్లో ఉన్న ఆడవాళ్లు, మగవాళ్లు అందరూ పనులకు పోయారు. పొద్దున లేస్తే పనులే. పనులకు పోతే తప్ప ఆ వాడల ఎవరికీ వెల్లదు. నోట్లోకి ముద్ద వెళ్ళదు. పిల్లల దగ్గరనుంచి పెద్దల దాకా ఏదో పనికి వెళ్లాల్సిందే. ఆమె బాధ వినటానికి అక్కడెవరూ లేరు. ఏడుస్తున్న కొత్త మనిషి ఎవరా? అని నొసటికి చెయ్యి అడ్డం పెట్టుకొని తీక్షణంగా చూసిందొకామె. ఆ వాకిట్లో జొన్నకంకి ఎండపోసి ఉంది. నేరిపింది.

పిల్లలకోడి కేరుతూ గట్టిగా అరిచి గాద్గదికమయ్యేసరికి ఇంట్లోంచి బయటికొచ్చింది కిన్నెర ఎల్లవ్వ. కోడి ఏదో చూసి బెదిరింది. అటూ ఇటూ చూసింది. కోడి పిల్లలు పక్కనే ఏదో ఏరుకొని తింటున్నాయి. వేపచెట్టు వైపు నుంచి ఏడుపు వినిపించేసరికి అటు చూసింది. **'ఏవ్వలీమె... ఈడ కూసోని ఏడుస్తుంది'** అనుకోని దగ్గరికి వచ్చింది.

**"ఏమైందవ్వా... గీడ కూసోని ఏడుస్తున్నవు. ఊకో... ఊకో..."** ఊరడించింది. నిలబడే మళ్లా అడిగింది. ఆమెకు మళ్లా ఏడుపొచ్చింది. **"ఊరికే కొత్తున్నట్టున్నవు. కొత్తగ సంసారాని కొచ్చినవా...మావూరి కొత్తకోడలు పిల్లవా..."** ఏడుపు కొంగుతో తుడుచుకుంటూ తలూపిందా కొత్త మనిషి. **"నువ్వు.. బాల సిద్దయ్య పటేలు పెండ్లమువు గాదు...."** గుర్తు పట్టినట్టు అడిగింది ఎల్లవ్వ. ఆమెకు ప్రాణం లేచివచ్చినట్టనిపించింది. అవునన్నట్టు తల ఊపింది. **"నీ పేరింది పిల్ల...." "రత్నవ్వ" "మల్లెందుకేడుస్తువవ్వా" "పొల్లం నాటేసేదున్నది.**


డా. నందిని సిధారెడ్డి

**కైకిల్లోల్లను తోల్కరమ్మని తోల్తడు పటేలు. వీల్లేమొ...ఎవ్వల్నడిగినా ఎవ్వలొత్తలేరు. ఎవ్వలకు వాళ్ల పనల్లకే పోతున్నరు. చెప్పితె మా పటేలు ఇష్టమున్నట్టు తిట్టిండు. నిన్న ఇంట్ల ఏడ్సిన. కైకిలోల్లు రాకపోతె నువ్వు ఇంటికి రాకుమన్నడు. బాయికాడికి రాకు మన్నడు. ఏం జెయ్యాల్నో తెల్వక, యాడికి పోవాల్నో తెల్వక ఈడ గూసోన్న. మా అవ్వ యాది కొచ్చింది. ఏడ్సిన"** అని మళ్లా కొంగు తోని తుడుచుకున్నది. నీళ్లు వస్తూనే ఉన్నయి. తుడుస్తునే ఉన్నది.

కిన్నెరెల్లవకు కలుక్కుమన్నది. తను కొత్తగా కాపురానికొచ్చినప్పటి సంగతులు యాదికొచ్చినాయి. **"కొత్త పాతా ఏదీ చూడరు. మొగోల్లు మొగోల్లే, ఇంటోల్లు ఇంటోల్లే. ఊరోల్లు ఊరోల్లే. కాల్సుక తింటరు. అలవాటయెదాంక అరిగోస. తను ఎంత తండ్లాడింది, తల్లడిల్లింది...."**

**"అవ్వా, రత్నవ్వ, ఏం బాధపడకు. ఏడ్వకు. నేనొస్త. నీకేం బాద లేదు"** అని దీము చెప్పింది. సముదాయించింది. అటు నుంచి మళ్లీ అవతలి ఇండ్లవైపు చూసింది. **"ఏందుల్ల... లచ్చవ్వా, ఉన్నావే... ఈరవ్వా ఎవ్వలు సప్పుడు జెయ్యరేందుల్ల... కాపొల్ల పిల్ల మనిండ్లల్లకొచ్చి గిట్ల ఏడుస్తుంటె మనకు**

**మంచయితదా... కాపొల్లకు కనికరం లేకపోయినా మనకుండాలె గదా.... మన సోంటి పిల్ల... మనూరి కోడలు పిల్ల. ఎడ్డిపిల్ల ఏడుసుకుంట కూసున్నది. పాపమనాలె గాదే... నర్సవ్వా... నాట్లేయ్నాల్నట... వొస్తావే.... "** కిన్నెర ఎల్లవ్వ ఇల్లిల్లూ తిరిగింది. చాలామంది పనులకు వెళ్లిపోయారు. యాదవ్వ ఒక్కర్తె వస్తానన్నది.

**"రత్నవ్వా, పా... నేనూ, యాదీ ఇద్దరమొస్తం"**

**"ఇరువై ముప్పైమంది గావాలె... పటేలు తిట్టడా..."**

**"ఎందుకు తిట్టడు? తిడ్తడు. మమ్ముల దిట్టడు. ఆయనకేంది? తిట్టటందుకే పుట్టిండు. ఇయ్యాల పొద్దీకి అందరికి జెప్త. కైకిలోల్ల నంగనె దొరుకుతరా, ఉరుకొత్తరా... వాల్లవాడికెలు వాల్లకుంటయి. పొద్దీకి తయారు జేస్కోని పొద్దుగాల ఎంతమందినంటె అంతమందిని తీసుకొస్త. నువ్వేం ఏడ్వకు. ఇయ్యాల్లటి పని నడ్వనీ. పటేలు దిట్టడంటె యాపాటి తిడ్తడో... నేను జూత్తపా. మీ పటేలకు కొమ్ములున్నయా... నేనడుగుత పా. యేం గాదు. నేనున్నపా...వ్వ"**

రత్నవ్వకు ధైర్యమొచ్చింది. పాపిట అటు ఇటూ సవరించుకున్నది. కొగు సర్దుకున్నది. ముగ్గురు కలిసి రాయలోని బాయి దగ్గరకు చేరుకున్నారు.

అచ్చు కట్టి ఉంది పొలం. అద్దం వలె మెరుస్తుంది పొలం. పక్కమడిలో నారు పీకి ఉంది. కూలోల్ల కోసం ఎదురుచూస్తూ బాయి గడ్డ మీద నిలబడ్డ బాల సిద్దారెడ్డి వాళ్లకు చేరువగా వచ్చాడు.

కాసెపోస్తూ కనిపించింది కిన్నెర ఎల్లవ్వ. యాదవ్వ కూడా కాసెపోస్తున్నది. రత్నవ్వ అప్పటికే కాసెగోచి పెట్టేసి నారు తెస్తున్నది.

"ఎల్లవ్వ దప్ప దొరుకలేదానె నీకు...."

"ఏమయ్యా, నాకేం వొంకర... ఎల్లకి వొంక పెట్టెటోల్లు ఎవ్వలు... నాకు ఏం తక్కువ..?"

"ఎల్లవ్వా. నీకు వంక ఎవ్వలు పెట్టరు. ఏం తక్కువంటె ఏం జెప్పాలె. అన్ని ఎక్కువనే....మాటలు గాదు... పని జెయ్యాలె. పని."

"నా పనితనం నువ్వాడ జూసినవయ్యా, పటేలా.... మడిల దిగినంక జూడు. గడ్డ మీద గూసుంటె పనెట్ల తెలుస్తది. పటేండ్లకు నడుస్తది. మాకెట్ల నడుస్తది?

"నేను చూసింది, చెయ్యంది నీకేమెర్క. నా పనితనం నువ్వాడ జూసినవు ఎల్లవ్వా...." ఒక్కన్ని ఎలాగటి నాగలి ఎకరం దున్నిన. గొర్రు కొడితె మెరువాలె పొలం. వొంగి జొన్నకోస్తె అందుకునెటోల్లు ఉండరు. నీకేం జెప్పాన్నే...."

"అవునయ్యా, నీ సంగతి నువ్వు జెప్పినవు. నేనొక్కదాన్ని రోజెకురం నాటేస్త... మునుం పడితె నాతోని సరిదంట సాగేదెవ్వ లుండరు. కిన్నెరెల్లి మాటల ఎల్లి అని పేరు పోయింది గని, మాటలకు మించి పని... మా ముసలోడు జెప్పాలె...."

"తప్పు పట్టుకోకు ఎల్లవ్వా... కాని.... కాని పొద్దునెత్తి మీది కొచ్చె...."

"నడుస్తది గని, కోడలు పిల్లనే మనకు. కొత్త పిల్ల. ఊరికి కొత్తది. సంసారానికొ కొత్తది. రేపు ముప్పయిమంది కైకిల్లోల్లను తెచ్చే జిమ్మెదారి నాది"

"సరె సరే. తెల్వాలె గదనె దానికి. తిట్టకపోతె నువ్వు దొరుకుదువా... మీ ఇండ్లల్లకు పొమ్మంటె భయపడ్డది. బయపడితె తెగలుత్తదా... కాపుదనపుది అన్ని పనులు అలవాటు జేసుకోవాలె... రాదంటె నడుస్తదా... దాన్ని ఏమన... అంటె నువ్వూకుంటవా...".

ముగ్గురు ఆడవాళ్లు మడిలోకి దిగారు. పటేలు, జీతగాడు నారు తెచ్చి దదులు వేస్తున్నారు. వాళ్ల పని లాగే సూర్యుడు తన ప్రతాపం తాను చూసిస్తూ పరుగెత్తుతున్నాడు.

గటుక కుతకుత ఉడుకుతున్న చప్పుడు ఎప్పుడు విన్నా ఎల్లవ్వకు వినసొంపుగా ఉంటుంది. ఇప్పుడూ హుషారుగా వినిపించింది. చిమ్మ చీకటి అలుముకున్నది. పొయ్యి మంట తప్ప మరేమీ కనబడటం లేదు. ఒక కొర్రాలో మంట తీసి, ఎత్తిపట్టి ఆ వెలుగులో తెడ్డుతో కొంచెం గటుక తీసి వేళ్లతో వొత్తి చూసింది. పూర్తిగా ఉడికింది. కొర్రాయి మంట తీసేసింది. కొర్రాయిలు అట్లే మండుతుంటే కొంచెం నీళ్లు జల్లింది. మంట ఆరిపోగానే నిప్పులు ఒక్క దగ్గరికి జరిపింది. ఉడుకుతున్న చప్పుడు చిన్నగా, మెల్లగా వినపబడుతున్నది. ఎట్లా ఈ చప్పుడు తగ్గుతున్నదో దూరంగా బ్యాండు చప్పుడు మెల్లమెల్లగా పెరుగుతూ వినిపించింది. ఎల్లవ్వ చెవికి పెళ్లి చప్పుడు ఎవరిదైనా, ఏ చప్పుడైనా వినసొంపుగానే ఉంటుంది. బ్యాండు చప్పుడు ఆసక్తికరంగా అనిపించింది. పాటికి పటేండ్ల పెండ్లి చప్పుడా అని సుమానమొచ్చింది. 'వాళ్లు రేపుగాదా వస్తరు' అనుకున్నది. చప్పుడును బట్టి ఇంకా సమయం పడుతుందని భావించింది. "ఉడుకుడుకు గట్క తిందువు రావయ్య అని మట్టి కంచాల్లో పోసింది. గొంగడి జరుపుకొని కూచున్న సెంద్రయ్యకు ఒకటి. ఇచ్చింది. లోపలికి వెళ్లి చారు యెస్ల తెచ్చి ముందు పెట్టింది. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుని చారు కలిసి ఊదుకుంటూ జుర్రుకుంటున్నారు.

పెండ్లి చప్పుడు త్వరత్వరగా దగ్గరైంది. "ఎవలదయి ఉంటదయ్యా, పెండ్లి" అడిగింది. "ఏమోనే... మనూరి పెండ్లి కాదు గావొచ్చు. మన పటేండ్లు రాత్రి పెండ్లి చేస్కోని రేపొస్తరు ఊల్లెకు. అయినా తినరాదే నిమ్మలంగ..."

చప్పుడు మరింత దగ్గరికొచ్చేసింది. చూడాలనిపించింది. ఏ ఊరి పెండ్లో తెలుసుకోవాలనిపించింది. తింటున్న గట్క పక్కన పెట్టి చేతి

కదుక్కున్నది. "ఎల్లక్కా, పెండ్లోల్లెవరో మన బజారు నుంచి పోతండ్రు. వస్తవా?" పిలిచింది రాజవ్వ. పిలుచుకుంట, మూతి తుడుచుకుంట నలుగురైదుగురు మూల మలుపు దగ్గరికి ఉరికారు.

బ్యాండు జోరుగా మోగుతున్నది. వేగంగా కదులుతున్నరు. మూల మీద గుంపు కూడింది. బారాత్ ఆగింది. పల్లకి దగ్గరికి నడిచారు. పెట్రోమాక్సు లైటు వెలుతురులో పల్లకి మెరుస్తున్నది. గాలికి పూసలు ఊగుతున్నయి. పెళ్లి కొడుకును, పెళ్లి కూతురును చూద్దామని తొంగి చూసింది ఎల్లవ్వ. బాసింగాలు అడ్డుగా ఉండటం వల్ల ముఖం కనబడటంలేదు.

"ఏ వూరయ్య" అడిగింది రాజవ్వ. "నర్మెట్ట" అన్నారు పల్లకి బోయీలు. "బాసింగాలు పక్కకు అనరాదయ్యా. మొఖం కనిపించకుంట చూద్దామనొచ్చినం గాదయ్యా. ఓ... పెండ్లి పిలగా... బాసింగాలు జరుపు..." అతను జరుపుకోగానే పరీక్షగా చూశారు ఆడవాళ్లు.

"పెండ్లి పిల్లను కూడా జరుపుమను... బాసింగాలు జరిపితే చూస్తం గాదవ్వ" జరుపుకొని వీళ్లవైపు చూసింది పెళ్లి కూతురు. "జోడీ బాగుంది. సల్లగ బతుకుండ్రి బిడ్డా..." దీవించింది ఎల్లవ్వ. "మంచిగ పిల్లలు గావాలె" దీవెనార్తి ఇచ్చింది రాజవ్వ. చిన్నపిల్లలు పల్లకి వెనుక ఉన్న కచ్చురాలు లెక్కవెడుతున్నరు. "పొండ్రి... పొండ్రి రాత్రయితది" పెద్దాయన మందలించాడు. బారాత్ కదిలింది. గుంపు మల్లింది. గుంపు పెండ్లిజంటను మెచ్చుకున్నది. ఎవరి సందుకు వాల్లు చీలిపోయారు. ఊరివాళ్లకు అదో సరదా. ఎవరి పెండ్లి ఊరేగింపు ఊరికి వచ్చినా ఉత్సాహంగా కూడుతారు. చూస్తారు. మెటికలు విరుస్తారు. నచ్చితే మెచ్చుకుంటారు. నచ్చకపోతే పెదవ్విరుస్తారు. ఏదో దీవెనార్తి పెడుతారు. ఇండ్లకు వెళ్లేదాకా మాట్లాడుకుంటారు. పెండ్లంటే తమ పెండ్లంత సంతోషం పడుతారు.

మరుసటిరోజు పాటకి పటేండ్లు పెండ్లి చేసుకొని బందార మొచ్చేసరికి చాకలివారు ఊరు దిరుగుతున్నారు. చీకటి మెల్లమెల్లగా పెరుగుతున్నది. డప్పుల చప్పుడు జోరు పెరుగుతున్నది. వాళ్ల వెనుక బ్యాండు, క్లారినెట్ పాటలు, మెలికె పీకల పాటలో పెండ్లి సంతోషం అంత చీకట్లోనూ కనబడుతున్నది. పల్లకి మూడు బాటల దగ్గర ఆగింది. అటుపక్క ఒకటి ఇటుపక్క ఒకటి, రెండు పెట్రోమాక్సు లైట్లు. వెలుతురు పరుచుకున్నది. పెద్ద గుంపు కూడింది. పెళ్లికూతురును చూడటానికి ఆడవాళ్లు పోటీపడుతున్నారు. తమ ఊరి పెండ్లి. తమ ఊరి పెండ్లికొడుకు. అందరికి తెలిసిన పెండ్లి కొడుకు. పెండ్లిపిల్ల కుదిరిందో లేదో చూడాలని ఉత్సాహం. తమ ఊరి కొత్త కోడలును చూడాలని ఆతురుత. ఒకరినొకరు జరుపుకుంటున్నారు. బాసింగాలు జరిపించుకొని చూసి కనుబొమ్మలు ఎగరేసుకుంటూ పక్కకు జరుగుతున్నారు. "జరుగుండ్రుల్లా, అందర్ని జూడనీయ్యండ్రి' అంటున్నారు. చూస్తున్నారు, జరుగుతున్నారు. గుంపు చెదురుతుండేసరికి బారాత్ ముందుకు కదిలింది. వాడలు దాటుతూ మాదిగవాడకు చేరుకున్నది.

ఎల్లవ్వ, రాజవ్వలు పరుగు పరుగున చేరుకున్నారు. ఎప్పటిలాగే ఆసక్తితో చూశారు. డప్పుల జోరు పెరిగినా కొద్ది గుంపు పెరుగుతున్నది. చూసినవాళ్ళు చూసినట్టు పక్కకు జరుగుతున్నారు. మళ్లా ముందుకు జరిగింది బారాత్ ఊరంతా తిరిగింది. పాటకింట్లోకి చేరుకున్నది.

తెల్లవారి ఉదయం కిన్నెర ఎల్లవ పాటకి పటేలింటికి వెళ్లి వాకిట్లో నిలుచున్నది. పెండ్లి పందిరి ఆకులు గలగలమంటున్నాయి ఎవరి హడావిడిలో వాళ్లు తిరుగుతున్నారు. ఆరోజు మర్లుపెండ్లి. కొత్త చుట్టాలు కనబడుతున్నారు.

ఎల్లవ్వ కొంచెం ముందుకు కదిలి కబీరు గది ముందు ఆగింది.

పెద్ద అరుగు మీద పడక కుర్చీలో కూచున్నాడు పెద్ద పటేల్.

"ఏమే, ఎల్లీ... ఎటో వొచ్చినవు..."

"పెండ్లి అయిందిగద పటేలా...." "ఆ...."

"కోడలు మంచిగున్నది. చిన్నపటేలుకు దగ్గట్టు కుదిరింది. బంగారం... బంగారం... బంగారమసోంటి కోడలు... అదురుష్టం... పటేలా..."

"ఎవల అదృష్టం ఎవలకెరుక. నువ్ మెచ్చుకున్నవంటె మాకు సంబురమే" ఐదు రూపాయల నోటు జేబులోంచి తీశారు. కొడుకును పిలిచాడు. "ఎల్లికి ఇయ్యిరా" చెప్పాడు. నోటు తీసుకొని ఎల్లవ్వ దగ్గరికెళ్లాడు కొత్త పెండ్లి కొడుకు. కొంగు ఒడి పట్టింది ఎల్లవ్వ. పైనుంచి నోటు వేశాడు. "సల్లగ బతుకుండ్రి పటేలా... యాడాది లోపల్నె కొడుకు పుట్టాలె..." ఎల్లవ్వ దీవెనార్తి ఇచ్చింది. "తినిపోయే... ఎల్లి..." "మంచిది పటేలా...".

కూర్చొని సెంద్రయ్య పగ్గం పేరుతుంటే కొంచెం దూరంలో నిలబడి కరేస్తున్నది ఎల్లవ్వ. చలికాలం సన్నటి ఎండ. కొంచెం చిరాగ్గా ఉన్నది. కొద్దిసేపు హుషారుగా అనిపించింది. పగ్గం కరేస్తుంటే తమ సంసారం తలపుకొచ్చింది. సెంద్రయ్య ఒకపురి, తాను ఒక పురి. సంసారం ఒక పురి. మూడుపురులు పేనినట్టు సాగిపోతున్నది కాలం. ఎల్లవ్వ మాట ఎంతో పని అంత. మొగుడంటే ప్రాణం. అయినా మాటంటే పడదు. కొత్తగ పెండ్లయినప్పుడు మాటకు మాటంటే సెంద్రయ్యకు కోపమొచ్చేది. అత్త మాటన్నా పడేది కాదు. ఎదిరించేది. సెంద్రయ్యకు కోపమొచ్చి కొట్టేవాడు. ఎల్లవ్వ ఎప్పుడూ ఊరుకొనేది కాదు. తిరిగి కొట్టేది. రాను రాను సెంద్రయ్య ఎల్లవ్వ తత్త్వం అర్థం చేసుకొన్నాడు. ఇద్దరు ఎన్ని మాటలనుకున్నా గడియలో

కలిసిపొయ్యేది. ప్రేమగా చూసుకొంటే అత్తా అర్థం చేసుకున్నది. మంచాన పడితే అత్తకు సేవ చేసింది. ఊరందరు మెచ్చుకున్నారు. ఎల్లవ్వకు పిల్లలు కాలేదు. ఇరుగు పొరుగు ఆడవాళ్లు తక్కువ చేసి మాట్లాడేవాళ్లు. వాళ్ళనూ వదిలేది కాదు. అక్కడికక్కడే కడిగి పారేసేది. పిల్లలు కానందుకు వెలితి పడేది కాదు. ఏది రాసుంటే అది జరుగుతదనేది. అట్లా అని సెంద్రయ్యను తక్కువ చూడలేదు. అమ్మలక్కలను తక్కువ చేసేది కాదు. మాటకు మాట. ప్రేమకు ప్రేమ. సోపతి సోపతే, ఏదీ తక్కువ కాదు. ఎవరూ తక్కువ కాదు. అత్త చనిపోయిన తర్వాత ఇద్దరే. ఒకరికొకరు. అనుకున్నా వాళ్లే. అతుకుకొని ఉన్నా వాళ్లే. ఉన్న సంసారాన్ని ఉన్నంతలో జల్సా చేస్తారు.

పగ్గం పేనటం పూర్తయింది. కొయ్యకు వేసిన రెండూ తీసి మూడు పగ్గాలు వెంకయ్య పటేలు ఇంటికెళ్లి ఇచ్చారు. ఆయన నాలుగు చాటల వడ్లు పోశాడు. చెరో మూట కట్టుకొని వచ్చి సేటుకు అమ్మారు. అటూ ఇటూ లెక్కకట్టి సేటు రెండు రూపాయలున్నర ఇచ్చాడు.

సాయంత్రం పొద్దు. మాగి పొద్దు. పరిగెత్తుతున్నది. బండం తోటల గౌండ్లోల్ల హడావుడి. తాగెటోల్ల సందడి. చెట్ల గలగలలు. పక్షుల కలకలలు. ఏ గుంపుల చూసినా అరుపులు. ఇక ఇకలు...

ఎల్లవ్వ తాగినంత తాగింది. సెంద్రయ్య పోటీపడి తాగాడు. చాలదని కల్లు బుంగతలలో పెట్టుకొని సెంద్రయ్య ఊగుతున్నాడు. ఎల్లవ ఏదో వాగుతున్నది. ఊర్లోకొచ్చారు.

మూడు బిటల నడుమ కల్లుముంత పెట్టాడు సెంద్రయ్య. 'తాటిచెట్టు ఇల్లు కాదు. తాగినోడు తమ్ముడు గాదు. ఇంటికే నడువే ముంత. నడువక పోతే తంత" అని అడ్డమడ్డం తిరుగుతున్నాడు సెంద్రయ్య. నడుమ నడుమ చుట్టూ తిరిగి నడువుమని మొక్కుతున్నాడు.

"పిచ్చి సెంద్రయ్యా, ఎర్రి మొగడా. యాడనన్న కల్లు లొట్టి నడుత్తదా"


# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177


"నీ మొకం తియ్యే. ఎల్లూ నా పిచ్చి ఎల్లూ. నువ్వు తాగింది కల్లే. నేను తాగింది కల్లే. నిన్ను ఆడిత్తంది కల్లే నన్ను ఆడిత్తంది కల్లే. కడుపుల ఉన్న కల్లు మనిద్దరి ఆడిత్తుంటే లొట్టిలున్న కల్లు లొట్టినెందుకు ఆడియ్యది. లొట్టికెందుకు నడిపియ్యది. లొట్టి ఆడుతది సూడు. గునగున నడుత్తది సూడే నా బంగారెల్లు....".

"మొకం జూడు మొకం. కల్లు దాగిన మొకం. క్యాలిదప్పిన మొకం. ముసలోనివైన వోయ్ సెంద్రయ్య. రొండు బింకులకే తెల్వి తెల్లారిందోయ్ బామ్మర్ది. పానం లేనిది లొట్టి. అది తాగిందా కల్లు. మనం దాగినం. మనమే ఊగుతం. గుండ్రగ మనమే దిరుగుతం. అది ఆడది. నడువది గని ఎత్తుకోని నువ్వే నడువు...."

తొవ్వలో ఆడుకునే పిల్లలు. వాళ్లిద్దరిని చూసిన నవ్వుతున్నారు. ఆడవాళ్లు ముక్కు మీద వేలేసుకున్నారు. ఒక ముసలాయన వాళ్ల దిక్కు చూసి "తాగిన తమాషా" అన్నాడు. ఊగుకుంటూ వాగుకుంటూ వాళ్లిద్దరు నడుస్తుంటే "పెట్టి పుట్టింద్రు" అన్నదొకామె.

\+ + +

సిద్ధిపేట బ్యాండు చెలరేగి మోగుతున్నది. బ్యాండువాళ్ల డ్రెస్సే దర్పంగా వుంది. తలకు కుచ్చుల పాగాలు. తళతళ మెరిసే హాఫ్‌కోట్లు. తెల్లటి ప్యాంట్లు. పాటకంటే వేషం ఆకర్షిస్తున్నది. తెలుగు పాటలు పాతబడ్డాయని చెప్పుతున్నట్టు హిందీపాటలు హోరెత్తుతున్నాయి. పక్కన ట్యూబ్‌లైట్లు పట్టుకొని ఆడవాళ్లు ఒకరొకరు వరుసగా నిలుచున్నారు. వెనుక రిక్షాలో డైనమో చప్పుడు కఠోరంగా మోగుతున్నది. నడుమ అలంకరించిన జీపు. అట్టహాసంగా సాగుతున్నది పెళ్లి ఊరేగింపు. ముందు ముప్పయిదప్పులు. జోరుగా ఆడుతున్నాయి. అటు ముందు ట్యూబ్‌లైటు వెలుగులో ఇద్దరు సాము చేస్తున్నారు. ఒకతను నోట్లోకి కిరోసిన్ పోసుకొని కాగడా ముందు పైకి ఊదుతూ అంచెలంచెలుగా మంటలు విసురుతున్నాడు.

రెండు చేతుల్లో రెండు కర్రలు పట్టుకొని గిరగిర తిప్పుతూ సాము చేస్తున్నాడొక యువకుడు. సాము తప్పింది. కర్రలు ఒకదానికొకటి తగిలాయి. చప్పుడయి సాము ఆగింది. అప్పుడే చేరువగా వొచ్చిన ఎల్లవ్వకు చీదర పుట్టింది. సాము చెడగొట్టాడని కోపమొచ్చింది.

"వొచ్చిరాని వొయిన పోడుసాము చేస్తు వొయ్యారం గుయ్యార మైతది. జరుగవోయి పిల్లగా జరుగు. పక్కకు జరుగు". ఎల్లవ్వ గోసి పోసింది. రెండు చేతుల్లోకి రెండు కర్రలు తీసుకున్నది. గిర గిర తిప్పింది. అడ్డమడ్డం అడుగులు వేస్తున్నది. యువకులు హుషారెక్కి పోటీ పడి ఈలలు వేశారు. దప్పులు పోటీ పడ్డాయి. బ్యాండు పోటీ పడ్డది. ఐదు నిమిసాల్లో ఎల్లవ్వ బారాత్‌కే జోష్ తెచ్చింది. కొద్దిసేపటి తర్వాత ఆగి చెమట తుడుచుకున్నది. అటునుంచి జీపువైపు కదిలింది.

మూడు బాటల దగ్గర జనం గుంపులు గుంపులు. జీపులో నవ దంపతులను చూడటానికి ఎగబడుతున్నారు. గతంలో పల్లకి చుట్టూ మూగేవారు. కొత్తగా ఇప్పుడు జీపు చుట్టూ మూగుతున్నారు. తెల్లటి

వెలుగులో దంపతులు మెరసిపోతున్నారు. చూడటానికి సౌకర్యంగా వీలు కల్పిస్తున్న చిన్న బాసింగాలు. పెళ్ళికొడుకు తమ ఊరివాడే అయినా, కొత్తబట్టల్లో మళ్లా పరికిస్తున్నారు. పెళ్లి కూతురుగా మరింతగా పరీక్షగా చూస్తున్నారు ఆడవాళ్లు. చూసినవాళ్లు నిశ్శబ్దంగా తప్పుకుంటున్నారు. అంతా ఆర్భాటం గురించి మాట్లాడుకుంటు న్నారు. సిద్ధిపేట బ్యాండనీ, డైనమోట్లనీ, జీపు బారాతనీ... ఇంతకు ముందెప్పుడూ అట్లాంటి బారాత్ బందారం ఊరికి తెలువదు. జీపు వెనుక మూడు కార్లు, కార్ల వెనుక సవారిచ్చురాలు. ముచ్చట్లన్నీ పెండ్లి దంపతుల గురించి కాకుండా పెండ్లి గురించి సోగుతున్నాయి. ఇంత గొప్ప పెండ్లి అంత గొప్ప పెండ్లి. అంతా జోర్‌దార్.

మరుసటిరోజు మధ్యాహ్నం. మర్లు పెండ్లి. పోలీస్ పటేలు ఇల్లు పొంగి పోతున్నది. ఎల్లవ్వ పెద్దర్వాజ దాటి వాకిట్లో అడుగు పెట్టింది. పచ్చని పందిరి కనబడలేదు. ఎర్రటి డిజైను చారికలు. బిగదీసి కట్టిన తెల్లటివాళ్లు. దిగ్గొట్టిన సలాకలు. పక్కన నిటారుగా నిలబెట్టిన పొడుగు కర్రలు. పైన పరుచుకున్న తెల్లటి ఎర్రటి జెన్లు. ఎన్నడు లేని కొత్త ఏర్పాటు. పందిరి కాని పందిరి. దర్పపు పందిరి.

ఎల్లవ్వ చుట్టూ చూసింది. పనులు మనుషులు మామూలే. హడావుడీ. ఎదురుగా పటేలు చేతుల కుర్చీలో దర్పంగా కూర్చున్నాడు.

"దండాలు పటేలా...." కొంచెం ముందుకు కదిలింది ఎల్లవ్వ.

"ఏమే... ఎల్లీ... ఏం సంగతి.." చేతులు కుర్చీకి బిగిస్తూ అడిగాడు.

"పెండ్లి ఇల్లాయె... చూసి పోదామని వొచ్చిన..."

"చూసినావె మరి"

"చూసిన బాంచెన్.. ఏమో పటేలా... ఏం జూసి జేసుకున్నవో గని కోడలు కుదరలేదు పటేలా...."

"గవన్ని నీకందుకే... నీ సంగతి నువ్ చూస్కో. నీ కట్నం నీకు పెడ్త. ఇంత తిని దీవించి పో...."

పది రూపాయల నోటు తీసి అరుగుమీద పెట్టి "తీసుకోయే" అన్నాడు.

"నాకు కట్నమెందుకు పటేలా... కట్టుకపోతమా రేపు. పైసలు రావు. జాగరాదు. మంచీ చెడ్డా... జోడి కలువాలె. ఉంగురంల రాయి కుదురాలె. ఒకదానినొకటి ఒదుగాలె. ఒదిగితె వొన్నెవొస్తది. కంటిరెప్పలు వొయినంక కాటికె ఉంటె ఏం లాబం? ఎన్నుంటయి పటేలా... కాందానంటరు. ఏం జేస్తది? కష్టకాలంల మనతోని వస్తదా... ఏమో బాంచెన్.. నేనైతె తుర్తి లేను. మనసు తుర్తి గాలే. కట్నం కోసం రాలే. పైస కోసం బత్కలే. పని జేసుకోని బతికెటోల్లం. తెల్లది తెల్లదంటం. నల్లది నల్లదంటం. వొద్దు బాంచెన్. కట్నం నాకు అరుగది. ఎల్లి ఎల్లే. ఏతులకు బతికేది గాదు. అందామనే వొచ్చిన అన్న... పోతున్న...."

సరసర బయటికి నడిచింది ఎల్లవ్వ. పటేలు మొఖం నల్లబడింది. ఇప్పుడు కాదు. సూసినప్పుడే నల్లబడింది. అసలు పైసే నల్లటిది. తెల్లది నల్లదంటది. నల్లది తెల్లదంటది. కిన్నెరెల్లవ్వ అట్ల కాదు. ఎల్లవ్వ మాట మాటే. మెరుస్తది తెల్లగ ధగధగ.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 (20) హైదరాబాద్ డిసెంబర్ : 2023

# పద్యమనోహరం - 47


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు


వరంగల్, ఫోన్ : 994 901 3448


**"పరమేశు భక్తియన్ సురతరువుండ**
**హరు భక్తియన్ కనకాచలముండ**
**గామారి భక్తి చింతామణి యుండ**
**సోమార్ధధరు భక్తి సురధేనువుండ**
**మృగపతి యెద్దెస మేయునే పుల్లు**
**క్షీరాబ్ధి లోపల క్రీడించు హసంబు**
**బ్రాతి బూరుగు మ్రాని పండ్లు గన్గొనునె**
**రాకామల జ్యోత్స్న ద్రావు చకోర**
**మాకాంక్ష సేయునే చీకటి ద్రావ**
**విరిదమ్మి వాసన విహరించు తేటి**
**వడిగొని సురియునే బ్రబ్బలి విరులు...."**

తొలి అడుగుల తెలుగు కవిగా సుప్రసిద్ధుడైన మహాకవి పాల్కురికి సోమనాథుని పలుకులు ఇవి. ఆయన శివభక్తి పారమ్యాన్ని వ్యక్తీకరించే ఈ పాదాల్లో శివభక్తి ఉన్నప్పుడు మరొకటి అవసరమే లేదన్న విషయాన్ని చెబుతూ అనేక ఉదాహరణలు జోడించి చూపాడు కవి.

**"పరమేశ్వరునిపై భక్తి అనే కల్పతరువు ఉన్నప్పుడు, హరునిపై భక్తి అనే బంగారు పర్వతము అందుబాటులో ఉన్నప్పుడు, మన్మథ వైరి యొక్క భక్తి అనే చింతామణి చెంతనున్నప్పుడు, చంద్రశేఖరుని భక్తి అనే కామధేనువు మన అధీనంలో ఉన్నప్పుడు"** మరొకటేదీ అవసరమే లేదన్న సంగతిని ప్రకటిస్తూ **"పాలసముద్రంలో విహరించే హంస ఇష్టపడి బూరుగు వృక్షానికున్న పండ్లపై ఆశపడుతుందా? మృగరాజైన సింహం వేటాడిన మాంసాన్నే ఆహారంగా స్వీకరిస్తుంది తప్ప యెప్పుడైన గడ్డి మేయదు కదా! పండు వెన్నెలను ఆహారంగా స్వీకరించు చకోరపక్షి చీకటి త్రాగడానికి ఇష్టపడుతుందా? విచ్చిన కమలాల్లోని సువాసనలను ఇష్టపడే తుమ్మెదలు ప్రబ్బలి పూలపై ఆసక్తిని చూపిస్తాయా?"** అంటూ మనందరికీ తెలిసిన పలు ప్రమాణాలతో ఈ ద్విపదలను సుసంపన్నం చేశాడు సోమన్న.

తెలుగు సాహిత్యంలో అపురూపమైన సహజకవిగా లబ్ధప్రతిష్ఠుడైన బమ్మెర పోతన్న భాగవతంలోని **"మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు"** అన్న ప్రసిద్ధ పద్యరచనకు స్ఫూర్తినిచ్చిన పాల్కుర్కి సోమన్న రచించిన బసవపురాణ కానీ, పండితారాధ్య చరిత్రము కాని తెలుగు సాహితీ ప్రపంచాన వెలసిన తొలి స్వతంత్ర కృతులు.



పాల్కురికి సోమనాథకవి (1160-1240)

తత్త్వ విద్యాకలాప కవితాసార, అన్యవాద కోలాహల, ప్రత్యక్ష భృంగీశావతార, జైన మస్త కవిన్యస్తశాతశూల, కలిత బిజ్జలతలగుండుగండ, సంగీతశాస్త్రపారగ, చతుర్వేద పారంగతాది బిరుదవిభ్రాజితుడగు "మహితాత్ముడు".

తెలుగు సాహిత్యంలో ప్రక్రియా వైవిధ్యానికి లోటు లేదు. శతకం, ఉదాహరణ కావ్యం, వచన కావ్యం, నాటకం, కథ, నవల వంటి అనేక ప్రక్రియలు ఈ వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య ప్రపంచంలో వర్ధిల్లుతూ వస్తున్నాయి. తెలుగులో మొట్టమొదటి శతకాన్ని, మొట్టమొదటి ఉదాహరణ కావ్యాన్ని, మొదటి దేశి పురాణాన్ని, మొదటి ద్విపద కావ్యాన్ని, తొలి స్వతంత్ర వస్తు స్వీకృత కావ్యాన్ని రచించిన కవి పాల్కురికి సోమన్నయే నన్నది అందరు సాహిత్య చరిత్రకారులు అంగీకరించిన సత్యము. మహాభారత, రామాయణాది పూర్వ పురాణాల నుండి వస్తువు స్వీకరించకుండా, తాను విశ్వసించిన శివతత్వాన్ని ప్రచారం చేసిన బసవేశ్వరుని చరిత్రను, పండితరాధ్యుని చరిత్రను పురాణాలుగా రచించాడు. సామాన్యులకు కూడా తన కావ్యంలో స్థానం కల్పించిన తొట్టతొలి కవి పాల్కురికి సోమన్న.

అప్రతిమాన ప్రతిభా సముద్భాసియైన సోమన్న సంస్కృతాంధ్ర భాషల్లోనే గాక, ప్రాకృతము, కన్నడము, తమిళము వంటి భాషల్లోనూ నిష్ణాతుడైన కవి. ఛందస్సు విషయంలోను స్వతంత్రించి దేశి ఛందస్సైన ద్విపదను ఎన్నుకొని తదనంతర ద్విపద కావ్యకర్తలకు మార్గదర్శియై నిలిచాడు. నాటినుంచి నేటివరకు సాగి వస్తున్న శతక ప్రక్రియకు 'వృషాధిప శతకాన్ని', ఉదాహరణ కావ్య ప్రక్రియకు 'బసవోదాహరణా'న్ని రచించి అందించిన పాల్కురికి సోమన్న తాను నమ్మిన శైవ మత ప్రచారాన్నే తన ఇతర కృతులైన 'చతుర్వేద సారము', 'బసవ రగడ', 'చెన్నమల్లు సీసములు', 'సోమనాథ భాష్యం', 'బసవాష్టకం' వంటి అనేక రచనల్లో చేసిన గొప్ప శివకవి పాల్కురికి సోమన.

బహు భాషా కోవిదుడు, ద్వైతాద్వైత విశిష్టాద్వైత బౌద్ధ, జైనాది సమస్త ధర్మముల సారము గ్రహించిన మహనీయుడు. సమస్త కవితా సంప్రదాయములపై సంపూర్ణ సాధికారికత కలిగిన మహాపండితుడు. 'జానుతెనుగు'పై విశేష మమకారము కలిగిన తెలుగు భాషా ప్రేమికుడైన పాల్కురికి సోమనాథుడు తెలుగు సాహిత్య ప్రపంచానికి కొత్త వెలుగులను ప్రసాదించిన కవి భాస్కరునిగా సంభావించడం సర్వ విధాలా సరియైన ఆలోచన.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2  UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2023

# బహుముఖ ప్రతిభాశాలి "ఆదిరాజు వీరభద్ర రావు"

**వైద్యం గార్గేయి,** పరిశోధక విద్యార్థి, ఫోన్ : 88970 60999

ప్రతిభ నవనవోన్మేషణమైన ప్రజ్ఞ. అటువంటి ప్రజ్ఞావంతులు తమ ప్రతిభ చేత తాము జీవిస్తున్న సమాజం వరకే పరిమితం కాకుండా భవిష్యత్తరాలకు కూడా వివిధ రూపాలలో తమ ప్రతిభా కిరణాలను ప్రసరింప చేస్తుంటాడు. ఒక్కొక్కరి ప్రతిభ ఒక్కొక్క రంగంలో వికసిస్తూ ఉంటుంది. కొందరు వివిధ రంగాలకు తమ ప్రతిభను విస్తరింప చేసి ఆయా రంగాలకు మార్గదర్శకులవుతుంటారు. మరికొందరు ప్రతిభావంతులు తమ అభిరుచికి తగిన రంగము నందలి వివిధ విషయాలపై తమ దృష్టి సారించి అనేకములైన కొత్త కొత్త విషయాలను వెలికి తీసి లోకానికి అందిస్తుంటారు. అందుకే అటువంటి వారు పుట్టుకతో సామాన్యులైన తమ ప్రతిభ చేత తమ పుట్టుకకు సార్థకత చేకూర్చి అసామాన్యులు అనిపించుకుంటుంటారు. సమాజపు రుగ్మతలను పోగొట్టి సమాజ సంస్కరణలకు నడుం కట్టి సామాజిక అసమానతలకు ఏమాత్రము ఆస్కారము లేకుండా నూతన సమాజ నిర్మాణం కొరకు కృషి చేసే మార్గంలో తమ జీవితాలను అంకితం చేస్తుంటారు. అందుకే వారిని లోకం మహనీయులుగా కీర్తిస్తుంది.

అటువంటి మహనీయులలో కీ.శే ఆదిరాజు వీరభద్రరావు గారు ఒకరు. వారు సంచరించినది 'అక్షర క్షేత్రం'. వారి ఆసక్తి "పరిశోధన", వారి అధ్యయన విషయం "చరిత్ర", వారి ఆలోచన "సామాజిక జీవనం". వీటి సమాహారంతో తమ సంపూర్ణ జీవితాన్ని పండించుకున్న వీరభద్రరావు గారు ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన అసామాన్యుడు. వారిది నిరాడంబరమైన వ్యక్తిత్వం. నిస్వార్థ సేవాగుణం. ధనానికి కాని, పదవులకు కాని ఏ మాత్రం ఆశపడని ఆదిరాజు వారు క్రీ.శ.1890 నవంబరు 16న ఖమ్మంమెట్టు జిల్లాలోని మధిర తాలూకా దెందుకూరు గ్రామము నందలి లింగయ్య, వెంకమ్మ దంపతులకు జన్మించిన ఏకైకపుత్రుడు. 5 సం॥ బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన దురదృష్టవంతులైన ఆదిరాజు వీరభద్రరావు గారు తల్లిగారి ఆలనాపాలనలో తమ పెదనాన్న రామకృష్ణ రావు గారి వద్ద కొంత కాలము కొణిజర్ల గ్రామములోనే ఉండి వీధి బడిలో విద్యాభ్యాసం ప్రారంభించారు. ప్రాథమిక విద్య ముగించిన తరువాత తమ మాతృమూర్తికి దూరపు బంధువులైన రావిచెట్టు రంగారావు గారి సాన్నిహిత్యం వారికి లభించింది. అప్పటికి 10 సంవత్సరాల వయసున్న ఆదిరాజు వారికి రావిచెట్టు వారి సాన్నిహిత్యం లభించడం ఆదిరాజు వారి జీవితంలో సరికొత్త వెలుగులు ప్రసరించడానికి కారణమైనది. సంతానం లేని రావిచెట్టు రంగారావు గారు పుత్ర సమానులుగా వీరభద్రరావు గారిని ప్రేమించి చిన్ననాటనే వారిలో సాహిత్యం పట్ల అభిరుచిని, సమాజం పట్ల అనురాగాన్ని కలిగించే విధంగా వారి బాల్యాన్ని తీర్చిదిద్దినారు.

నిజాం ఏలుబడిలో తెలుగు భాషా దైన్య స్థితికి చింతించి ప్రతిభామూర్తులైన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారు, మునగాల రాజా నాయని వెంకట రంగారావు గార్ల ఆలోచనలతో ఏకీభవించిన రావిచెట్టు రంగారావు గారు వారితో పాటు తెలుగు భాషా వ్యాప్తికి ఒక గ్రంథాలయం అవసరం అన్న భావనతో 1901 సెప్టెంబరు 1వ తేదీన ఆనాటి హైదరాబాదులో "శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయ" స్థాపనకు అంకురార్పణ చేసినారు. ఈ భాషానిలయ స్థాపనమే ఆదిరాజు వారికి నూతన మార్గాన్ని చూపిన దీపకళిక. చిన్ననాటి నుండే ఈ భాషా నిలయమునకు సేవ చేయునవకాశం లభించిన ఆదిరాజు వారికి విస్తృతముగా పలు



విధములైన గ్రంథాలను అధ్యయనము చేయు అవకాశం లభించినది. ఇది వారిలోని రచయితను, పరిశోధకుని, చరిత్రకారుని తట్టిలేపినది. అది ఆయన ప్రతిభకు ఆయన చేయవలసిన బాధ్యతకు మార్గం చూపినది.

అవి బ్రిటీష్ పరిపాలన జరుగుతున్న రోజులు. తెలంగాణ ప్రాంతమునందు నిజాం రాజు రాక్షస పాలన కొనసాగుతున్న రోజులు కూడా అవే. ఇక్కడి ప్రజలు రజాకారుల అరాచకమైన, క్రూరమైన చర్యలకు బలి అవుతున్న సందర్భంలో ప్రజలలో చైతన్యం నింపవలసిన బాధ్యత రచయితలపైన ఉన్నదని గుర్తించిన ఆదిరాజు వీరభద్రరావుగారు ఆ దిశగా కృషి సాగించినారు. అందుకే మాడపాటి హనుమంతరావు గారి వంటి పెద్దలకు సహకరిస్తూ. తెలుగు భాషాభివృద్ధిలో భాగస్వామ్యం వహించి నాటి చారిత్రక అవసరమైన స్త్రీ విద్యా వ్యాప్తికి కూడా తోడ్పడినారు. విద్యార్జన చేయు స్త్రీల కొరకు పాఠశాలలను, కళాశాలలో వసతి గృహాలను నిర్మించే విషయము నందు పెద్దలందరికి తమ పూర్తి సహకారమును అందించారు. ఈ విధమైన సామాజిక కార్యక్రమాలలో

తమ శాయశక్తుల కృషి చేయడమే కాక సాహిత్య రంగములోను తమకృషిని విస్తరింపచేశారు. తమకిష్టమైన సాహిత్య రంగమునందు ప్రధానమైన గ్రంథాలయాల స్థాపనతో పాటు, గ్రంథరచనావ్యాసంగంలోను, బహు విధములైన సేవలు అందించే సాహిత్య సంస్థల స్థాపనలోను, అవసరమైన మేర పరిశోధనలు చేసి ఈ ప్రాంతము నందలి అనేక విషయములను వెలికి తీసి ప్రపంచానికి అందించిన వారు ఆదిరాజు వీరభద్రరావు గారు.

ఈ ప్రయత్నంలో భాగంగా ఇక్కడి ప్రసిద్ధ నగరాలకు సంబంధించిన విశేషముల ఆధారముగా ఈ ప్రాంతపు గొప్పతనాన్ని గురించి, ఈ ప్రాంతాలన్నీ పరిపాలించిన రాజుల చరిత్రను గురించి, ఇక్కడి రచయితల జీవిత చరిత్రలను గురించి, ఈ ప్రాంతంలో సామాజిక సేవలందించి పర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తున్న మహామహుల జీవిత చరిత్రలను గురించి, ఆదిరాజు వారు తమకు లభించిన శాసనాలను, తాళపత్ర గ్రంథాలను పరిశీలించి అనేక రచనలు చేశారు.

అత్యంత దృఢ సంకల్పం కలిగిన వీరభద్రరావు గారు తాము నెరవేర్చదలచుకున్న పనికొరకు నిరంతరము కృషి చేస్తూ సమయాన్ని లెక్కచేయక దానిని పూర్తి చేసే వారు. దేనికైనను నిరాశపడి వెనుకంజవేసే తత్త్వం వారిలో లేదు. తాము బాధ్యత తీసుకుని నిర్వహింపదలచిన కార్యక్రమము పైననే దృష్టిని నిలిపి పొగడ్తలకు కాని, తెగడ్తలకు కాని పొంగిపోక, కృంగిపోక మిక్కిలి నిబద్ధతతో పని చేసి తమ కర్తవ్య దీక్షను ఫలవంతమయ్యే దిశగా కొనసాగించే వారు.

ఆదిరాజు వీరభద్రరావు గారి బహుముఖీనమైన ప్రతిభను విశ్లేషించవలసిన సందర్భం వచ్చినపుడు సాహిత్య సంస్థలలో వారి ప్రాతినిధ్యం, ప్రభావశీలురైన మహనీయుల ప్రభావం వారిపైన ఎంతగా ఉన్నదో, సమకాలీన పరిస్థితులు ఏ విధంగా ఉండెడివో విశ్లేషించుకొనవలసిన అవసరం ఉంటుంది. నాటి ప్రసిద్ధ సంస్థలైన లక్ష్మణరాయ పరిశోధక మండలి, విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు వంటి గొప్ప గొప్ప సంస్థలలో వారి భాగస్వామ్యం పెద్దది. తమ అపూర్వమైన సేవలను ఆయా సంస్థల అవసరాలకు అందించి ఇతోధికంగా వాటి అభివృద్ధికి తోడ్పడిన మహనీయులు ఆదిరాజు వీరభద్రరావు గారు. ఒక కార్యకర్తగా, ఒక భాషా సేవకునిగా, ఒక రచయితగా, ఒక గ్రంథ ప్రకాశనకారుడిగా, ఆయా సంస్థల కృషిలో తాము భాగస్వాములు అయ్యే విధంగా వారి కృషి కొనసాగింది.

ఆదిరాజు వీరభద్రరావు గారి వ్యక్తిత్వంపై ఎందరో మహనీయుల ప్రభావం ప్రసరించినది. సంస్థల నిర్వహణ, బాధ్యతలను గురించి సామాజిక సేవారంగమునందలి విషయమును గురించి నాయని వెంకట రంగారావు గారు, రావిచెట్టు రంగారావు గార్ల వంటి వారి ప్రభావం, రచన, చరిత్ర పరిశోధన, శాసన పరిష్కరణ వంటి అంశాలలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారు, ఆదిపూడి సోమనాథరావు గారి వంటి ప్రముఖుల ప్రభావం వారిపై ప్రసరించింది. సమకాలీన సమాజంలోని ప్రజల కష్టములకు చలించిన ఆదిరాజు వీరభద్రరావు గారు నాటి సమాజ వికాసానికు అవసరమైన స్త్రీ విద్యావ్యాప్తి వంటి విషయములలో మాడపాటి హనుమంతరావు గారి వంటి వారి ప్రభావం అధికంగా ప్రసరించి ఆయా రంగములలో తమ ప్రతిభకు తగినట్టుగా తమ సేవలను అందించడానికి ఆ మహనీయుల ప్రభావమే కారణము.

ఒక రచయితగా, ఒక పరిశోధకునిగా ఆదిరాజు వీరభద్రరావు గారి కృషి అపారమైనది. వారు సాహిత్యంలో సాహిత్య సంబంధమైన, విద్యారంగ సంబంధమైన, స్త్రీల జీవిత సంబంధమైన రచనలతో పాటు బాలబాలికలకు అవసరమైన నైతిక విలువలను ఇనుమడింప చేసే అనేక రచనలను సరళమైన భాషలో అందించినారు. ఒక పరిశోధకునిగా వారి ప్రతిభను దర్శింప చేసే 'ప్రాచీనాంధ్ర నగరములు', 'మన తెలంగాణము', 'షితాబుఖాను', 'తెలంగాణ శాసనములు', మొదలైన ప్రత్యేక గ్రంథములే కాక అనేక పరిశోధన వ్యాసములు కూడా వారు ప్రకటించినారు. అదే విధంగా 'విజ్ఞాన సర్వస్వం', 'సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం' వంటి సంపుటముల కొరకు వారు రచించిన 55 వ్యాసములలో వ్యక్తులు, జిల్లాలు, దేవాలయములు, శిల్పకళ, బౌద్ధ దేవతలు, ఊర్లపేర్లు, గుహాలయములు, యక్షగానములు, నదులు, జాతులు మొదలైన విషయ వైవిధ్యముతో కూడిన ప్రామాణిక వ్యాసములు రచించినారు. ఈ వ్యాసములు వారికి వివిధ విషయముల పై వారికి గల సమగ్రమైన అవగాహనకు నిదర్శనములు అని చెప్పవచ్చు.

ఆదిరాజు వీరభద్రరావు గారికి అనేక సాహిత్య సంస్థల స్థాపనలోను, కార్య నిర్వహణలోను, గరిష్టమైన సంబంధము కలదు. స్వాతంత్ర్యము రాకముందు నుండి స్వాతంత్ర్యనంతరము కూడా అనేక సంస్థలతో వారికి సాన్నిహిత్యం కొనసాగింది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం, విజ్ఞాన చంద్రికా గ్రంథమాల, ఆంధ్రజన సంఘం, ఆంధ్ర పరిశోధక మండలి, విజ్ఞాన వర్ధినీ పరిషత్తు, ఆంధ్రచంద్రికా గ్రంథమాల, ఆంధ్రసారస్వత పరిషత్తు, ఆంధ్ర బాలికోన్నత పాఠశాల, సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశ సమితి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వంటి సంస్థలకు వారందించిన సేవలు నిరుపమానమైనవి.

కేవలం ఒక పాఠశాల ఉపాధ్యాయునిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వహించిన ఆదిరాజు వీరభద్రరావు గారు ఉద్యోగ విరమణ అనంతరము కూడా అనేక రంగాలకు తమ సేవలను అందించి జీవిత పర్యంతము సామాజిక సేవా పరతంత్రులై 83వ ఏట (1973 సెప్టెంబరు 28) తమ భౌతిక జీవితం నుండి అంతర్ధానమయినారు.

# భారతీయీకరణ - 17

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత - భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

ఆధునికంగా ప్రయాణసాధనాలూ, సౌకర్యాలు అధికం కావడంతో దూరం అనేది తొలగిపోతున్నది. వెనుకటికంటే అధికంగా దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు కలిసిపోతున్నారు. పెద్ద పెద్ద పరిపాలనా, పారిశ్రామిక సంస్థలు దేశంలోని వివిధ ప్రాంతాలలో నెలకొనడం వల్ల, అక్కడికి వివిధ ప్రాంతాల కార్మికులు వచ్చి కలిసి జీవించడం వల్ల ఈ విధానం మరింత వేగం పుంజుకొన్నది. ఒక ఉమ్మడి ప్రయోజనం కోసం వివిధ కులాలకూ మతాలకూ చెందినవారు సామూహిక జీవనం సాగించే ఆరోగ్యకరమయిన విధానానికి సైనిక దళాలూ, కంటోన్మెంటులూ, సైనిక స్థావరాలూ ఒక గొప్ప ఉదాహరణ.

ప్రజలలో జాతీయ భావననూ, భారతీయతనూ అతి తక్కువ ప్రయత్నంతోనే వేగంగాకలిగించడానికి వీటన్నింటినీ ఉపయోగించు కోవచ్చు. ఈ విషయంలో మన రక్షణ దళాలు వీటిని ఎంతో సమర్థ వంతంగా, ఆదర్శవంతంగా నిర్వహిస్తున్నాయి. విభిన్న ప్రజలను అధిక సంఖ్యలో ఒక చోటికి తీసుకు వచ్చి ఉమ్మడిగా పనిచేయించే ఇతర సంస్థలన్నీ మన రక్షణ దళాలను ఆదర్శంగా స్వీకరించి లాభం పొందవచ్చు.

ఇట్లాగే, అంతర్దేశీయ వినోదయాత్రలనూ, పుణ్యక్షేత్ర యాత్రలనూ ప్రత్యేక రైళ్లు, చౌకగా వసతి సౌకర్యాలు కలిగించి విరివిగా ప్రోత్సహించడం కూడా ఈ విధానానికి ఎంతో సహాయకమవుతుంది.

USAలోని విలియమ్స్ బర్గ్ నమూనాలో ఈ దేశపు చరిత్ర యొక్క సర్వవ్యాపక స్వరూపాన్ని ప్రదర్శించగల, జాతీయ ప్రాధాన్యం గల కొన్ని ప్రదేశాలను ఎన్నిక చేసి, వాటిని అభివృద్ధి పరచడం భారతీయీకరణ దృష్ట్యా కూడా ఎంతో సహాయకమవుతుంది. తక్షశిల,





మొహంజదారో ఈ విధానానికి ఉచితమయిన రెండు స్థలాలు, కానీ ఈనాడు వాటిని మనం కోల్పోయినాము. అయినా, ఈ దృష్ట్యా పాటలీపుత్రం (పాట్నా), నలందా, కన్యాకుమారి, శ్రీనగర్, చిత్తోడు దుర్గం, అభివృద్ధి చేసి తగిన విధంగా అన్ని సదుపాయాలు పెంపొందించి మిక్కిలిగా ప్రసిద్ధిలోకి తీసుకురావలసిన ప్రదేశాలలో కొన్ని ఈ ప్రదేశాలలో ప్రత్యేక ప్రదర్శనశాలలూ, స్టూడియోలు నిర్మించి అతి ప్రాచీన కాలం నుంచి ఈ నాటి వరకూ ఈ స్థలాల చరిత్రను మరియు ఈ ప్రాంతాల సైనిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్యక మహావ్యక్తుల ఉజ్జ్వలమయిన జీవితాలకూ సంబంధించిన చలన చిత్రాలను ప్రదర్శించవలసి ఉంటుంది. అంతేకాదు, విద్యార్థులూ ఇంకా ఇతరులూ వీటిని దర్శించేందుకు అధిక సౌకర్యాలు కలిగించి, విశేష ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది.


ఇటీవలి కాలపు చరిత్ర దృష్ట్యా ప్రధాన చారిత్రక ప్రదేశాలు ఇంకా కొన్ని ఉన్నాయి. ఫిరోజ్‌పూర్ వద్ద సత్‌జల్ నదీ తీరాన భగత్ సింగ్- రాజగురు- సుక్ దేవుల సమాధులు, అమృతసర్ లో జలియన్

వాలాబాగ్, ఢిల్లీలో ఎర్రకోట, అహ్మదాబాదులో సబర్మతి ఆశ్రమం, పూనాలో తిలక్ మందిరం, కలకత్తాలో నేతాజీ గృహం– ఆంగ్లేయులకు విరుద్ధంగా సాగిన స్వాతంత్రోద్యమ సంగ్రామ చరిత్రలో వీటన్నింటికీ ప్రత్యేక స్థానం ఉన్నది. వీటన్నిటినీ యాత్రా స్థలాలుగా అభివృద్ధిచేసి, సుప్రసిద్ధం కావించవలసి ఉన్నది. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర – అసంఖ్యాకులయిన జ్ఞాత – అజ్ఞాత విప్లవవీరులు, దేశభక్తులు, మృతవీరులు – వీరందరికీ సంబంధించిన వివిధ చిత్రాలు ఆయా ప్రదేశాలలో ప్రదర్శించడమేగాక, ప్రత్యేకంగా తయారుచేసిన చలనచిత్రాల ద్వారా అందరికీ తెలియజేయడం అవసరం. ఉదీయమాన యువతరానికి లాల్– బాల్–పాల్, (లాలాలజపతిరాయ్– బాలగంగాధర్ తిలక్– బిపిన్ చంద్రపాల్), భగత్ సింగ్, దాస్ (దేశబంధు చిత్తరంజన్ దాస్), దత్తు (ఈశ్వరచంద్ర దత్తు) లను గూర్చి, దయానంద, వివేకానందులను గురించి, మాస్టర్ అమీర్ చంద్, లాలా బలరాజులను గురించి, ఆంగ్లేయులకు విరుద్ధంగా సాగిన దీర్ఘకాలిక స్వాతంత్ర సంగ్రామంలో వారు నిర్వహించిన మహత్తర పాత్రను గురించి దాదాపుగా ఏమీ తెలియదు. ఆరోగ్యకరమయిన జాతీయ భావన కేవలం గాంధీ– నెహ్రూల స్మృతులతో మాత్రమే స్థిరంగా నిలబడి పోజాలదు.

భారతీయీకరణ భావాన్ని అమలులోకి తీసుకురావడానికి ఇవి కొన్ని మార్గాలు, సాధనాలు, కార్యక్రమాలు, వీటన్నింటినీ అమలు పరచడానికి నిధులు గూడా ఎక్కువ అవసరం లేదు. అవసరమయిన దల్లా, దేశంలో ప్రజాస్వామిక నాయకులమనీ, చెప్పుకునే వారందరిలో ప్రజ్వల దేశాభిమానము, జాతీయ భావన, భావనాత్మక– నిర్మాణాత్మకమైన ఆలోచన, భారతదేశ భవిష్యత్తును గూర్చి గాఢమయిన విశ్వాసం మాత్రమే. వీరిలో పాలకులూ, వారి విమర్శకులూ – అంటే, ప్రభుత్వంలోనూ, లోక్ సభలో దాని వెలుపల గూడా ఉన్న ప్రతిపక్షాలలోనూ ఉండేవారు – అందరూ చేరుతారు. తాము చేసే పనులలో నీతి నిజాయితీ, కులాలకూ మతాలకూ, పక్షాలకూ, తెగలకూ, అతీతంగా దేశాన్ని భావించగల నిశ్చయం దీనికి ప్రధానం. రాజకీయ నాయకులందరూ భారతీయీకరింపడితేనే ఇది సాధ్యమవుతుంది. భారత ప్రజల మనస్సులూ, బుద్ధులూ, ఇంకా ఆరోగ్యవంతంగానే ఉన్నాయి. సరయిన ప్రతిస్పందన కలుగవలెనంటే, సరి అయిన తంత్రిని మీటి, ఉచితమయిన ప్రేరణ వారిలో కలిగించడం అవసరం. 1962లో చైనా దురాక్రమణ సందర్భంలోనూ, 1965లో పాకిస్తాన్ యుద్ధ సందర్భం లోనూ స్థిరంగా నిరూపితమయిన ఏకత్వాన్ని చూస్తే, మనం ఇంకా దాన్ని పూర్తిగా కోల్పోలేదనీ, నివురుగప్పినట్లుగా ఉన్న ఆ జాతీయతను ప్రజ్వలత్ జ్వాలగా మార్చు కొనవచ్చుననీ నమ్మకం ఉన్నది. అయితే, దాన్ని అట్లా చేయగల నాయకులు అవసరం. ప్రస్తుత నాయకత్వం, తాను విఫలమవుతూ, దేశాన్ని విఫలం చేస్తున్నది. దానిలో దేశభక్తి జ్వాల లేదు. అందువల్ల అది ఇతరులలో ఆ జ్వాలను మండించజాలదు. కాబట్టి ఆ నాయకత్వం భారతీయీకరింపడవలసి ఉంటుంది. లేదా, దేశభక్తి గల వారికి అవకాశం కలిగే విధంగా త్రోసివేయబడవలసి ఉంటుంది. మళ్లీ దేశాన్ని ఉదాత్తం, పటిష్టం చేయడానికి తగినంత మానవధనం భారత మాతృదేవికున్నది. ఆ వ్యక్తులను గుర్తించి దేశాన్ని పురోగమింపజేసే అవకాశం వారికి కలిగించాలి. లేకపోతే పరిస్థితులే వారిని పైకి లేవనెత్తుతాయి. చాలాకాలం నుంచి గింజగా నటిస్తున్న పొట్టును ఊదివేస్తాయి.

దేశాభిమానం గల భారతీయులందరూ ఈ ప్రయోజనం కోసం గాఢంగా ప్రయత్నించాలి. మాతృదేశాన్ని మళ్లీ ఒకసారి విభజించవలెనని ప్రయత్నించే వారి కలలన్నీ శాశ్వతంగా ధ్వంసమయ్యేవిధంగా భారతీయీకరణ విజయం పొందాలి.

శిలాక్షరం
(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 25 హైదరాబాద్ డిసెంబర్ : 2023

# ఆధునిక తత్త్వగీతాల, అలుపెరుగని వాగ్గేయకారుడు – గోరటి వెంకన్న

**బానోత్ వెంకటేశ్వర్లు**, తెలుగు పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 8790391050



నిత్య జీవితానుభవాలు, సమస్యల పట్ల స్పందనల ద్వారా ఆవిర్భవించే అరుదైన చింతనే తత్త్వం అనబడుతుంది. ఇది జీవితాన్ని సమగ్రంగా, నిలకడగా చూడగలిగే శక్తినిస్తుంది. భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుంది. సత్యాన్వేషణకు బాటలు వేస్తుంది. నిజానికి ఈ తాత్త్వికతే కవిత్వానికైనా గాఢతను కలిగిస్తుంది. అటువంటి తాత్త్వికత మానవజీవనానికి సంబంధించి ఉంటే అది జీవనతాత్త్వికత అవుతుంది. కవి మానవజీవితాన్ని స్వీయానుభవంతోను, తార్కిక బుద్ధితోను పరిశీలించి, పరిష్కరించే పద్ధతులను కవిత్వమాధ్యమంగా ఆవిష్కరిస్తాడు. అలా తాత్త్విక జీవితాన్ని సునిశితరీతిన పరిశీలించి, అభివ్యక్తి చేసిన వాగ్గేయకారుడు గోరటి వెంకన్న. ఈయన సృజించిన పాటలనిండా ఈ తాత్త్వికతే పాలమీద మీగడలా పరుచుకొని ఉంది.

ఒకనాటి పాలమూరు జిల్లా తాత్త్వికులైన వాగ్గేయకారులెందరికో పుట్టినిల్లు. యోగులైన రాకమచర్ల వేంకటదాసు, వేపూరి హనుమద్దాసు, మన్నెంకొండ హనుమద్దాసు, అహ్మదుద్దీన్ వంటి వారి తత్త్వాల ప్రభావం గోరటి వెంకన్న పై ప్రగాఢంగా ఉంది. ఈయన తండ్రి నరసింహ మహబూబ్‌నగర్ జిల్లాలో అవధూతగా ప్రఖ్యాతులైన కోటగిరి చంద్రమౌళీశ్వర స్వామి వారి శిష్యులు,హఠయోగి చెన్నదాసు గారివద్ద ఉపదేశం పొందాడు. ఈ రకంగా గోరటి వెంకన్నపై తన తండ్రి ప్రభావమూ ఉంది. తండ్రి తత్త్వాలను పాడగా విని ప్రతిరోజు చైతన్యాన్ని పొందుతుండేవాడు. ఆ పాటల్లోని మౌలికాంశాలను మదిలో నిలుపుకొని తనుకూడా తత్త్వగీతాల సృజనను సాధన చేశాడు.

**'మతభేదం, కులభేదం మరిసి కలిసె మనఊరు'** అంటూ పల్లెప్రజల అన్యోన్యతను వివరించినా, **చేసుకున్నోడెంత పాపిష్టి మనిషైన పతిసేవనే నీకు అతిపుణ్యమన్నారు** అని, లింగ వివక్షతను వ్యతిరేకించినా, సమతా ధర్మం మనది, సత్యమార్గం మనది అంటూ విశ్వమానవ భావనను ప్రతిపాదించినా, శేషప్ప వరకవి నీతిశతక రాసులలో ఇద్దాసు, రామదాసు, వేపూరి యాదిలో అంటూ భక్తకవులను ప్రస్తుతించినా, గోరటి వెంకన్న గేయాలలో తత్త్వమే దండలో దారంలా ఒదిగిపోయింది. ఈయన రచనల్లో తాత్త్విక దృష్టిని విస్మరించని ఉద్దేశపూర్వకమైన జాగరూకత కనిపిస్తుంది. **"తెల్లారిపోతుంది హరిదాస నీవు బయలెల్లి పోవాలి హరిదాస"** అనే పల్లవితోసాగే 'తెల్లారి పోతుంది' అనే గీతంలో ఈ కవి తాత్త్విక భావనలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.


**"మూట ఎందుకు వెంట హరిదాస/దాంట్లె మురికి గూడుతదంట హరిదాస/ మోసుకొచ్చినదెంత హరిదాస/నీవు తీసుకెళ్ళేదెంత హరిదాస"** నిండైన తాత్త్వికతను నింపుకున్న ఈ వాక్యాలే కవిలోని సత్యాన్వేషణా శక్తిని సూచిస్తున్నాయి. అభివ్యక్తి చేయగల, స్పందనా గుణం ఉన్న ఒక సామాన్య వ్యక్తిని కవిగా మలిచేది, ప్రతీ సత్యాన్ని కనుగొనడానికి అవసరమయ్యేది ఈ తాత్త్వికతే. ఇదే సమస్త శాస్త్రాలకూ మూలమై మనిషిని మహోన్నతుడిని చేస్తుంది. జీవన మార్మికతను వెతికి పట్టుకునే శక్తిని ప్రసాదిస్తుంది.

పుట్టినప్పుడు వెంట తెచ్చుకొన్నది లేదు. మరణానంతరము వెంట తీసుకుపోవునదీ లేదు. బొంతతో సమానమైన ఈ శరీరము శూన్యమనే విషయాన్ని గుర్తెరిగి నడుచుకొనువాడే అసలైన సాధకుడు. అత్యంత విలువైన మూట పరమునందుండగా, మురికితో కూడిన శరీరంపై వ్యామోహము పనికిరాదని తత్త్వాన్ని తారాస్థాయికి చేర్చి రాసిన పై గేయపంక్తులు పరిశీలించదగినవి.

"బాటసారి" గేయంలోనూ వెంకన్న తాత్త్వికత ప్రకాశవంతంగా గోచరిస్తుంది.

**"పైన చీకటిలొట్ట కింద చీకటిలొట్ట**
**నట్టనడుమున్నా పొట్టరా ఓ బాటసారి!**
**నడక సాగనీయ దంటరా ఓ బాటసారి"** అంటూ మోక్ష మార్గానికి అవరోధమైన సమస్తమైన ఆకలికి కారణం 'పొట్ట' అని, అది మానవ దేహానికి మధ్యనున్న ఖాళీ అని,ఇది సత్యాన్వేషణకై ముందుకు సాగనీయదని జీవుడిని బాటసారిగా పోల్చి చెప్తాడు. "రాత్రి" పాటలో ప్రతిపాదము తాత్త్విక చింతనతో రాయబడింది.

**"కాలుతున్న కాటినుంచి కమురు లేసిందో**
**పల్లెచుట్టు కమ్మిందో**
**కమురు వాసనకు కొంగలు కలత నొందినయో**
**లేసి కలయ సూసినయో**
**మనసెరిగిన బైరాగేమో మాయ నెరిగిండో**
**బతుకు మర్మమిప్పిండో"**



పై పంక్తులలోని పరమార్థమేమిటంటే సంకేతాత్మకమైన, మానవజీవన అవస్థలను గుర్తుచేస్తూ జ్ఞానబోధ చేయడం. కళ్ళముందు ఎన్ని మరణాలు సంభవిస్తున్నా అసలైన సత్యాన్ని తెలుసుకోలేని మూఢత్వాన్ని తొలగించుకోవాలని ఎరుకపరుస్తున్నాడు. తత్త్వ గేయాలలో కవి వస్తువును గురించి ఏది చెప్పాలని ఉద్దేశిస్తాడో, అది కచ్చితంగా ఇదేనని నిర్ధారించజాలము. ఇటువంటి గీతాలలో తత్త్వకవుల రచనా సామాగ్రి ప్రాపంచిక కవులకన్నా భిన్నంగా ఉంటుంది.

'బైరాగి' పాటలో సర్వసంగపరిత్యాగము చేసిన యోగి పుంగవుని జీవన విధానమంతా దర్శింపజేశాడు.

**"అంతరాంతరాల్లో అలరారే తడివల్ల**
**లోచూపు వెలుగంగ లోకమగుపించెనా...**
**నీ వెర్రిలోకాన నీవెల్లి పోతుండ**
**ఎందుకో తరసి సూసెదరు**
**నీ వెనుక నీడోలె వెంబడించెదరు"**

మనసులో ఎరుకకలిగి అంతరాంతరాలలో అలరారెడి తడివల్ల లోలోపల మోక్షసాధనకై, సత్యాన్వేషణకై తపన కలిగి ఉండటాన్ని సూచిస్తాడు. లోకపు స్వరూప స్వభావాలు అవగతమయిన తరువాత, మానవ జీవన లక్ష్యము యొక్క పరమార్థ భూత విశేషమేదో అది తెలుసుకున్న తరువాత నీ వెర్రిలోకంలో సంచరిస్తూ ఈ భౌతిక ప్రపంచాన్ని అశాశ్వతమని నిర్లక్ష్యం చేసిన తరువాత ఎందుకో జనులు పరీక్షగా చూస్తారు. పిచ్చివాడవని ముద్రవేస్తారు. నీ వెంటపడి వేధిస్తారు. నీ వెవరివో, దేనికోసం వెదుకుతున్నావో, నీవు సాధించిన జ్ఞానమెంతో తెలుసుకోవడానికి ఒక్కరైనా ప్రయత్నించరు. **"తావునిడిసిన తనువు తల్లడిల్లుచు నుండ యతల గాయాలను బైరాగి! లోకమెతికి జూసెనా బైరాగి"** అంటూ బైరాగి మరణించిన పిమ్మట, అతను జ్ఞానసాధకుడై చేసిన సఫల ప్రయత్నాన్ని గుర్తిస్తారు. అతని మనసుకైన గాయాలను లెక్కిస్తారంటాడు.

**"ఏ దారుల్లో తిరిగావో ఏ పూలగాలి నిను సోకిన పరిమళాలను పంచి ఇచ్చినా మురిసి పోవు..కలిసిపోవ వెందుకో!"** అంటూ అంతరార్థంగా ఆత్మజ్ఞానులై నశ్వరత్వ భావన కలిగిన వారిని ఆనంద, విషాదాలేవీ చలింపజాలవని, ఆ రెండింటికీ ఏకరీతిగా స్పందిస్తూ వుంటారని బైరాగి తత్త్వాన్ని బోధిస్తాడు.

తాత్త్వికుల రచనల్లో సంచార ప్రీతికూడా ప్రధానమైనది. ఇటువంటి సంచార ప్రియత్వాన్ని 'సంచారం' అనేగీతంలో ప్రస్తావించాడు.

**"సంచారమే ఎంతో బాగున్నది**
**దీనంత ఆనందమేమున్నది**
**ఇల్లు పొల్లు లేని ముల్లె మూటలేని**
**వెంబడించే వెర్రి జ్ఞాపకాలులేని**
**సేదతీర చెరువు కట్టున్నది**
**నీడకోసం చింత చెట్టున్నది..**
**బరువు దిగిన గుండె బలె ఉన్నది**
**సంచారమే సంతసంగా ఉన్నది"**

ఏ బంధాలు లేకుండా తమ జీవితానుభవంతో లోకానికి మంచిని బోధిస్తూ తిరుగాడిన ఎందరో లోకసంచారుల,తాత్త్వికుల ప్రభావంతో రాసిన తాత్త్విక గేయాలు గోరటి వెంకన్నలోని కనిపించని బైరాగి తత్త్వాన్ని బహిర్గతం చేస్తాయి. పై చరణంలో ఐహిక కౌటుంబిక లంపటాలూ, సిరిసంపదల వ్యామోహాలు లేని సంచారమే ఆనందమంటాడు.

'తాడులేని నీడ' పాటలో..

**నా మనసు పసిగట్టి నన్నే వణికిస్తాది**
**నీతోడు నేనుంట నాకెవరు తోడంటు**
**పెదవి విప్పుకున్న పెనుప్రశ్నగ వుండు.....**
**అవధూతలను గూడ అది ఎక్కిరిస్తాది**
**నన్నొదల లేవని నవ్వుతాది నీడ"** అంటూ..

నీడను మృత్యువుతో పోల్చుతూ అది అవధూతలను కూడా వదిలి పెట్టదని, తననుండి ఎవ్వరూ తప్పించుకోలేరనే పరమ సత్యాన్ని అది ఎప్పటికప్పుడు హెచ్చరిక చేస్తుంటుందని, అది సమీపించే లోపు మనిషి తన జీవన తత్త్వాన్ని ఎరుక పరుచుకోవాలని ఉద్బోధిస్తాడు.

ఇలా అనేక రీతులుగా తాత్త్విక చింతనను గోరటి వెంకన్న తన పాటల్లో ప్రతిభావంతంగా ప్రదర్శించాడు. మరింత పరిశీలనగా చూస్తే తాత్త్వికేతర భావనలతో రాసిన పాటల్లోనూ ఏదో ఒక చరణం లో తత్త్వచింతనను పొందుపరిచిన తావులు అనేకం కనిపిస్తాయి. అందుకే గోరటి వెంకన్న ఆధునిక తత్త్వగీతాల అలుపెరుగని వాగ్గేయకారుడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2  UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2023

గ్రంథాంతరంగం 29

# శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు,** ఫోన్ : 9964082076

**"చారిత్రక విషయశోధనము గావించు వారికి. కవి జీవితమునకు, గ్రంథసముదాయము నకు నిజాము రాష్ట్రము రత్నఖని. ఈ ఖని యందలి రత్నము లన్నింటిని సమకూర్చుట యమూల్య హారము గావించి ఆంధ్రభారతి కంఠమున నలంకరించుట ప్రత్యాంధ్రుని విధి. ఎనిమిది మండలముల వైశాల్యముగ అఱువది నాలుగు లక్షల యాంధ్ర సోదరులకు నెలవై గద్వాల. వనపర్తి మున్నగు స్వదేశ సంస్థానముల కాటపట్టయి ఆంధ్ర వాఙ్మయ పీఠమగు నీరాష్ట్ర మధ్యమున ఆంధ్రుల పక్షమున ఒక చిత్రవస్తు ప్రదర్శనశాల. ఒక ప్రాచీన గ్రంథనిలయము. ఒక యితిహాస పరిశోధనశాఖ యవసరము"** (నిజాము రాష్ట్రము నందలి ఆంధ్రులు- పేజి: 204) నిజాం రాష్ట్రంలో నిక్షిప్తమై వున్న సాహిత్య సంపదను, చారిత్రక వైభవాన్ని వెలికితీసి తెలుగు సాహిత్య చరిత్రను ఆంధ్రుల చరిత్రను సుసంపన్నం చేయాలని ఎంతగానో పరిశ్రమించి, పరితపించిన పరిశోధక శిఖామణి దూపాటి వేంకట రమణాచార్యుల (1892-1963) వారి నోటి నుంచి ఆర్తితో వెలువడ్డ మాటలివి. ఇప్పటివా ఈ మాటలు? కాదు, కాదు సుమారు నూరేళ్ల నాటివి సుమా! నిజాం పాలనలో ముడుచుకు పోయిన శతపత్ర సుందరి, నేడు తెలంగాణ రూపంలో సహస్రపత్ర శోభతో అలరారుతున్నదిగా మరి.

దూపాటి శేషాచార్యులు (1890-1940) దూపాటి వేంకట రమణాచార్యులు (1892-1963) శతావధానులైన కొప్పరపు సోదరకవులచే శేషాద్రి రమణ కవులుగా ఆశీర్వదింపబడి, మహా పండిత పరిశోధకులైన జయంతి రామయ్యపంతులు గారిచే ప్రాచీనాంధ్ర కావ్యనాటకా దుల తాళపత్ర ప్రతుల్ని, శాసనాల ప్రతి లిపుల్ని సేకరించుకు రమ్మని నిజాం రాష్ట్రానికి పంపబడటం, ఆ అపూర్వ సహోదరులిద్దరు తెలంగాణ సాహిత్య, చరిత్రలకే సమర్పించ బడటం మనం మరువకూడని మహాపర్వమే కదా! అశ్వినీ దేవతలుగా భావింపబడి, సంభావింపబడే శేషాద్రిరమణ కవుల పరిశోధన వ్యాసాల సమాహారమే ఈ గ్రంథం.


**"శేషాద్రిరమణ కవుల పరిశోధన వ్యాస మంజరి"** (2017) ప్రధాన సంపాదకులు డా. సి. నారాయణరెడ్డి గారైతే. సంపాదకులు డా. జె. చెన్నయ్యగారు. ఈ పుస్తకంలో శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసాలు 32 కూర్చబడ్డాయి. అనుబంధంలోని 34 పేజీల సుదీర్ఘమైన వాఙ్మయ సూచిక పై మహనీయుల విస్తృత సాహిత్య రచనా వ్యాసంగాన్ని, పరిశోధనా వ్యాస రచనా ప్రతిభను తెలియ చేస్తుంది. ఈ సూచిక ఆధారంగా శేషాద్రి రమణ కవుల వ్యాసాలు మరికొన్ని సంపుటాలుగా తెలంగాణ సారస్వత పరిషత్తు త్వరలో ప్రచురించగలదని ఆశిద్దాం.

శేషాద్రి రమణ కవుల చారిత్రక పరిశోధనలో కాకతీయ సామ్రాజ్య చరిత్రకు, తెలంగాణ సాహిత్య గరిమ- ఆవిర్భావ వికాసాల చరిత్రలకు అగ్రస్థానం లభించింది. పరిశోధకులు 1921 ఏప్రిల్ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో ప్రచురించిన 'కాకతీయ సామ్రాజ్యము' రచనలో శాసనాలకు, సాహిత్య కృతులకు ఇచ్చిన ప్రాధాన్యం, కైఫియత్తుల కియ్యక పోవడం గమనించాల్సిన సంగతి. యవన సైన్యం ఓరుగల్లుపై ఆరుసార్లు దండయాత్ర చేసిందన్న కవిలె కట్టల సాక్ష్యానికంటే, నాలుగు తూర్లు మాత్రమే దాడి జరిగిందన్న చారిత్రకాధారాలకు వ్యాసకర్తలకు ప్రాముఖ్య మిచ్చారు. రచయితలు 'కాకతీయ వంశములు' వ్యాసంలో విశాలాంధ్ర దేశంలోని జమీందారీ సంస్థానాధిపతుల పూర్వీకులు చాలావరకు కాకతీయరాజుల్ని సేవించిన అధికారుల వంశీకులే అన్న సత్యాన్ని చెప్పడం నిశితమైన పరిశీలనకు దృష్టాంతం.


ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

(పేజి: 24) కాకతీయ పాలకుల్లో తొలితరం రాజులు జైన మత పోషకులైతే, మలితరం వారు శైవమతావలంబకులై. ఆ మతాభివృద్ధికి పాటుపడ్డారని వ్యాసకర్తలు సోదాహరణంగా చెప్పారు. శాసన శాస్త్ర ప్రవీణులైన దూపాటి సోదరులు రుద్రదేవుని సంపూర్ణ విజయాన్ని చాటే రామేశ్వర దీక్షితులు రాసిన అనుమకొండ శాసనంతో తెలుగులిపి నూతన వికాసానికి శ్రీకారం చుట్టబడిందని చెప్పడం విశేషము. (పేజి: 40) రుద్రదేవుడు, గణపతి దేవుడు జైనమత విధ్వంసానికి, శైవమత ప్రాబల్యానికి కృషి చేశారన్నారు. గణపతిదేవ చక్రవర్తి పాలనా విశేషాల్ని అనేక విధాలుగా ప్రశంసించారీ పండితులు. తాము సేకరించిన శాసనా లాధారంగా కాకతీయ పాలకుల చరిత్రను తవ్వి తీశారీ పరిశోధకులు.

'కాకతి ప్రోలరాజు చరిత్రము' వ్యాసం పేర్కొనదగింది. ప్రోలరాజు అనుమకొండ శాసనంలో జినేంద్రస్తుతి చేసినా, అతడు జైనుడని చెప్పిన చరిత్ర కారుల మాటను పరాస్తం చేసి, ప్రోలరాజు శైవమతావలంబు డని నిరూపించారు దూపాటివారు. కరీం నగరం, పరకాల సహాయంతో రాజులు శైవులై వుండి, మంత్రులు సేనాపతులు జైనులై శాసనాల్లో మత సామరస్యాన్ని ప్రకటించారని ఘోషించారు దూపాటివారు (పేజి: 56)




రమణాచార్యులు రాసిన వ్యాసం – **"కాకతీయుల చరిత్రము– విశేషాంశములు."** ఈ పరిశోధకులు శాసనాలు పరిశీలించి రుద్రదేవుని వరకు కాకతీయరాజుల వంశవృక్షాన్ని నూతనంగా అందించారు. (పేజి: 69) ఆచార్య వర్యులు కాకతీయులు రెండవ బేతరాజు కాలం నుండి శైవులే అన్న నిష్కర్షకు రావడం, పరిశోధన వలన తేలిన అంశం కాకతీయుల చరిత్ర రచనలో ఇంకా కొన్ని అంశాలు తప్పక చేర్చాల్సి వుందని వేంకట రమణాచార్యుల వారు వ్యాసం చివర్లో సూచించారు. (పేజి: 73)

వ్యాసకర్త **'రుద్రమదేవి'** వ్యాసంలో తండ్రి గణపతి దేవుని వారసురాలిగా 1262 నుండి 1295 వరకు కాకతీయ సామ్రాజ్ఞిగా పాలనా బాధ్యత వహించిన వీరవనిత యని కీర్తించినారు.

'ప్రతాపరుద్రీయము' అలంకార శాస్త్ర గ్రంథం ఆధారంగా ప్రతాపరుద్రుని విజయాత్రల్ని చక్కగా మదింపు వేసినారు వ్యాసకర్త. రేచర్ల గోత్రియుడైన వెలమవీరుడు అనపోతనాయకుని వీరగాథ 'అనపోతనాయకుడు' వ్యాసంలో విస్తారంగా చెప్పబడింది.

కాకతి రుద్రదేవుడు వేయించిన అనుమకొండ శాసనములో తన తండ్రి ప్రోలరాజు శౌర్య పరాక్రమాలు వివరింపబడ్డాయి. ఖాజీపేట కన్నడ శాసనంలో ప్రోలరాజు నలుగురు శత్రువులతో పోరాడిన వైనం చిత్రించబడింది. ప్రోలరాజు ప్రత్యర్థుల్లో ఒకడైన గోవిందరాజు కొండపల్లి పాలకుడని చిలుకూరి వీరభద్రరావు గారు చెప్తే, శేషాద్రి రమణ కవులు అతను కంబము మెట్టు దగ్గరున్న నేలకొండపల్లి రాజని సవరించారు. ప్రోలరాజు మరొక విరోధి గుండరాజు నూజివీడు సమీపంలోని మంతెన అనడం పొరపాటని, నిజాము రాష్ట్రములో గోదావరి నది వద్దగల మంతెన అని దూపాటి పరిశోధకులు చెప్పారు. (పేజి :130–131) ప్రోలరాజు ప్రతిపక్షుడైన జగద్దేవుడు ఆంధ్రచరిత్రకారులు చెప్పినట్లుగా మైసూరు ప్రాంతం వాడు కాదని, ఆ కాలంలో కాకతీయరాజ్యం కర్నాటక వరకు వ్యాపించలేదని, అతను పశ్చిమ చాళుక్య రాజప్రతినిధిగా ధర్మపురి వేములవాడ ప్రాంతాన్ని పరిపాలించాడని పరిశోధక ద్వయం అభిప్రాయం.

చరిత్ర ప్రసిద్ధుడైన వేములవాడ భీమకవి జన్మ, నివాసస్థానాల గురించి ఎక్కువగా వాదవివాదాలు జరిగాయి. నిజాం రాష్ట్రంలోని వేములవాడలో ప్రఖ్యాతి వహించిన భీమేశ్వరుని దేవాలయం వున్నందువల్ల శేషాద్రి రమణ కవులీ వాదాన్నే బలపరిచారు – **'భీమకవి నివాసస్థానము'** అనే వ్యాసంలో.

పద్మపురాణము, శివధర్మోత్తర ఖండవము, షట్చక్రవర్తి చరిత్ర కావ్యాల రచయిత కామినేని మల్లారెడ్డి రెడ్డికవుల్లో మొట్ట మొదటివాడని శేషాద్రి రమణ కవులు **'కామినేని మల్లారెడ్డి'** వ్యాసంలో నిరూపించారు. ఈ కవీంద్రుని నివాసస్థలం బిక్కవోలు గోదావరి జిల్లాల్లోనిది కాక నిజాం ప్రాంతం లోనిదని వక్కాణించారు పరిశోధక వర్యులు.

**'చంద్రికాపరిణయము'** కావ్యకర్త సురభి మాధవ రాయకవి 16వ శతాబ్ది ఉత్తరార్థం వాడని శేషాద్రి రమణ కవుల అభిమతం. మాధవ రాయకవి రామరాజ భూషణుని 'వసుచరిత్రము' లోని రమణీయ భావాల్ని, శైలిని అనుకరించాడని వారి అభిప్రాయం.

**"ఈ చంద్రికా పరిణయము సరసముగను శ్రావ్యముగను నున్నది. ఆంధ్ర గ్రంథరాజములలోనిది యొకటి. ఇది వసుచరిత్రము తరగతిలో జేరినదగుటచే గథాంశము విమర్శించు పట్ల నుభయ గ్రంథములను జర్చించు టావశ్యకమగును."** (పేజి: 180) అన్న వ్యాసకర్తల మాట పరిశీలనార్హం. ఈ ఉభయ కావ్యాల తులనాత్మక పరిశీలన లోతుగా జరుగవలసి వుంది.

శేషాద్రి రమణ కవులు ఈ రెండు కావ్యాల్ని తులనాత్మకంగా – సంక్షిప్తంగానైనా సరే సమర్థవంతగా చేయడం ప్రశంసనీయం. (పేజి :175–180) శేషాద్రి రమణ కవులు జన్మతః ఆంధ్రులైనా, కర్మతః తెలంగాణీయులే. అన్నదమ్ములిద్దరూ తెలుగు సాహిత్య, చరిత్రల రచనా వ్యాసంగానికి తమ జీవిత సర్వస్వాన్ని ముదుపు కట్టిన వారే.

సమగ్ర తెలుగు సాహిత్య చరిత్రనూ, ఆంధ్రదేశ చరిత్రనూ రూపొందించాలంటే నిజాము రాష్ట్రంలో వర్ధిల్లిన తెలుగు సాహిత్యాన్నీ, చారిత్రక ఘట్టాల్నీ గుది గుచ్చాలని ఘోషించిన విశాల హృదయులూ, చింతన శీలురూ ఈ అపూర్వసోదరులు. **"యాదవ, చాళుక్య, చోళ, రాష్ట్రకూట, కాకతీయాది పూర్వరాజన్నులు రాజధానిగా జేసికొని పరిపాలించిన యీ నిజాము రాష్ట్రమున సమగ్రమగు పరిశోధనము జరుగనంత వఱకు మన దేశ చరిత్రము లన్నియు నసమగ్రమము లనక తప్పదు."** (పేజి: 181) వ్యాసకర్తలు మల్లికార్జున పండితారాధ్యుల వారిని నిజాము రాష్ట్ర ప్రథమాంధ్ర


కవి అనీ. అతని 'శివతత్త్వసారము' లభించినంతలో నిజాం రాష్ట్ర ప్రథమాంధ్ర గ్రంథమని వొత్తి చెప్పారు. (పేజి: 183) నిజాం రాష్ట్రంలో జన్మించిన ఎంతోమంది కవి పండితుల రచనల్ని వెలికి తీసి, వాటికి వెలకట్టిన గుణగ్రహణ పారీణులీ దూపాటి సోదరులు. దోమకొండ, వనపర్తి మొదలైన నిజాం రాష్ట్రంలోని సంస్థానాల కవి, పండితాగ్రణుల సేకరించిన సాహిత్య శ్రమజీవులు వీళ్ళు. నిజాం రాష్ట్రంలో వర్ధిల్లిన తెలుగు సాహిత్య సమృద్ధి సంపదలు సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రకు గొప్పగా దోహదం చేస్తాయని చెప్పారు. వీరి మాటల్లో – **"నిజాం రాష్ట్ర ఆంధ్రకవి కవి జీవితము సమగ్ర పరిశోధనముతో బయలు వెడలినచో ఆంధ్ర కవి జీవిత సంశయ గ్రంథులు విడిపోవుటయే గాక, నిజాము రాష్ట్రాంధ్ర దేశము యావదాంధ్ర దేశమునకు శిరః ప్రాయమను నంశ మా బాలవేద్యము కాగలదు."** (పేజి: 190. 'నిజాము రాష్ట్రంధ్రకవులు' అనువ్యాసం)

**'శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి'** గ్రంథంలోని **'నిజాము రాష్ట్రము– వాఙ్మయ చరిత్రము–1,2'** వ్యాసాలు తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్రకు వెలుగు నిచ్చే రచనలు. ఈ కవి, పండిత మహోదయులు పానగల్లు, నేలకొండ పల్లె, రామగిరి దుర్గం మొదలైన ప్రాచీన గ్రామాల పుట్టు పూర్వోత్తరాల్ని తవ్వి తీసి, జైన, బౌద్ధ కళా సంపద ప్రకటించారు. రామప్ప గుడుల యశోగాథను చాటి చెప్పారు.

ఈ గ్రంథంలోని చివరి మూడు వ్యాసాలు– శ్రీకృష్ణ దేవరాయల విజయయాత్ర, తెనాలి రామకృష్ణ కవి, గుప్త సామ్రాజ్యము– ఎలాంటి విశేషాలు లేని తీరా సామాన్యమైన వ్యాసాలు. వీటికి బదులు– నిజాము రాష్ట్రమందలి జైనాలయములు, బాలనాగమ్మ, రంగనాథ రామాయణము, శాసనములు– ఆంధ్ర కవిత్వము, అముద్రిత ద్విపద కావ్యములు ఇత్యాది వ్యాసాల నుంచి రచనల్ని ప్రచురించి వుంటే సముచితంగా వుండేది. వివరాలకు పుస్తకం చివర్లో వున్న శేషాద్రి రమణ కవుల వాఙ్మయ సూచిక (పేజి: 312–346) చూడండి.

**'శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి'** – ఈ పండిత, పరిశోధకులు తెలంగాణ చరిత్ర, సాహిత్య చరిత్రలోని ఎన్నో చీకటి కోణాలపై వెలుగు ప్రసరింప చేసిన వ్యాస సంపుటి. ఈ జ్ఞాన నిధుల అమూల్య వ్యాసాల సంపుటాలు మరికొన్ని వెలువరిస్తే తెలంగాణ సారస్వత పరిషత్తు సత్సంకల్పం సాకారమై తలపోలం ముట్ట గలదు.

(ఈ విలువైన పుస్తకాన్ని నాకు ప్రేమతో పంపిన మిత్రులు డా. అమ్మంగి వేణుగోపాల్ గారికి కృతజ్ఞతలు)



# జీవన సాఫల్యత ...!

కష్టసుఖములున్న కదుహాయికల్గును
కష్టమొకటి వున్న కఠిన జీవిక
సుఖములున్నయెడల సుఖరోగములెన్నొ
తెలిసిమసలుకొనుము తెలివిమీర!

సంఘమందుయెన్ని సంఘటనలున్నను
మానవతయె మనకు మార్గదర్శి
చింతలెన్ని వున్న చెదరని నవ్వుల
మమతపంచ వలను మాటతోడ!

పనికిభయమువద్దు పాట్లెన్నివున్నను
నిబ్బరంగ నుండు నియతి కల్గి
కాపురంబుకొరకు కడదాకపోరాడు
విజయమొందగలవు వేగిరంబు!

జీవితానవచ్చు చీకటివెలుగులు
ఎల్ల కాలమందు యెదురు కావు
వచ్చిపోయెవాట్కి వగచుటయెందుకు?
గుండె బలముతోడ కోరినిల్చు!

తలకుమించుపనులు తలనొప్పికల్గించు
తేలికైన మనసుతోడ తేల్చుకొనుము
మదియుహాయినొంది మచ్చికగును
సంతసంబు కల్గి సాగుముందు!

మంచికన్నమిన్న మహిలోనలేదులే
వంచనాదులేను వనరు చెరపు
నిజముయెపుడునిల్చి నిర్భీతికల్గించు
భావిజీవితంబు బహుపసందు!

మాటజారవలదు మతిని తప్పియెపుడు
పేరుచెడునుచూడ పేర్మి తొలిగి
నోరుమంచిదైన నొవ్వరు యెవ్వరు
ఆచి తూచి పల్కహాయి కలుగు!

ఎన్ని బాధలున్న యెదురించిపోరాడి
కష్టసుఖములందు కలత లొదలి
జీవితంబునందు జీవించవలెనిల
అంతకన్నామిన్న హాయి ఏది?!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
ఫోన్ : 85558 99493

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2  UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2023

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్**
**జయావహం జపం నిత్యమక్షయం పరమం శివమ్"**

**సర్వ మఙ్గల మాఙ్గల్యం సర్వపాప ప్రణాశనమ్**
**చిన్తాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్॥**


రామా! ఈ ఆదిత్యహృదయం పుణ్యమైనది. శత్రువులందరినీ నాశనం చేస్తుంది. జయాన్ని కలిగిస్తుంది. జపింపదగినది. నిత్యమైనది. ఎన్నటికీ తరుగువోనిది. చింతవలన కలిగే శోకాన్ని రూపుమాపుతుంది. ఆయువును పెంపొందిస్తుంది. ఉత్తమమైనది.

శ్రీ అగస్త్యుల వారు ఏదో తాత్కాలికమైన ఓదార్పును రామచంద్రునకు కలిగించటానికి సాక్షాత్కరించలేదు. తత్కాల సమస్యకు పరిష్కారం చెప్పటం మాత్రమే ఆయన లక్ష్యం కాదు. తాను ఉపదేశింబోయేది సర్వ మానవజాతికీ ఆపత్సమయంలో ఆదుకొనే కామధేనువు వంటిది కావాలని ఆయన సంభావించారు. ఆ కారణంగా ముందుగా ఆదిత్యహృదయం మహిమ ఎటువంటిదో కొంచెం విస్తృతంగానే వక్కాణిస్తున్నారు. కాబట్టి మనం ఆ పదాల ఆంతర్యాన్ని గట్టిగా పట్టుకొని ప్రయత్నం చేయాలి.

**1. పుణ్యమ్ :** 'పుణతి శుభం కరోతీతి పుణ్యమ్' అని వ్యుత్పత్తి. ఆదిత్య హృదయం శుభాన్ని కూర్చే వాఙ్మయం. శుభమంటే శ్రేయస్సు. అది పరమార్థానికి సంబంధించిన విషయం. ఈ పదాన్ని ముందుగా నిక్షేపించడంలో గమనించవలసిన అంశం ఒకటి ఉంది. తన్ను మానవమాత్రుడుగా త్రికరణాలతో విశ్వసిస్తున్న శ్రీరామచంద్రుడు రావణుణ్ణి వధించడం పాపం అనుకుంటున్నాడు. చంపటం ఎలా, చంపకపోవటం ఎలా అనే ద్వైధీభావంతో సతమతమవుతున్నాడు. కాబట్టి అతనికి మొట్టమొదటగా తెలియజెప్పవలసినది – ఇది పాపం కాదయ్యా! ఒకవేళ నీవు పాపంగా భావిస్తే ఆదిత్యహృదయ స్మరణ వల్ల అది పుణ్యం అయిపోతుంది – అని. దీనిని ఉపలక్షణంగా తీసుకొని మానవుడు పుణ్యపాప నిర్ణయం చేసుకోలేని సందిగ్ధావస్థలో ఉన్నప్పుడు ఆదిత్యహృదయాన్ని జపించి పుణ్యసంభావన చేసుకోవచ్చు

మరొక్క విషయం కూడా ఇక్కడ అనుకోవాలి. ఏ పని అయినా నిష్కారణంగా ఎలా పుణ్యమైపోతుంది? అన్న ప్రశ్న ఇక్కడ ఉదయించే అవకాశం ఉన్నది. ఆదిత్యహృదయంలో ప్రతిపాదనకు వస్తున్నది పరమాత్మ తత్త్వం కనుక దానికి పాపాన్ని కూడా పుణ్యంగా రూపొందించే సత్తా ఉంటుంది. (సశేషం) (ఆచార్య శలాక రఘునాథ శర్మగారి **ఆదిత్య హృదయ హృదయం** నుండి)

## సత్సంగం




### దేహమే జాడ్యం

"అసలు శరీరమే రోగం", అనేవారు శ్రీ భగవాన్. రోగం మనిషికి సహజస్థితి కాదు. ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఎవ్వరూ రోగాన్ని కోరుకోరు. అస్వస్థతగా ఉన్నప్పుడు స్వస్థత చేకూరాలని మందులని వెతుక్కుంటాం. అస్వస్థత మన సహజస్థితి కాకపోవటమే దీనికి కారణం. రోగమంటే శరీరంలో సమత పోవటమన్నమాట. ఆ సమత మళ్ళీ నెలకొంటే జబ్బు నయమవుతుంది. శ్రీ భగవాన్ శరీరమే జాడ్యం అంటారు. జబ్బు నయమైతే మన సహజ సంతోషస్థితిని అందుకొంటాం.

సుషుప్తిలో మనమెంతో సంతోషంగా ఉంటాం. అప్పుడు శరీర ధ్యాసే ఉండదు. నిద్ర నుండి మేల్కొనగానే శరీర ధ్యాస కలుగుతుంది. సుషుప్తిలో మళ్ళీ మాయమవుతుంది. అంటే, వ్యక్తిగత అహంభావ మున్నప్పుడే శరీరం గుర్తుంటుంది. ఆ అహంభావం పోతే శరీర ధ్యాసాపోతుంది.

అందువల్లనే శరీరధ్యాస ఒక జాడ్యం. ఎంతో తీవ్రమైన జబ్బుతో ఉన్నా సరే, గాఢనిద్రలో మనిషి బాధ నెరుగడు. దానికి కారణం శరీరబాధని గుర్తించే మనస్సు లేకపోవటం. శరీర ధ్యాసా, మనస్సూ, ప్రపంచమూ అన్నీ ఒక్కసారిగా మాయమవుతాయి. మనస్సు ఆత్మలో లీనమై పోయినప్పుడు పరిపూర్ణానుభూతే ఉంటుంది. శరీరం గురించి ఎరుక ఉండదు.



జ్ఞానికి దేహముంటుంది గాని దేహాత్మ బుద్ధి ఉండదు. పరిధిలేని కేంద్రబిందువు వంటి వాడతడు. శరీరమే మనము అనుకోవటమే మన అసంతుష్టికి కారణం. ఈ తాదాత్మ్యమే అసలు రోగం. అది అహంకారం లేనప్పుడే నయమవుతుంది. ఈ జబ్బుని తుడిచి పెట్టి వేసేది ఆత్మవిచారమే.

శరీర ధ్యాస పోయినప్పుడు శరీరంగాని, దానికి గల రుగ్మత గాని అహంభావ రహితునికి పట్టదు. శ్రీ భగవాన్ జీవితం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. తనకి వచ్చిన కాన్సర్‌ని తానే నయం చేసుకోవాలని ఆయనకి సూచించినప్పుడు వారు, "ఏమి టీ కోరిక. మీరంతా నాకొక దేహముందనీ, చేతులున్నాయనీ, అందులో ఒక చేయిమీద వ్రణం లేచిందనీ అంటూంటే నేను విని, "కాబోలు," ననుకుంటాను. లేకపోతే, నాకే అనుభూతీ లేనేలేదు. మీరంతా ఇక్కడికి వచ్చినట్టే ఆ పుండూ వచ్చింది. దీనిలో నాకేమీ తేడా కనబడటం లేదు. ఈ రోగాన్ని నయం చేసుకోవాలన్న కోరిక ఎవరికోసం నాకు కలగాలి?" అన్నారు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 31 హైదరాబాద్ డిసెంబర్ : 2023

# పరిశోధక వరేణ్యులు "వైద్యం వేంకటేశ్వరాచార్యులు"

**బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం - 2023 అందుకోబోతున్న సందర్భంగా (డిసెంబర్ 10),**

**మూసీ ముచ్చట ... డా. అట్టెం దత్తయ్య.. ఫోన్ : 9494715445**

**ప్రతి పని వెనక ఒక ఫలితాన్ని ఆశిస్తారు అధిక శాతం మానవులు. ఒక వయసు తరువాత ఆ ఫలితం అవసరం కూడా అనవసరంగా మారగానే చేయడం ఆపేస్తారు. కాని కొందరు ఎలాంటి ఫలితాన్ని, వయసును లెక్కచేయకుండా చేస్తూనే ఉంటారు. అట్లాంటి వారిని చూసినపుడు కొన్ని పనులు చేయడం కోసమే వారు పుడుతారేమో అనిపిస్తుంది. అలాంటి మహానుభావుల ద్వారానే కొన్ని పనులు పూర్తవుతాయి. అట్లాంటి అరుదైన పరిశోధకులలో శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు ఒకరు. ఆయనను తలచుకుంటూ, ఆయన పనిని తలపింపచేసే పరిశోధకుని సన్మానించుకోవడానికై ప్రతి సంవత్సరం వెతుకుతూనే ఉంటాం. ఈ సంవత్సరానికి అర్హులుగా ఎంపిక చేయబడిన వ్యక్తి డా. వైద్యం వేంకటేశ్వరాచార్యులు. డిసెంబర్ 10, 2023న అందుకోబోతున్న 'శ్రీ బి.ఎన్.శాస్త్రి'పురస్కార గ్రహీతతో మూసీ ముచ్చట....**



**1. బి.ఎన్.శాస్త్రి అవార్డుకు ఎంపిక అయినందుకు ముందుగా మీకు శుభాకాంక్షలు. శాస్త్రిగారితో మీకున్న అనుబంధం గురించి కొన్ని మాటలు చెప్తారా...?**

ఆత్మీయులు కీ.శే. శ్రీ బి.ఎన్.శాస్త్రిగారికి వందనమందారాలు.

మూసీ మాసపత్రికకు సంబంధించిన కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తున్న సహృదయులందరికీ ధన్యవాద ప్రసూనాలు.

శ్రీ.బి.ఎన్.శాస్త్రిగారితో నాకు 1981 నుండి పరిచయం. నేను ఎక్కడో మూసీ పత్రికలో వారి ఫోన్.నెం. చూసి వారికి నేను కర్నూలు నుండి ఫోన్ చేసినాను. వారు చాలా సంతోషపడ్డారు. **"మీ పేరు విన్నానండీ! అయితే మీతో సంభాషించే అవకాశం కలుగలేదు. మీరు కూడా తప్పక మూసీ పత్రికకు వ్యాసాలు పంపండి"** అన్నారు. **'ఆత్మకూరు సంస్థానాన్ని గురించి మీకు తెలిసే ఉంటుంది. ఆ సంస్థానాన్ని గురించి ఎవరూ ఎక్కడా రాయలేదనే చెప్పాలి. (సురవరం వారు గోలకొండ కవుల సంచికలో తప్ప) మీరు ఆ సంస్థానంలోని కురుమూర్తిలో పుట్టినారు. కనుక మీరు ఆత్మకూరు సంస్థానాన్ని గురించి వ్యాసాన్ని రాసి పంపండి. మూసీలో తప్పక ప్రచురిస్తాను'** అన్నారు. జూన్ 1981లో. పై విషయాలను మేము (ల్యాండ్) ఫోన్‌లో మాట్లాడి నాము. జులై 1981లో 'ఆత్మకూరు సంస్థానం సాహిత్యపోషణం' అనే పెద్ద వ్యాసం రాసి పంపినాను. వారు ఫోన్‌చేసి చాలా సంతోషాన్ని వ్యక్తం చేసినారు. ఆగస్టు 1981 ఆ వ్యాసం మూసీలో ప్రారంభించి పదమూడు నెలలు సీరియల్‌గా ప్రచురించినారు. 81లో ఆ వ్యాసంతో పాటు నేను సేకరించిన అముద్రి చాటు పద్య రత్నాలు కూడా మూసీకి పంపినాను. వారు ఎంతగానో సంతోషించడమే గాక 'మీరు హైదరాబాదు వస్తే మా ఇంటికి రండి' అన్నారు. నాకు ఎంతో ఆనందం కలిగింది. వారు అపుడప్పుడు 3,4 పర్యాయాలు నాకు కర్నూలు చిరునామాకు ఉత్తరాలు కూడా రాసినారు. నేను ఒక పర్యాయం 1982లో ప్ర ప్రథమంగా వారి ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా కలిసినాను. **'నా కన్నా వయసులో చాలా చిన్నవారే !'** అన్నారు. ఔను దాదాపు 15 ఏండ్లు చిన్నవాణ్ణే అన్నాను. మేము కలిసినది శుభ సమయం కాబట్టే మా స్నేహానుబంధం దాదాపు రెండు దశాబ్దాలు గడిచింది. ఆ తర్వాత వారు పరమపదించి నారు. శాస్త్రిగారికి నచ్చిన మెచ్చిన వ్యక్తిని కావటం నాకు చాలా సంతోషంగా కలిగించింది.

**1. మీ బాల్య విశేషాలు, విద్యాభ్యాసం గురించి మాతో పంచుకుంటారా?**

నా బాల్యం కురుమూర్తి (చిన్నచింతకుంట మండలం, పాలమూరు జిల్లా) గ్రామంలోనే జరిగింది. చిన్నప్పుడు పల్లెలలో బాల బాలికలు ఆడుకునే ఆటల్లో తప్పక పాల్గొనేవాడిని. ఆ ఆటలకు పేర్లు కూడా చాలాబాగుండేవి. హైస్కూలు చేరిన తర్వాత క్రీడలలో మార్పు వచ్చింది. నా హైస్కూలు స్టడీ ఉలిందకొండ (కర్నూలుజిల్లా). అక్కడ కబడ్డీ, బ్యాట్‌మెంట్, కొక్కో మొదలైనవి ఆడేవాణ్ణి. గద్వాల మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ కళాశాలలో కూడా బ్యాట్‌మెంట్, కబడీ ఆడేవాడిని.

ఇక ఐదవ తరగతి వరకు మా నాన్నగారి బోధననే. స్కూల్లో చదవలేదు. ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణుడినై ఆరవ తరగతిలో చేరినాను. 6 నుంచి 11 వరకు ఎస్.ఎస్.ఎల్.సి. (సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్) వరకు ఉలిందకొండలోనే చదివాను. మా నాన్నగారు కూడా ఉపాధ్యాయుడు, ఆయన ఉలిందకొండలో ఉద్యోగం చేసినారు. అందువల్ల నేనూ అక్కడే హైస్కూల్

విద్య పూర్తిచేసినాను.

కళాశాల విద్య ఎం.ఎ.ఎల్.డి కళాశాల (మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల)లో గద్వాలలో చదివాను. పి.యు.సి. డిగ్రీ.

ఆ తరువాత దూరవిద్య ద్వారా ఆంధ్రయూనివర్సిటీ (విశాఖపట్నం) లో పి.జి. పూర్తిచేసినాను.

**2. మీ ఉద్యోగ జీవిత విశేషాలు ...**

కళాశాల విద్య పూర్తికాగానే అంటే డిగ్రీ పూర్తికాగానే నాకు కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో స్టోర్స్ ఇంఛార్జ్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చిందని చేరినాను. కనుకనే విశ్వవిద్యాలయ విద్య, దూర విద్యద్వారా అభ్యసించవలవలసి వచ్చింది.

సిల్వర్ జూబిలీ ప్రభుత్వ కళాశాల కర్నూలు నుండి నంద్యాల డిగ్రీ కళాశాలకు ఆ తర్వాత, చివరి దశలో బనగానిపల్లె డిగ్రీ కళాశాలకు ప్రమోషన్ మీద బదిలీ అయింది. ప్రైవేట్ కళాశాలలో కూడా తెలుగును బోధించేందుకు వెళ్లేవాడిని.

విధి నిర్వహణ సరిగా చేసేవాడిని. సమయపాలనగా నిర్వహించడం అలవాటైంది. అది ధర్మం కూడా.

**3. సత్కారాలు దాదాపు ఏబది సంవత్సరాల నుంచి నేటిదాక వందలలో జరిగినాయి కదా! వాటి గూర్చి రెండు మాటలు...**

ఒక పర్యాయం ఆం.ప్ర.గవర్నర్ (కుమర్‌బెన్‌జోషి) గారితో సత్కారం పొందాను. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డి గారితో కర్నూల్లో సత్కారం పొదినాను. ఇవన్నీ కూడా సాహిత్య సంబంధంగానే. నేను ఏ సత్కారానికి కూడా ప్రయత్నం చేయలేదు. మిత్రులు పెద్దవారు నా సాహిత్యా సమారాధనకు సంతసించి చేయించినవి, చేసినవి మాత్రమే. కొంత ధనం అందించి (వెయ్యి మంది ఐదువేల వరకు) అనేకం సాహిత్య పురస్కారాలు జరిగినవి. తెలంగాణా సారస్వత పరిషత్ వారు, తదితర విశ్వవిద్యాలయాల వారు తాటిమాను నారాయణ రెడ్డిగారి సాహిత్య పురస్కారం, సర్వవైదిక సంస్థాన్, కరీణ్ణగరం వారు, అనంత ఛందస్సారము సంస్థ విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోను; రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు వారు; తెలుగు సంస్కృత అకాడమీ ఆంధ్రప్రదేశ్ వారు శ్రీమతి నారపరాజు రాఘవనీత స్మారక పురస్కారం; తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్‌వారు; తి.తి.దేవస్థానం వారు అనేక సాహితీ సంస్థలు మొదలైనవవి దాదాపు 25 పురస్కారాలు (ధనబహూకరణంతో) చేసినారు. విస్తరభీతిచే వివరాలలోకి వెళ్లడం లేదు. అందరూ ఇచ్చిన జ్ఞాపికలు కూడా భద్రంగా ఉన్నాయి. ఆజాదీకా అమృత్ మహోత్సవం మరియు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి సందర్భంగా సాహిత్య ప్రతిభ పురస్కారం కర్నూలులో జరిగింది.

**2. ఈ వయసులో కూడా నిరంతరం ఇంతా సాహిత్య సేవ చేస్తున్న మీకు ప్రేరణ ఎవరు?**

నాకు వేరే వ్యాపకాలమీద విద్యార్థిదశ నుంచి కూడా ఇష్టంలేదు. ఉద్యోగం చేస్తున్నప్పుడు కూడా రోజు ఐదారు గంటలు ఉద్యోగం చేస్తే, పదిగంటలు సాహిత్య అధ్యయనం, పద్య - వ్యాస రచనలు చేయటానికి ఉపయోగించేవాడిని. నా జనన కుండలి ప్రకారం ప్రస్తుతం నా వయస్సు 75 సం॥రాలు నడుస్తున్నాయి. ఈ వయసులో కూడా నేను రోజుకు దాదాపు పదునాలుగు (14) గంటలు సాహిత్యం, పరిశోధన, సాహిత్య విమర్శలు, రచన మొదలైన పనులలోనే సమయం వెచ్చిస్తుంటాను. ఎక్కడైనా బయటకో, ఊరికో వెళ్లితే కూడా అది సాహిత్య పరంగానే ఉంటుంది. మక్కువ ఎక్కువగా ఉండి పని చేస్తే ఎవరికైనా అలసట రాదు, చికాకు అంతకన్నా మొదలే రాదు. నిత్య సాహిత్య విద్యార్థిగా /కృషీవలునిగా ఉండడం వల్లనే నా రచనలు నూట ఎనిమిదికి పైగా ఉన్నాయి. వాటిలో 74 గ్రంథాలు ప్రచురితం. మిగతావి అక్షర సంయోజనం కూడా జరిగినవి. ఆర్థిక వనరులు సమకూరినపుడు అవి కూడా ప్రచురితం అవుతాయి. అయితే నా సాహిత్య వ్యాసంగంలో వ్యాపార దృక్పథం లేదు. అందుకనే నా ఆరోగ్యం నిలకడగా ఉంది. ఏమీ ఇబ్బంది లేదు. వ్యాపార దృక్పథం ఉంటే ధనకాంక్ష అధికమౌతుంది. ఆలోచనలు మరీ అధికమౌతాయి. అనారోగ్యానికి అవన్నీ కారణభూతాలవుతాయి. మా నాయనగారే నా సాహిత్య వ్యాసంగానికి కారణం, ప్రేరణం; పితృదేవో నమః.

**3. నిర్విరామ మీ కృషివల్ల సమాజానికి, సాహిత్యానికి మీరు అందించిన ప్రయోజనం ఏమిటి ? అని అడిగేవాళ్ళకు మీ సమాధానం...**


అనేకులు.. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు నా రచనలను ఆకర గ్రంథాలుగా, ఆధార గ్రంథాలుగా చదువుకుంటున్నారు, ఉపయోగించు కుంటున్నారు. ముఖ్యంగా కురుమూర్తి క్షేత్ర చరిత్రము, కర్నూలు జిల్లా కవితరంగిణి (400 పూర్వ కవుల లఘు చరిత్ర) వ్యాస వైజయింతిక నాలుగు భాగాలు, ఇవి అనేక సిద్ధాంత గ్రంథకర్తలకు ఉపయుక్తాలు కావటం నా అదృష్టం. ఇవే గాక నా రచనలతో అధికశాతం ఏదో ఒక తెలుగు సాహిత్య చరిత్ర సిద్ధాంత గ్రంథాలలో రెఫరెన్సుగా ఉపయోగపడుతూనే ఉన్నాయి. చరిత్ర / సాహిత్యం అంతరించి పోకుండ అనుకోకుండా నా వంతు బాధ్యతగా నేను అక్షరబద్ధం చేస్తూనే ఉన్నాను. అది నిరంతరం తత్సంబంధిత జిజ్ఞాసువులకు ప్రయోజనం చేకూరుస్తూనే ఉంటుంది.

**4. మీరు పరిష్కరించి ప్రచురించిన శతకాలు ఎన్ని వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలు గురించి వివరిస్తారా..?**

నేను పరిష్కరించిన శతకాలు 14. వాటిలో తాళపత్రాలలోని, కాగిత లిఖిత ప్రతులలోనివి. అవి ఇతః పూర్వం అప్రచురితాలు. నా ప్రచురితాలలో సంబంధిత విశేష విషయాలతో పీఠిక తప్పక ఉంటుంది. కనుమరుగైపోతున్న పూర్వకవుల అముద్రిత శతకాలను

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2023

ప్రచురించటం వల్ల వర్తమానకాలంలో వాటిని ఎందరో చదవటం నేను ప్రత్యక్షంగా ఎరుగుదును. కురుమూర్తి లాంటి కొన్ని గ్రామాలలో భజన మండళ్లలో భజనపరుల నాల్కలపై నా ప్రచురిత పూర్వీకుల పద్యవాణి నాట్యం చేయటం నేను ప్రత్యక్షంగా చూసినాను / విన్నాను. దీనివల్ల పదునాలుగు శతకాలు ప్రాచుర్యం పొంది పునరుజ్జీవించినా వనటంలో సందేహం లేదు.




నేను రచించిన (స్వీయ) శతకాలు 12. నా పరిష్కృత స్వీయ శతకాలు మొత్తం 14+12=26.

**5. మీరు రాసిన శతకాలలో మీకు బాగా నచ్చినవి, మంచిపేరు తెచ్చినవి ఏవి? ఎందుకు?**

అన్నీ నా శతక కృతికన్యలే. మీ బిడ్డలలో ఏ బిడ్డ బాగుందంటే చెప్పడం కష్టం. నా బిడ్డల మీద నాకు ప్రేమ ఉంటుంది. అయితే పాఠక వర్యులు నచ్చిన శతకాలు తెలుగుబాన శతకం, ఉన్నమాట శతకం, సుదర్శన చక్రరాజ శతకం, కురుమూర్తి వేంకటేశ (సీసపద్య) శతకం. సుదర్శన చక్రరాజ శతకం, రాష్ట్రేతర ప్రాంతాల్లో కూర ఉండే తెలుగువారు భక్తితో పారాయణం చేస్తుండడం నాకు తెలిసి సంతోష పడ్డాను. వెంకటేశ శతకం సీసపద్యాలలో చెప్పింది. అందులో భక్తి, క్షేత్ర సంబంధిత ఆచార వ్యవహారాలు, సాంఘిక వ్యవస్థ, మంచిని మంచిగా, చెడును చెడుగా ఘాటుగా విమర్శించడం కనిపిస్తుంది. ఇది నా చివరి శతకం. **ఉన్నమాట వైద్యమన్నమాట** అనే మకుటం గల శతకం. నా అనుభవం మీద ఆ మకుటంతో పద్యాలు రాస్తూనే ఉంటాను. అంటే ఆ శతకపద్య సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. తదుపరి శతాధిక పద్యాలయిన తర్వాత 2వ ఉన్నమాటగా వెలువరిస్తాను.





**3. మీ కృషిలో అత్యధికంగా కనిపించే మూడు రకాలైన...**


**1. కురుమూర్తి సంబంధిత సాహిత్యం,**

**2. వేంకటేశ్వర సంబంధిత సాహిత్యం,**

**3. సంస్థాన సంబంధిత సాహిత్యాల గురించి వివరిస్తారా...?**




తెలంగాణాలోని హైందవ పుణ్యక్షేత్రాలలో కురుమూర్తి క్షేత్రానికి ఉన్నంత సాహిత్యం, మరే క్షేత్రానికీ లేదు. ఆ సాహిత్యం చాటు పద్యాలు, సంకీర్తనలు, శతకాలు, యక్షగానాలు, ప్రబంధాలు, కావ్యాలు, లాలి ప్రహరులు, సుప్రభాతాదిక స్తోత్రజాలాలు, నాటకాలు ఇలా ఇంకా ఎంతో సాహిత్యం ఉంది. అంతసాహిత్యం ఉన్నా కూడా కేవలం సంస్థాన ప్రభువుల కాలంలో ఏబది శాతానికి పైగా ముద్రితమైనా కూడా మిగతాదంతా కూడా సాహిత్యాభిమానం కలిగినవారి ఇండ్లలో పురాతన గ్రంథాలలో లిఖితాక్షరాలలో జీవిస్తోంది. అలాంటి సాహిత్యాన్ని కూడా దాదాపు అధికశాతం నకలు చేసినాను, కొంతశాతం ముద్రించినాను. కురుమూర్తి క్షేత్ర శతకసాహిత్యం (12 శతకాలు) ఒక సంపుటంగా ప్రచురించినాను. శ్రీ కురుమూర్తి క్షేత్ర స్థలపురాణం ఉత్తర వేంకటాచల మాహత్మ్యం అనే పేరున బాలసరస్వతి శ్రీనివాసాచార్యుల వారి తండ్రి బుచ్చి వేంకటాచార్యులవారు లిఖించినారు. ఆ లిఖితప్రతి ఆత్మకూరులోని బుక్క పట్టణం వారి ఇంట, నాకు పితృతుల్యులైన కవితార్కిక సింహాచార్యులవారిని (బాల సరస్వతి వారి మనుమడు) అడిగి నకలు చేసి తదనంతర రచన ముద్రించినాను. (2005) శ్రీ కురుమూర్తి క్షేత్ర వార్షికోత్సవ విధానాన్ని కవిఘటాగండభేరుండ బిరుదాంచితులయిన శ్రీమాన్ హొసదుర్గల కృష్ణమాచార్యుల వారు తన 26వ ఏట ఐదు ఉల్లాసాలుగ ఆశువుగ చెప్పినారు. ఆ సంస్కృత ప్రబంధం పేరు శ్రీనివాసవిలాసః. ఇది క్రీ.శ. 1867లో మద్రాసులో ముద్రితం. సంస్కృత శ్రీనివాస విలాసాన్ని తదనంతర కాలాన క్రీ.శ.1897లో తిరుపతి వేంకటకవులు శ్రీనివాస విలాసం అనే పేరున ఐదు ఆశ్వాసాలుగ ఆంధ్రీకరించినారు. తిరుపతి వేంకట కవుల సాహిత్యం గురించి పరిశోధించి వారందరూ కూడా శ్రీనివాస విలాస ఆంధ్రీకరణ విధానాన్ని తెలుపలేక పోయినారు. కారణం తెలుగు శ్రీనివాస విలాసానికి మూలగ్రంథమైన హొసదుర్గం వారి శ్రీనివాస విలాసం (సంస్కృతం) వార్లకు లభించకపోవడం వల్లనే. 2023లో అంటే ఇటీవలనే సంస్కృతాంధ్ర శ్రీనివాస విలాసాలు రెండూ కలిపి విశేష పీఠికతో అనుబంధాలతో ఒకే పుస్తకంగా ప్రచురించినాను. (354 పుటలు 1/8 డెమ్మీ) ఇంకా కురుమూర్తి క్షేత్రం గురించిన వివిధ సాహిత్య ప్రక్రియల సంపుటాలు దాదాపు 11 వెలువరించవలసి ఉంది. తిరుపతి వేంకటనాథుడే కురుమూర్తి వేంకటపతిగా వెలసినాడు.



ఆ కురుపతి వేంకటపతి మా ఇలు వేలుపు. అందుకే నా పేరు వేంకట అని పెట్టినారు. కనుకనే వేంకటనాథుడంటే నాకు ఇలువేలుపేగాక ఇష్టదైవం కూడా.

ఇక సంస్థానాల సాహిత్యాన్ని గురించి అడిగినారు. 8వ ప్రశ్నకు చెప్పిన జవాబులోనే సంస్థానాల సాహిత్యాన్ని గురించి చెప్తాను.

**7. మీరు అందించిన వ్యాఖ్యానాల గురించి తెలియజేస్తారా..?**

1. భజయతి రాజ స్తోత్రానికి తెలుగు అనువాదం చేసి టీకా తాత్పర్యాలు రచించినాను. (2002 ముద్రితం)

2. తిరుమల బుక్కపట్టణం అణ్ణయాచార్యులవారు రచించిన చిత్రకవితా విలసితమైన చిత్రబంధమాలికకు వ్యాఖ్యానం, చిత్రాలు బంధాలకు వేసినాను, ప్రచురించినాను. (2014)

3. 18వ శతాబ్దపు బోరవెల్లి సంస్థానపు కవి అయిన ఆయలూరి కందళార్యులవారి అలంకార శిరోభూషణాంతర్గత చిత్రమ్ (బంధచిత్ర కవితా విలసితం) రచనకు వ్యాఖ్యానం. బంధచిత్రాలు రచించినాను. (2014ముద్రితం)

4. నన్నయకు పూర్వుడైన మల్లియ రేచన రచించిన కవిజనాశ్రయం ఛంధోగ్రంథానికి భావదీపిక వ్యాఖ్య రచించినాను. దానిని తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం, హైదరాబాదు (ఆచార్య ఏస్వీరామారావు గారి నిర్వహణలో) ప్రచురితం (2016)

5. బమ్మెర పోతనామాత్యులగారి శ్రీ మహాభాగవతానికి తి.తి.దే వారు సరళ వ్యాఖ్యను కొందరు పండితులతో రచింపజేసి 2017లో ప్రచురించినారు. అందులో అష్టమస్కంధం పీఠిక మరియు 392 పద్యం నుండి స్కంధాంతం 744 పద్యం వరకు సరళ వ్యాఖ్యాన రచన చేసినాడు. ఇందులో శ్రీపతి మోహినీ రూపంలో ఈశ్వరుని మోహింపజేయుట, వామనావతార చర్చ, మత్స్యావతార కథ ఉన్నాయి. వీటికి వ్యాఖ్య సంతరించినాను.

6. చౌడప్ప సీసములు – తొలి తెలుగు నిఘంటువు. ఈ గ్రంథానికి నుడి తెలివిడి (వ్యాఖ్య) అర్థ వివరణ విశేషాలు రచించినాను. (2021 ప్రచురితం)

7. కాణాదం పెద్దన కవివర్యులు, ముకుంద విలాసం రచించిన గద్వాల కవివర్యులు. ముకుందవిలాసానికి మానసోల్లాసం అనే వ్యాఖ్యను సంతరించినాను. త్వరలో ప్రచురితం కానుంది.

**8. మీ విద్య, ఉద్యోగజీవితం అంతా కర్నూలులోనే కదా! మహబూబ్ నగర్ (జిల్లా) మీద మీకు ఎందుకు అంత మమకారం?**

అమర చింతాత్మకూరులో పుట్టినవాడు పెద్దగయ్యాక అమెరికాలో ఉన్నా కూడా అమ్మ నేల (మాతృభూమి) మీద అనురాగం ఉండడం సహజం. నేను పుట్టింది కురుమూర్తి. ఉన్నత పాఠశాల విద్య ఉలింద కొండ (కర్నూలుజిల్లా), కళాశాల విద్య మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ గారి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్–గద్వాల. అమరచింతాత్మకూరు సంస్థానమన్నా, గద్వాల సంస్థానమన్నా నాకు అభిమానం ఎక్కువ. గద్వాల సంస్థానంలో చదువుకోవటమే గాక నా భార్య పుట్టిల్లు గద్వాల, నా కూతురు మెట్టినిల్లు గద్వాల. ఆత్మకూరు సంస్థానంవారు గద్వాల సంస్థానం వారు సంప్రదాయ సాహిత్యానికి సేవ చేస్తూ ప్రచురించిన గ్రంథాలన్నా నాకు మక్కువ ఎక్కువ. అలాగే వనపర్తి, కొల్లాపురం మొదలైన సంస్థాన ప్రాంతాలలో రక్తసంబంధీకులైన బంధువులు, మైత్రీబంధంగల వారు ఉన్నారు. కనుక ఆ సంస్థానాల సాహిత్యంమీద కూడ మక్కువ ఏర్పడింది. మొత్తం మీద పాతపాలమూరుజిల్లా సంస్థనాల సాహిత్యం దాదాపుగ మా పూర్వీకుల దగ్గర ఉండేది. దానిని శ్రద్ధగా మక్కువగా చదివినాను. అందువల్లనే జిల్లాలోని సంస్థానాలలోని అనేక గ్రామాలను కాలినడకన సైకిలుమీద మిత్రులతో కలిసి వెళ్ళి సందర్శించి స్థానిక చరిత్రలు, పూర్వ కవుల రచనా విశేషాలు తెలుసుకున్నాను. పాతపాలమూరుజిల్లా సంస్థానాల ఖిల్లా. సంస్థానాలు సాహిత్యానికి నిలయాలు. ఆనాడు సంస్థానాల ప్రాంతం తిరుగకుంటే నేడు ఆ సంస్థానాలలోని అనేక విశేషాలు తెలిపే వారు కూడా లేరనడం అతిశయోక్తి కాదు.

**9. మీ సాహిత్య ప్రస్థానంలో ప్రాంతీయ సంబంధిత సమస్యలు ఏమైనా ఎదుర్కొన్నారా?**

మానవుడు సంఘజీవి, సంచార జీవి. కనుక అక్కడి వారు ఇక్కడ ఇక్కడివారు అక్కడ సంచరించడం నివాసంగ ఉండడం సహజం. నాకైతే ఎలాటి సమస్యలు రాలేదు.

**10. చిత్రబంధ కవిత్వానికి పునరుజ్జీవం పోస్తున్నారు కదా! దాని ప్రత్యేకత ప్రాధాన్యత గురించి తెలియజేస్తారా?**


నేను పదవతరగతి చదివేటప్పుడు మా తెలుగు పండితుడు ఆదివారం నాడు ప్రత్యేకంగా అలంకారాలు బోధించేవాడు. ఒకరోజు ప్రశ్నోత్తరాలంకారం గురించి చెప్పినాడు. ఒకేవాక్యం ప్రశ్నగా ఉ ంటుంది, అదే ఉత్తరంగా (జవాబుగా) కూడా ఉంటుంది. దానిని ప్రశ్నోత్తరాలంకారం అంటారని రెండు ఉదాహరణలు చెప్పినాడు. 1. ఎద్దీశ్వర వాహనం – ఇందులో ప్రశ్న ఎద్ది ఈశ్వరవాహనం? దీనికి ఉత్తరం – ఎద్దు – ఈశ్వర వాహనం. ఈ అలంకారం చిత్రకవితకు చెందింది కూడా అన్నారు. ఇది నా మనసును ఆకట్టు కుంది. ఆ తదుపరి ఆదివారం సార్ ! నేనూ ప్రశ్నోత్తరాలంకారా నికి ఉదాహరణలు చెప్తాను అన్నాను. మా సారు ఒప్పుకొని చెప్పమన్నాడు. నేను చెప్పిన ప్రశ్నోత్తరాలంకారాలు. 1. ఏ నాగేశ్వరరావుకు నట సామ్రాట్ బిరుదు ఉంది. ప్రశ్న. ఏ నాగేశ్వరరావుకు నట సామ్రాట్ బిరుదు ఉంది? ఉత్తరం : ఏ. నాగేశ్వరరావుకు నటసామ్రాట్ బిరుదు ఉంది. 2. ఏ సుప్రభువు కరుణామయుడు ఇది ప్రశ్న. ఏసు ప్రభువు కరుణా మయుడు, ఇది ఉత్తరం.

హైస్కూలు నుండి చిత్ర కవిత్వంపై అధికమైన అభిమానం అభిరుచి. నేనూ రచించాలని కోరిక. నేను 1983లో శ్రీనివాస శతకం


రచించాను. అందులో, 1. అక్షర చిత్రాలు 2. బంధ చిత్రాలు 3. గర్భచిత్రాలు గల కంద పద్యాలు రచించినాను.

ఆ తర్వాత అనేక కావ్యాలలో ఉండే చిత్రకవిత్వాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తూ అధ్యయనం చేసి అందులోని చమత్కార పదప్రయోగ విధానాలను తెలుసుకోగలిగాను.

సురపురం అణ్ణాయ దీక్షితులవారు వందల సంవత్సరాలనాడు రచించిన చిత్రబంధ మాలికావటం మడతలు పెట్టడం వల్ల 24 తుంటలుగ మైసూరులో లభించిది. ఆ 24 తుంటలు ఒక క్రమ పద్ధతిలో పూర్వపువటం వలె జతపరచి శిథిలభాగాలను స్వీకరించి కొత్తగా చిత్రబంధమాలగా పటాలను ముద్రించి బంధ చిత్రాలను వివరణాత్మకంగా ఒక పుస్తకాన్ని చిత్రబంధమాలికా అనే పేరుతో ప్రచురించినాను. (2014)




బోర్‌వెల్లి సంస్థాన పాలకులగు వేంకటరెడ్డిగారి కాలంలో ఆయలూరి కందాళయార్యులు గారు అలంకార మణిభూషణం అనే గ్రంథాన్ని రచించినారు. ఆ గ్రంథాన్ని గద్వాల సంస్థానం వారు ముద్రించినారు. ఆ ముద్రిత ప్రతులు వర్తమానకాలంలో నాలుగైదు కన్నా ఎక్కువ లభించలేదు. అందులో రెండు ప్రతులు నా దగ్గర ఉన్నది. అందువల్ల శిథిలభాగాలను సులభంగా గుర్తించగలిగినాను. అందులో 'చిత్రమ్' అనే భాగంలో బంధ కవిత్వం ఉంది. ఆ భాగానికి సరియైన బంధ చిత్రాలను కూడ లిఖించి వ్యాఖ్య సంతరించి ప్రచురించినాను. బోరవెల్లి రైతు సంఘంవారు ఆ గ్రంథాన్ని చూసి అమితానంద మనస్కులైనారు. ఇక చిత్రీకరణ ప్రియులు ఎలాగూ సంతోషిస్తారు కదా!





'చిత్ర కవితా కళామందిరం' గా పేరు పొందిన గణపవరపు వేంకట కవి రచించిన ప్రబంధ రాజవేంకటేశ్వర విజయవిలాసాన్ని బంధ చిత్రాలు కూడా లిఖించి చిత్ర సహితంగ ప్రబంధాన్ని అక్షర సంయోజన చేయించి విశేష పీఠికతో 10 అనుబంధాలతో తయారు చేసి గ్రంథాన్ని తి.తి.దేవస్థానానికి ప్రచురణకు అందించినాను. వారు ప్రచురించినారు. 2023 బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రబంధ రాజ గ్రంథాన్ని తిరుమలలో శ్రీస్వామి సన్నిధిలో తి.తి.దే. ఛైర్మన్ భూమన కరణాకరరెడ్డిగారు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ధర్మారెడ్డిగారు ఆవిష్కరించి నన్ను ఘనంగా సత్కరించినారు.

ఇక బంధకవిత్వ సర్వస్వం. అనే గ్రంథాన్ని గత దశాబ్దంగా శ్రమించి సమకూర్చి రచించినాను. వెయ్యి పుటలు 1/4 సైజులో ఆ గ్రంథం త్వరలో ప్రచురితం కానుంది.

**4. మీరు సేకరించి, పరిశోధించిన సాహిత్య భాండాగారాన్ని రేపు బాధ్యత ఎవరికి ఇవ్వాలనుకున్నారు?**


తుంగభద్రానదీ వరదలలో కర్నూలు లోని కేంద్రగ్రంథాలయం వరదలకు గురైె పుస్తకాలన్నీ తడిసి ముద్దగా అయినవి. ఆ సందర్భాన నా గ్రంథాలయం నుంచి దాదాపు మూడు వేల పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థకు విరాళంగా ఇచ్చినాను. ఆ సందర్భంగా మంత్రివర్యులు శ్రీ కె.ఇ. కృష్ణమూర్తిగారు ఘనంగా సత్కరించినారు.




కర్నూలు పి.జి. సెంటర్ రాయలసీమ విశ్వవిద్యాలయంలో పనిచేసే ఉపన్యాసకులు కర్నూలులోని మారుతీనగర్‌లో అందరూ కొత్తగా ఇళ్ళు కట్టుకొని నివసిస్తున్నారు. వారు మారుతీనగర్‌లో నూతనంగా ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినారు. ఆ సందర్భంగా నాతోపాటు పనిచేసిన ఆ కాలనీలోని ఉపన్యాసకులు నన్ను "ఆర్యా! మీరు కొన్ని గ్రంథాలను మా గ్రంథాలయానికి బహుకృతిగా ఇస్తే బాగు" నన్నారు. వారికి దాదాపు (60 గోనె సంచులనిండ) పుస్తకాలు బహూకరించి నాను.

ప్రస్తుతం కేవలం నాకు చాలా అభిరుచి అభినివేశం ఉండే గ్రంథాలు దాదాపు 2000 గ్రంథాలలోపే నా గ్రంథాలయంలో ఉన్నాయి.

ఇక పరంపరగా మాకు వచ్చిన తాళపత్ర కాగిత లిఖిత ప్రతులు అలాగా రక్షించుకుంటూ ఉన్నాను. వాటి వివరాలన్నీ కూడా నేషనల్ మిషన్ ఫర్ మ్యాన్యుస్క్రిప్ట్స్ – ఢిల్లీ వారికి వారు అందించిన ప్రొఫార్మాలో అందించినాను.



**5. టి.టి.డివారికి మీరు అందించిన సాహిత్య సహకారం గురించి...**

1975 నుంచి కూడా అప్పుడప్పుడు నా గ్రంథ ప్రచురణకు తి.తి.దే.వారు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. కాణాదం పెద్దన సోమయాజి రచించిన అధ్యాత్మ రామాయణం 600 పుటలు 1/4 సైజులో (విపుల పీఠిక 60 పుటలు) అనుబంధాలతో రూపొందించి, తి.తి.దే వారికి ప్రచురణకు ఇచ్చినాను. వారు నన్ను ఆళ్వార్ల చరిత్ర సంగ్రహం, భాగవత వ్యాఖ్యానం, వామన చరిత్ర, మోహినీ విలాసం (వ్యాఖ్య) మొదలైన గ్రంథాలను రచించమనగా రచించి అందజేసినాను. ఇక ఆర్థిక సహాయం కోసం ఎందరో తమ గ్రంథాలను తి.తి.దే పేర ప్రచురణ విభాగానికి పంపేవారు. తి.తి.దే అధికారులు ఆ గ్రంథాలు ప్రచురణ యోగ్యమా? కాదా! నిర్ణయించి ధ్రువీకరణ చేయాలని నన్ను ఆదేశించేవారు. అలాగే నాలుగు సంవత్సరాలు తి.తి.దే. సాహిత్య సేవ చేసినాను. ప్రబంధరాజ రాజేశ్వర విజయ విలాసం సచిత్ర బంధాలతో పాఠ భేదాలతో 654 పుటల గ్రంథాన్ని తి.తి.దే.కు ధనాపేక్ష లేకుండ స్వామివారికి మొక్కుబడిగా సమర్పించగ ప్రచురించినారు. ఇంకా చాలా విశేషాలు ఉన్నాయి. విస్తర భీతి...

**6. ప్రాచీన సాహిత్యాన్ని ఇప్పటితరం అంతగా ఇష్టపడడం లేదు. కారణం ఏమిటి అంటారు? రేపు ప్రాచీన సాహిత్య పరిస్థితి ఏమిటి?**

కొత్తొక వింత పాతొక రోతగా నడుస్తుంది జనజీవనం. వృద్ధులను ఆదరించేవారు తక్కువ. అలాగే పూర్వ గ్రంథాలను ఆదరించేవారూ తక్కువే. అయితే అసలైన మౌలిక జన్మ కారణం పూర్వగ్రంథాలు, తల్లితండ్రులే కదా? ప్రాచీన సాహిత్యాన్ని ఆదరించేవారు వెయ్యిలో ఒకరిద్దరు ఉన్నా సరే దానిని భద్రపరచవలసి ఉంది, సంరక్షించవలసి ఉంది.

**7. వ్యాకరణంపై మీరు చేసిన కృషి ...**

వ్యాకరణంపై ప్రత్యేక కృషి ఏమీ చేయలేదు కానీ, బాలవ్యాకరణం, రచించిన చిన్నయసూరి వ్యాకరణాలు విమర్శలు అన్నీ సమకూర్చి నాను. అవసరమైన వ్యాసాలు, సూచికలు తయారు చేసినాను. వ్యాకరణ చరిత్రను గురించి పరిశోధించేవారికి అవి ఉపయుక్తం కాగలవు.

**8. మీ ముందు ఉన్న మీ పరిశోధన ప్రణాళిక, బాధ్యత ఏమిటి?**

పూర్వం ఏనాడో ముద్రితమై నేడు అలభ్యంగా ఉండిన సాహిత్యాన్ని సముద్ధరించటం కోసం తక్కువ ప్రతులైనా ప్రచురించటం. శ్రీమహాభాగవతం, ఆముక్త మాల్యద, ముకుందవిలాసం గ్రంథాలకు సంబంధించి ఇతఃపూర్వం ఎవ్వరూ తెలుపని విశేషాంశాలతో గ్రంథాలను వెలువరించుట. అదొక పెద్ద ప్రాజెక్ట్ వర్క్. ఇక ముద్రితం కావలసిన నా రచనలు 34 ఉన్నాయి. వాటిని తక్కువ ప్రతులైనా ముద్రించటం. ఎందుకంటే ఇతః పూర్వం ప్రస్తావించని అనేక విశేషాలు వానిలో ఉన్నాయని నా అభిప్రాయం.

**9. ఇప్పుడు వస్తున్న సాహిత్య పరిశోధనల మీద మీ అభిప్రాయం.**

మంచిరచనలు జ్ఞాన ప్రదాయకమైన రచనలు ఇప్పుడు కూడా వస్తున్నాయి. అయితే పూర్వం కన్నా తగ్గినాయి. ప్రస్తుతం 'లిఫ్ట్ ఇరిగేషన్ పథకం' ఎత్తిపోతల పథకం ఎక్కువ అని అభిప్రాయ పడుతున్నాను. ఒకరి రచనలోని భావాలను సంగ్రహించి తమ వాక్యాలలో రాయడం ఉంది, సంపూర్ణంగా నకలు చేయడం ఉంది. అది అల్పజ్ఞులు కాదు. పెద్దవారే వారి ప్రచురణలు చూస్తే వాక్యాలకు వాక్యాలే మార్పులేక ఇతరుల గ్రంథాలలో ఉన్నాయి. సరే రెఫరెన్స్‌గా ఆ ఇతరుల రచనలను పేర్కొండే ఎత్తిపోతల పథకం అనే చెడ్డపేరు రాదు కదా!

**10. మూసీతో మీకు ఉన్న అనుబంధం.**

గౌరవనీయులు ఆత్మీయులు శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు 1981 నుంచి నా రచనలను మూసీ పత్రికలో వెలువరించినారు. మా సాహిత్యానుబంధం రెండు దశాబ్దాలుగ ఉండినది. ఆ తర్వాత కూడా పత్రిక నిర్వాహకులైన జ్యోతిశ్శాస్త్ర కమలాకరులు డా. కమలాకరశర్మ గారు, విద్వన్మణి శాస్త్రిగారి సత్పుత్రికారత్నం మనోహరిగారు, నా రచనలను వెలువరిస్తూనే ఉన్నారు. ఇటీవల నా అసంపూర్ణ రచనలను పూర్తిచేసి ప్రచురించే ప్రయత్నంలో ఉండటం వల్ల ఏ పత్రికకు వ్యాసాదులు పంపడం లేదు. అది కూడా సాహిత్యసేవ కోసమే.

నమః



# జానపద బాణి పాటల్లో స్త్రీ మనోభావాలు – సోషల్ మీడియా పాత్ర

**డా. కె. రామస్వామి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, జర్నలిజం శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9492676677

జానపదులు అంటే గ్రామీణులు. జానపద పాటలు ఏ సమాజంలోనైనా అంతర్భాగం. జానపదుల జీవనశైలి, పరిసరాలు, వృత్తి అనేక ఇతర విషయాల నుండి స్ఫూర్తిని పొంది వాటిని పాటలుగా పాడుతారు. శ్రమజీవులు తమశ్రమను మరిచిపోవడానికి పాడుకునే పాటలే జానపద గేయలయ్యాయి. జానపదులు సంతోషం కలిగినప్పుడు చిందులు వేస్తూ, కూని రాగాలు తీస్తూ దు:ఖం కలిగినప్పుడు కూడా తమ బాధలను మరిచిపోవడానికి పాటలు పాడుతుంటారు. స్త్రీ పురుషుడు కలిసి పని చేస్తున్నప్పుడు వాళ్లలో కలిగిన భావాలను, ప్రేమను వ్యక్తం చేయడానికి కూడా జానపద పాటలను పాడుకుంటారు. ఈ జానపదాల్లో స్త్రీ యొక్క సహజ కోరికలు, వ్యక్తీకరించని భావోద్వేగాలు, నెరవేరని వాంఛలు, ఆశలు, నిరాశలు మరియు సామాజిక పరిసరాలపై వారి ప్రతిస్పందనను తెలియజేస్తాయి. ఈ జానపదాలే మౌఖిక రూపంలో ఒకతరం నుండి మరోక తరానికి అందుతున్నాయి.

మన జానపద కళలు అనేవి మహోన్నమైన దేశ సంస్కృతికి పట్టుకొమ్మలాంటివి. మానవ జీవన సంస్కృతికి ఈ జానపద విజ్ఞానమే మూలమని చెప్పవచ్చు. వృత్తి భావన, సంప్రదాయాలు, సాంస్కృతిక పరిజ్ఞానం అంతరించకుండా కాపాడడంలో జానపదాల ప్రాముఖ్యత మరువలేనిది. దేశ సంస్కృతి, సంప్రదాయాల విలువల్ని కాపాడి భావితరాలకు అందిస్తూ రావడంలో కూడా జానపదాలు ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. ఈ విధంగా జానపద సంగీతం ఒక తరము నుండి ఇంకొక తరానికి అందుతుంది. ఎన్నో తరాలు గడిచిపోతున్నా, రాజరికాలు అంతరించి పోయినా, ప్రభుత్వాలు మారిపోయినా కూడా జానపద కళలు సజీవంగా ఉండటము వాటి విశిష్టతగానే చెప్పవచ్చు.

జానపదాల ముఖ్య ఉద్దేశ్యం వినోదం అందించడమే. కాని మీడియా ఈ వినోదాన్ని ఉపయోగకరమైన స్థాయిలో అందిస్తుంది. కుటుంబం మరియు స్నేహితులతో ఉల్లాసంగా గడపడానికి మాస్ మీడియా ఉపయోగ పడుతుంది. పాశ్చాత్య సిద్ధాంతకర్తలు, మాస్ మీడియా యొక్క విధులను నాలుగు విధాలుగా గుర్తించారు. అవి పరిసరాలపై నిఘా, సమాచారాన్ని వివరించడం, వారసత్వాన్ని పదిల పరుస్తూ ఇంకో తరానికి అందజేయడం, వినోదాన్ని అందించడం. మాస్ మీడియా అంటే సమాచారాన్ని వార్త పత్రికలు, రేడియో, టెలివిజన్ ద్వారా అశేష జనాలకు సమాచారాన్ని అందజేయడం. ఇక్కడ జనాలు సమాచార స్వీకర్తలు మాత్రమే. ఇక్కడే గేటు కీపింగ్ వ్యవస్థ ఎదురవుతోంది. అంటే ప్రచరణ, ప్రసార కర్తలు సమాచారాన్ని వడబోస్తారు. వారి వ్యవస్థకు అనుకూలంగా ఉన్నట్లయితేనే అది



ప్రచురణకు, ప్రసారానికి నోచుకుంటుంది. ఉత్పత్తిదారులు ఏదైతే సమాచారం ప్రచురిస్తారో, ప్రసారం చేస్తారో అది మాత్రమే జనాలకు చేరుతుంది. కాని కంప్యూటర్ టెక్నాలజీ, ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో సోషల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందింది. సోషల్ మీడియా అంటే కంప్యూటర్ నెట్ వర్కింగ్ ద్వారా ఏర్పాటు చేసిన వ్యవస్థ. ఇక్కడ సమాచార ఉత్పత్తిదారులు, సమాచారాన్ని వినియోగించే వాళ్లు జనాలే. ఇక్కడ ఎలాంటి గేట్‌కీపింగ్ లేకపోవటం వల్ల జానపద కళాకారులకు సమర్థవంతంగా సోషల్ మీడియా ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి అందజేస్తున్నారు. జానపద పాటలను ప్రోత్సహించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలు జానపద కళాకారులకు, ప్రేక్షకులకు కూడా ప్రత్యమ్నాయ మద్దతు వ్యవస్థగా నిలిచాయి. దీనితో పల్లె పాటలు పునరుజ్జీవన దిశగా సాగిపోతున్నాయి.

జానపద పాటలు ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతానికే పరిమితం అయి ఉంటాయి. కాని సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రపంచంలో ఎక్కడనుండైనా చూడడానికి, వినడానికి సోషల్ మీడియా అవకాశం కల్పిస్తుంది. పూర్తిగా జానపదాలే కాకుండా వాటి బాణీలు తీసుకొని ఇప్పటికి కాలానికి అనుగుణంగా మార్పులు చేసిన ఎన్నో పాటలు సంచలనం సృష్టిస్తున్నాయి. అలాంటి పాటలను ఈ పరిశోధన వ్యాసంలో వీడియో షేరింగ్ వెబ్‌సైట్ యూట్యూబ్‌లలో 100 మిలియన్స్ (10 కోట్లు) వీక్షణలు మించి ప్రాచుర్యం పొందిన ఐదు జానపద బాణీలు కలిగిన పాటలను ఎన్నుకున్నాను. ఈ ఐదు పాటల్లో స్త్రీ కోరికలు, భావోద్వేగాలు, ఆశలు, నిరాశలు ఎలా ఉన్నాయో, ఆ పాటలకు ఎందుకు ఇంతా ప్రచారం వచ్చిందో, దీనికి సోషల్ మీడియా ఏ విధంగా ఉపయోగపడిందో తెలుపడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

**"ఏ పట్టు చీరనే కట్టుకున్న కట్టుకున్నుల్లో కట్టుకున్నా**
**టిక్కీబొట్టే వెట్టుకున్న వెట్టుకున్నుల్లో వెట్టుకున్న**
**నడుముకు వడ్డానం సుట్టుకున్న సుట్టుకున్నుల్లో సుట్టుకున్న**



**దిష్టి సుక్కనే దిద్దుకున్న దిద్దుకున్నల్లో దిద్దుకున్న**
**పెళ్లికూతురు ముస్తాబురో నువ్వు ఏడంగా వస్తవురో**
**చెయ్యి నీ చేతికిస్తానురో అడుగు నీ అడుగులో ఏస్తానురో**
**నేను మెచ్చి నన్నే మెచ్చేటోడ ఇట్టే వస్తా రా వెంట**
**నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేస్తపా దుగ్గు దుగ్గు దుగ్గు దుగ్గు అని**
**అందాల దునియానే చూపిస్తాపా...చిక్కు చిక్కు చిక్కు చిక్కుబుక్కని"**

(యూట్యూబ్ : https://www.youtube.com/watch?v=xQauklmE3Y8)

పెళ్లీడుకు వచ్చిన ఒక అమ్మాయి ఆమె మనసుకు నచ్చిన అబ్బాయితో ఏ విధంగా తన భావాన్ని వ్యక్తం చేస్తుందో లక్ష్మణ్ ఈ పాటలో మన ముందుంచాడు. నిజంగా లక్ష్మణ్ ఎంత అధ్యయనం చేశాడో కాని ఆడపిల్ల మనస్సులో భావాలను పట్టుకున్నాడు. మా కుటుంబంలో ఏడు ఇండ్లలో నేను ఒక్కగాను ఒక్క ఆడపిల్లను అమ్మ, నాన్న, అన్నదమ్ముల మధ్య చాలా గారబంగా పెరిగిన దాన్ని అయినా కూడా నీ వెంట రావడానికి సిద్ధంగా ఉన్న నీ బుల్లెట్ బండి మీద తీసుకెళ్లు నీకు కొత్త ప్రపంచాన్ని చూపిస్త అంటుంది. నీ కష్టసుఖాల్లో పాలుపంచుకొని నీకు, నీ కుటుంబానికి మంచి పేరు తీసుకొస్త నన్ను ఏలుకో అంటూ తన మనసులోని భావాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ మధ్య ఈ పాట వినబడని పెళ్లికానీ, బరాత్ కానీ గ్రామీణ ప్రాంతాల్లో లేవంటే అతిశయోక్తి కాదు.

**"నర్సపెల్లే... ఏ నర్సపెల్లే**
**నర్సపెల్లే గండిలోన గంగధారి ఆడినెమలీ ఆటలకు గంగధారి**
**ఆడి నెమలీ ఆటలకు గంగధారి మొగనెమలి మోసాపాయే గంగధారి**
**ఇద్దరాము కూడుదాము గంగధారి..ఒద్దిమాను కొరుగుదాము గంగధారి**
**నిన్ను నన్ను చూసినంకా.. మంది కంట్ల మంటలాయే**
**ముద్దు ముచ్చటోర్వలేక.. ముక్కు మూతి తిప్పుడాయే**
**పట్టకోర నువ్వుపిట్టలోలే... ఎగిరి బుంగ సెయ్యి**
**ఇద్దరీది కంటీనీరు గంగధారి ఒద్దిమాను కుంటనిండే గంగధారి**
**ఒద్దిమాను కుంటఎనుక గంగధారి ఇద్దుమిరుస సన్నఒడ్లు గంగధారి**
**ఇద్దుమిరుస సన్న ఒడ్లు గంగధారి ఇద్దరికీ తలంబ్రాలు గంగధారి"**

(యూట్యూబ్ https://www.youtube.com/watch?v=li28YHDUjhI)

ఈ మధ్య యుూట్యూబ్ పాటలలో పరిచమైన జానపద గాయకురాలు కనకవ్వ. కనకవ్వ సేకరించిన ఈ పాటకు తుది మెరుగులు దిద్దాడు కాసర్ల శ్యాం. ఈ పాటలో ప్రధానంగా మనకు నాలుగు విషయాలు కన్పిస్తాయి. ఒకటి స్త్రీ చేతిలో పురుషుడు మోస పోవడం, రెండు మనం అన్యోన్యత చూసి ఈ సమాజం కుళ్ళు కోవాలని, మూడు మన కన్నీళ్లతో నిండిన కుంటలోని నీళ్లతో మనం పెళ్లిలో వేసుకునే తలంబ్రాలు పండుతాయని, ఎన్ని కష్టాలు కన్నీళ్లు వచ్చిన నీతో కలిసి ఉంటానని యువతి తన మనసులోని భావాలను తన ప్రియునికి తెలుపుతుంది. కనకవ్వ సేకరించిన ఈ జానపద పాటలో పల్లవికి చరణాలకు ఒకదానితో ఒకటి సంబంధం లేకపోయినా కూడా ప్రజలలో విశేష ఆదరణ పొందింది.

**"యేమే పిల్ల అన్నప్పుడల్లా గుచ్చే పువ్వుల బాణాలు**
**గుచ్చే పువ్వుల బాణాలు అవి తేనె సుక్కల తానాలు**
**నువ్వు పిలిసే పిలుపులు తెరిసేనే గుండె తలుపులు**
**నన్ను గొట్టుకో నన్ను తిట్టుకో నీ దానివని పేరు పెట్టుకో**
**జర ముట్టుకో సుట్టు సుట్టుకో ఈ సిన్నదాని సెయ్యి పట్టుకో**
**నువ్వు దూరం దూరం ఉన్నావంటే మోయలేని భారాలు**
**మోయలేని భారాలు అవి దాటాలేని తీరాలు**
**నూరేళ్లు నువ్ సోపతి లేకుంటె సిమ్మసీకటి"** (యూట్యూబ్: https://www.youtube.com/watch?v=A73gmKHBx-g)

ప్రకృతి, ప్రేమ, శృంగారం అనేక విషయాలను వస్తువుగా తీసుకొని జానపద బాణీలలో వందలకొద్ది పాటలు రాసి సామాజిక మాధ్యమాలలో తెలుగు సమాజానికి పరిచయం చేసిన రచయిత మాట్ల తిరుపతి. ఒక అమ్మాయి తన ప్రియుని పిలుపుకోసం, అతని స్పర్శకోసం, అమ్మాయి చేయి పట్టుకొని బిగికౌగిలిలో ఒదిగిపోవాలని ఎంత తహతహలాడుతుందో ఈ పాటలో మనకు కనిపిస్తుంది. స్త్రీ మనోభావాలను అర్థం చేసుకొని అమె గుండె లోతుల్లోకి వెళ్లిరాసాడు తిరుపతి. నువ్వు ఒక్కపూట మాట్లాడకుంటే గుండే మోయలేనంత భారం అవుతుంది. అదేవిధంగా నువ్ రాయే పోయే అనే పిలుపులు పిలుస్తుంటే నాకు ఎంత సంతోషం కలుగుతుందో... నీ కోసం ఎదురైన దేవుళ్లకు మొక్కులు చెల్లించుకుంటున్నా ఎప్పుడు మూడు ముళ్లు వేసి పెళ్లి చేసుకుంటావో అని ఎదురుచూస్తున్నా యువతి మనసును మనం చూడోచ్చు.

**"అమె : సిట్టపట్ట సినుకులకు యేడ తిన్నవురో రాతిరి**
**నువ్ యేడ పన్నవురో రాతిరి**
**అతడు: కోంటోల్లింటికాడ కోలాటమాడంగా ఆడవోయిన్నే రాతిరి**

నేను సూడపోయిన్నే రాతిరి
అమె : కలమబ్బాయే కరంటువాయే యాడ తిన్నవురో రాతిరి
నువ్ యాడ పన్నవురో రాతిరి
అతడు : కాపోల్లింటికాడ కబడ్డి ఆడితే ఆడపోయిన్నే రాతిరి
నేను సూడపోయిన్నే రాతిరి
ఆమె : నమ్మి వచ్చినదాన్నిరో నన్ను ఆగం చేయకో బావయో
నన్ను ఆగం చేయకో బావయో
అతడు : నా మీద నీకున్న ప్రేమానుబంధం నేను యెరుగకపోతిని
ఛీ... బుద్ధి తక్కువొన్నైతిని
ఆమె : కడదాకా నీతోనే కలిసుంట బావయ్య వదిలిపెట్టకు
బావయ్య నన్ను ఒంటరి చేయకు బావయ్య
అతడు :నమ్ముకున్న నిన్ను ఆగం చేయను ప్రాణం ఇస్తానే జానకి
నీ మీద పమానమే జానకి
ఆమె : వదిలి పెట్టకు బావయ్య నన్ను ఒంటరి చేయకు బావయ్య
అతడు : ఆగం చేయనే జానకి నీ మీద పమానమే జానకి
ఆమె : నన్ను వదిలిపెట్టకు బావయ్య
నన్ను ఒంటరి చేయకు బావయ్య
అతడు : నిన్ను ఆగం చేయనే జానకి నీ మీద పమానమే జానకి"
(యూట్యూబ్: https://www.youtube.com/watch?v=WSpN-EjV2EI)

జానపద పాటలు కనుమరుగవున్న క్రమంలో ప్రభా సేకరించిన పాట ఇది. అక్రమ సంబంధాలతో తప్పు దారిలో వెళుతూ చేసిన తప్పుల్ని కప్పి పుచ్చుకుంటూ, అలవోకగా అబద్ధాలు అది మభ్యపెట్టే తన భర్తపై తనకున్న ప్రేమ, అనురాగం, అప్యాయతలను చూపిస్తూ, కన్న తల్లిదండ్రుల్ని వదిలి తన భర్తే సర్వస్వమని జీవితాంతం కలిసి ఉండాలనుకొని వచ్చిన తనను మోసం చేయవద్దని తన భర్తను వేడుకునే స్త్రీ వేదన ఇది. తన ప్రేమను గుర్తించిన భర్త పశ్చాత్తాప పడి తనను క్షమించమని ఇక తప్పు చేయనని ప్రమాణం చేయడం కన్పిస్తుంది. భార్యాభర్తల మాటలే పాటగా పాడుకున్నారు. నిత్యజీవితంలో ఏది ఏమైనా కట్టుకున్న వాళ్ల ప్రేమ చాలా గొప్పది దానికి ప్రతి ఒక్కరు కట్టుబడి చివరి వరకు నమ్మకంగా ఉండడం అనేది సృష్టి ధర్మం. ఈ పాట అంతరార్థంగా అదే చెప్తుంది.

"తిన్నాతిరం పడుతలే కూసున్న తిరం పడుతలే
ఏడున్న తిరం పడుతలే ఎవలున్న తిరం పడుతలే
బాదైతుందే నీ యాదిలో మనసంతా
మస్తు బరువైతుందే నీ యాదిలో మనసంతా
నువ్వు సిగ్గ సిటుక పట్టి దప్పుల్ల దరువులేస్తే
తనువంతా కాటకలిసే ప్రేమ ఇత్తునాలు మొలిసే
గప్పటి నుండే నాకు తిప్పలు మొదలాయే నొల్ల
పసిదాన్ని కాదా నేను పగబట్టబోకు నన్ను



పంతాలు ఇడసపెట్టు ఇకనన్నా సేయిపట్టు
నా గుండెలో బాధ నీ గుండెకు గురుతోస్తలేదా" (యూట్యూబ్: https://www.youtube.com/watch?v=fzqW33KVS68)

తెలంగాణ మాండలిక పదాలు వాడుతూ తెలంగాణ యాసలో, భాషలో అనేక పాటలు రాసిండు మాట్ల తిరుపతి. ఈ పాటలో చాలా తెలంగాణ మాండలిక పదాలు కనిపిస్తాయి. ఒక అమ్మాయి ఒక అబ్బాయిని ఇష్టపడ్డదంటే అబ్బాయిలో ఏదో ఒక కళ ఉంటుంది. సాధారణంగా ఆటనో, పాటలో, నటననో, మంచిగ చదువుకుంటేనో, అందంగా ఉంటేనో ఇష్టపడుతుంటారు. వీళ్ల ఇష్టాయిష్టాలు ప్రేమగా మారుతాయి. కొంతకాలం తరువాత చిన్నచిన్న కారణాలతో గొడవపడి దూరమయినా ప్రియుణ్ణి తలుచుకుంటూ ప్రియురాలు తన మనసులో ఎంత బాధ పడుతుందో ఆమె బాధను వ్యక్తం చేసే పాట ఇది. తింటున్నా, కూర్చున్నా, పడుకున్నా నీవే గుర్తొస్తున్నావు. నేను తట్టుకోలేకపోతున్నా. ఎటువంటి పంతాలు పెట్టుకోకుండా నా చేయిపట్టుకొని తీసుకెళ్లమని కోరుతుంది.

అద్భుతమైన జానపద బాణీలు కల్గిన అనేక పాటలు ఈ తెలుగు నేలమీద వందల ఏళ్లుగా ఆయా ప్రాంతాలకే పరిమితమైన పల్లె జానపదాలు సోషల్‌మీడియా ద్వారా దేశ ప్రపంచవ్యాప్తంగా పల్లెపదాలు వినబడుతున్నాయి. తెలంగాణ యాసలో ఉన్న ఈ జానపదాలు వివిధ భాషల్లో అభిమానులను సంపాదించుకోవడం తెలుగువారికి గర్వకారణం. మనసులో ఉన్న భావాలను సున్నితంగా వినసొంపుగా చెప్పగల సులభమైన గ్రామీణ భాషా, సంగీత వాద్యాలు, నాట్యం, కట్టుబొట్టు, పల్లెటూరు పరిసరాలలో చిత్రీకరించడం ఎలాంటి కృత్రిమంగా తయారు చేసిన సెట్టింగ్‌లు లేకపోవడంతో ఎక్కువ మంది తమను తాము నటీనటులతో పోల్చుకోవడం, పాడుకోవడానికి సులభంగా ఉండడం వల్ల ఎక్కువ అభిమానులను సంపాదించుకొంటున్నాయి.

జానపద పాటలు ప్రజలలో ముఖ్యంగా యువతలో నూతన ఉత్సాహాన్ని రేకెస్తున్నాయి. సినిమా పాటలకంటే ఎక్కువ అభిమానులను సంపాదించుకొంటున్నాయి. సోషల్ మీడియా వల్ల గ్రామీణ


## మీకు తెలుసా..?

రామప్ప ఉలి
మొనల మీద
పేరిణీ శివతాండవం
అతని మునివేళ్ళ కొనల
వెలసిన
నాగినీ నాట్యవిలాసం
రాతి తంత్రుల వైణిక
రాగ సందేశం
వెయ్యేళ్ళు గడచినా
చెదరని శిల్ప దరహాసం
ఇప్పుడది మనకు గెలిచిన
ప్రపంచ వారసత్వ
సంపదనే స్వర్ణపథకం





మీకు తెలుసా!?
ఆరోజుల్లో ఉండేదట!
ఉలి పిడికిలిలో
తొణికిసలాడే జల లాలిత్యం
గండశిలల్లో కరిగి
మెత్తబడే జీవనైజం
అది
టెండర్లు కొటేషన్లు
కాంట్రాక్టర్లు కమీషన్లు
లేని
అవినీత ముక్క కొరకని
కీర్తి కండూతి చుక్క మింగని
నాసిరకం కాని
నాణ్యమైన కాలం
అందుకే
ఈ దేవళమే
ఈనాటికి మనకు
మిగిలిన అపురూప
శిల్పకళాభరణం





(రామప్ప దేవాలయంపై... వెలుగు రవ్వలు కవితా సంపుటి నుండి.)

**మల్యాల మనోహర రావు**
ఫోన్ : 81065 42095

ప్రాంతాలో ఉన్న కళాకారుల ప్రతిభ బయటి ప్రపంచానికి తెలుస్తుంది. ఈ జానపద గాయకులు దేశ, ప్రపంచ వ్యాప్తంగా కొత్త అభిమానులను సంపాదించుకుంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన జానపద బాణీలలో యువతీయువకులు ఆడిపాడిన పాటలకే ఎక్కువ ఆదరణ కనిపిస్తుంది. ఇంతకు ముందు తరం జానపదులు నిరక్షరాస్యులు అయినప్పటికీ ఈ తరం వారు డిజిటల్ సాధనాలను, సామాజిక మాధ్యమాలను వాడుకొని సాంప్రదాయ నైపుణ్యాలను, జానపద సంగీతం వంటి వాటితో మనుగడ మాత్రమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగిస్తున్నారు.

సినిమా పాటలకు ఏ మాత్రం తగ్గకుండా ఈ జానపద పాటల చిత్రీకరణ జరుగుతుంది. నిజంగా సంగీతానికి అవరోధాలులేవని పాటల్లో శ్రావ్యత, స్పందన, ఉద్వేగం ఉంటే అభిమానులను సంపాదించుకోవచ్చు. భాషా అర్థం చేసుకోలేని, మాట్లాడలేని వ్యక్తులు కూడా యూట్యూబ్ ద్వారా అభిమానులైపోయారు. ప్రాంతం భాష ఏదైనప్పటికీ ప్రజల దృష్టిని ఆకర్షించడానికి సోషల్ మీడియాలో ఒకసారి వైరల్ ఐతే సరిపోతుంది. కాని సాంస్కృతిక మిశ్రీకరణ (Cultural hybridization) అనేది ఇప్పుడు జానపద సంగీతంలో కీలకమైన అంశం. జానపద బాణీలనే కాకుండా కనుమరుగవుతున్న జానపద పాటలను సేకరించి భవిష్యత్ తరాలకు అందించవలసిన అవసరం ఉంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కృష్ణకుమారి, నాయిని (1999), తెలుగు జానపద గేయగాథలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. రఘుమారెడ్డి, యెల్దండి (1979), పల్లె పదాలలో ప్రజా జీవనము, గురుకుల విద్యాపీఠ ప్రచురణలు. మహబూబ్ నగర్.
3. రంగయ్య, దాసరి (2012), పాలమూరు జిల్లా కర్షక గీతాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లికేషన్, హైదరాబాద్.
4. స్వామి, నసుమాస (2014), జానపద కళారూపాల్లో వృత్తి పురాణాలు, వృత్తి పురాణ పరిశోధన కేంద్రం, హైదరాబాద్.
5. బుల్లెట్టు బండి పాట, https://www.youtube.com/watch?v=xQauklmE3Y8.
6. ఆడనెమలి పాట, https://www.youtube.com/watch?v=li28YHDUjhI.
7. యేమే పిల్ల పాట, https://www.youtube.com/watch?v=A73gmKHBx-g.
8. సిట్టా పట్టా సినుకులకు, https://www.youtube.com/watch?v=WSpN-EjV2EI.
9. తిన్న తిరం పడుతలే, https://www.youtube.com/watch?v=fzqW33KVS68.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 41 హైదరాబాద్ డిసెంబర్ : 2023

# కుమార భారతి దర్శనంలో అగ్నిరాయబారం

**డా. సుద అంకమ్మ** , సహాయాచార్యులు, తెలుగుశాఖ, ఆర్.కె.వ్యాలీ, ఇడుపులపాయ. ఫోన్ : 8919806784

**పరిచయం :** కుమారుడు పార్వతి పరమేశ్వరుల పుత్రుడు. స్కందుడు, కార్తికేయుడు, షణ్ముఖుడు, సుబ్రహ్మణ్యం, గుహుడు, శరవణభవుడు, గాంగేయుడు, ఆగ్నేయుడు అనే కుమార స్వామికి పేర్లు. అసలు ఈ పేర్ల వెనుక తాత్పర్యమేమిటో కుమార జననం ద్వారా తెలుసుకోవచ్చు.

**కుమార జననం :** కుమారస్వామి జన్మకోసం అగ్నిదేవుడు, గంగాదేవి పడ్డ కష్టం, కృత్తికామతల్లులు కుమారస్వామి దగ్గరకు వచ్చి క్షీరమిచ్చే సందర్భం ఈ భాగంలో చూడవచ్చు. కుమార కథా ప్రారంభం శరత్కాలపు వెన్నెలతో ప్రారంభమవుతుంది.

శివపార్వతి కళ్యాణం లోకహితం. దానికోసం మన్మథుడు పుష్పబాణాన్ని శివుడిపై ప్రయోగించి భస్మమైపోయాడు. ఇక ఏమి చేసేది లేక అమ్మవారే ఆ పుష్పబాణాన్ని పట్టుకొన్నారు. బహిర్ముఖుడైన శివుడు ఆ స్థితిలో ఉన్న తల్లిని చూసి వశమైయ్యాడు. ఎందుకంటే అమ్మ కామాక్షి దేవి. శివపార్వతి కళ్యాణం జరిగింది. అమ్మ శక్తి స్వరూపిణి, శివుడు తేజోస్వరూపుడు. వాళ్ళ సంభోగం వలన పుత్రుడు జన్మిస్తే అలాంటి ప్రాణిని ఈ లోకం చూడలేదని మిగిలిన దేవతలు భావించారు. అందుకు రాయబారిగా అగ్నిని శివలోకానికి పంపుతారు.

**అగ్ని పాత్ర :** అగ్నిదేవుడు పోయి చూసినపుడు పార్వతీ పరమేశ్వరులు విహార క్రీడలో ఉన్నారు. ఎఱ్ఱని కలువల పూదోట పైన కార్తికపు వెన్నెల వ్యాపించినట్లుగా పార్వతీదేవిపైన స్వామి ఉన్నారు. ఈ విధంగా ఎఱ్ఱని రంగు, తెల్లని రంగు కలుసుకున్నట్లు ఉన్నాయి తప్ప, అదేదో మానవుల సంభోగంలా లేదు. పైగా శివపార్వతులు వ్యక్తులు కారు. రెండు తేజస్సుల యొక్క సమావేశం – సంగమం. కనుక అది తేజోలోకంలో జరిగిన శృంగారం. ఆ సమయంలో అగ్నివారిని దర్శించాడు. దేవతల విన్నపాన్ని వివరించాడు. సరేనని శివుడు భయంకరమైన త్రిభువన రౌద్ర తేజస్సును, ధాత్వణువును భరించు అని అగ్నికి ఇచ్చాడు.

ఆ శివ ధాత్వణువును అగ్ని చాలా కాలం భరించలేకపోయాడు. ఆ తేజోవేడికి అగ్ని తాళలేక కన్నులు మూతపడుతున్నాయి. ఇక అలాగే తూలి, తూలి బ్రహ్మ దగ్గరకు వచ్చి తన అవస్థను వివరించాడు. అప్పుడు బ్రహ్మ ఆలోచించి ఈ ధాత్వణువును మోయగలిగినది జాహ్నవి అని చెప్పాడు. ఇద్దరు కలిసి గంగ దగ్గరకు వచ్చారు.

**జాహ్నవి పాత్ర :** బ్రహ్మగారు గంగాదేవితో జరిగిన విషయాన్ని చెప్పి ఈ స్వాహాపతిని నువ్వే రక్షించాలని కోరాడు. గంగాదేవి ఎట్టి పరిస్థితులలోనూ, తన చేత కాదు అనకుండా ఉండడానికి బ్రహ్మదేవుడు వాక్పతిగా మాట్లాడాడు. అగ్నిదేవుడి దీనస్థితిని వివరించాడు. బ్రహ్మ అంతటివాడు చెప్పిన తర్వాత గంగాదేవి ఎట్లా కాదంటుంది? సరియే అని అన్నది. ఆ ఒక్క మాటతో అగ్ని తనలో ఉన్న శివ ధాత్వణువును గంగానదిలో ప్రవేశపెట్టి వెనుతిరగకుండా వెళ్ళిపోయాడు. మళ్ళీ ఎక్కడ భరించలేకపోతే తనకు తిరిగి ఇచ్చేస్తుందేమో అన్న భయం. ఆ శివ ధాత్వణువు ఎంత శక్తివంత మైనదో మనకు తెలుస్తుంది. గంగానదిలో రౌద్రరేణం ఎప్పుడైతే పడిందో వెంటనే గంగానది కుతకుత ఉడికిపోయింది. గంగానది ప్రవాహం కూడా అదేవిధంగా సుడికట్టుకొని మెలికలు తిరుగుతూ చూసేవాళ్ళకు భయంగా ముందుకు సాగిపోయింది.



తరువాత గంగానదీ ప్రవాహం విషమావస్థకు చేరుకుందని అర్థమై గంగ శివుడిని ప్రార్థించగా, శివుడి ఆజ్ఞ మేరకు ఆ ధాత్వణువు హిమాలయ పర్వతాల పాదాలలో ఉన్న రెల్లువనంలో విడిచిపెట్టింది.

**భూదేవి పాత్ర :** అలా వదిలిన క్రమంలో ఆ ధాత్వణువు ఆరు భాగాలుగా విచ్ఛిన్నమై, ఆరు ముఖాలు కలిగిన బాలుడు జన్మించాడు. అదే క్రమంలో బంగారు, వెండి, రాగి ఇత్యాది లోహాలు పుట్టుకొచ్చాయి. పూర్వం ఆ రెల్లువనం పార్వతిదేవి శరీరం. అలా ఆ వనంలో శివ ధాత్వణువు ప్రాణం పోసుకొంది.

అలా షణ్ముఖుడు జన్మించాడు. షణ్ముఖుడి ఆకలి తీర్చేందుకు కృత్తికలు ఆరుగురు పాలిచ్చారు. అందుకే కార్తికేయుడయ్యాడు. గంగ మోసినందు వలన గాంగేయుడు. అగ్నిలో ఉన్నందువల్ల ఆగ్నేయుడు అని పేర్లు వచ్చాయి.

**పార్వతి దేవి శాపాలు :** పార్వతి పరమేశ్వరుల సంగమంలో పార్వతి దేవిలో ప్రవేశపెట్టవలసిన శివ ధాత్వణువును, శివుడు దేవతల కోరిక మేరకు అగ్నికిస్తాడు. తన మాతృత్వాన్ని దేవతలు వారి ప్రయోజనం కోసం



లాగేసుకున్నారని పార్వతి దేవి బాధపడుతుంది. ఆ బాధ క్రోధంగా మారింది.

**పార్వతి – దేవతలు :** తన నుండి తన మాతృత్వాన్ని దూరం చేసినందుకు అమ్మ దేవతలకు శాపం విధించారు. మీ వలన మీ భార్యలకు సంతాన సుఖం లభించదని. అలా దేవతల సంఖ్య ముప్పైమూడు కోట్ల సంఖ్య వరకే నిలిచిపోయింది. పెరగదు, తరగదు. ఎందుకు తరగదంటే దేవతలు అమృతాన్ని సేవించారు కనుక.

**పార్వతి – అగ్ని :** ఆ క్రమంలో అమ్మకి తన మాతృత్వాన్ని దూరంచేసిన క్రమంలో అగ్నిది పెద్ద పాత్ర. కనుక అగ్నికి శాపం లభించింది. మంచి, చెడు తేడా లేకుండా తను సర్వభక్షి అయినాడు.

**పార్వతి – గంగ :** గంగ, పార్వతులు హిమవంతుని పుత్రికలు. పార్వతి దేవి, అక్క గంగాదేవి, గంగ కూడా ఆ క్రమంలో భాగం అయినందుకు చాలా బాధపడి గంగను శపించారు. మృతదేహం వలె నీలో ఎప్పుడు చెడు – పాపాలు ఉండుగాక అని.

**పార్వతి – భూదేవి :** పర పురుషుడి రేతస్సును స్వీకరించినందుకు నీకు చాలామంది భర్తలు, అలాగే నిత్య వైధవ్యం ఉంటుందని పార్వతి దేవి భూదేవిని శపించారు. ఆ శాపంలో నిగూఢ మర్మం దాగుంది.

ఎంతైనా తల్లి నుండి తన మాతృత్వాన్ని దూరం చేస్తే ఏ తల్లి భరిస్తుంది. అది భరింపరాని బాధ. చివరకు ఆ శాపాలని పార్వతి దేవి భరించవలసొచ్చింది. ఎందుకంటే ఆ అమ్మ ప్రకృతి కనుక. ఆమె జగజ్జనని. లోకానికంతటికి అమ్మ.

అలా కుమారుడు జన్మించాడు. ఆ జన్మ వెనుక అసలు కారణం తారకాసురుడి వధ. కృత్తికల దగ్గర పెరిగి, శివుడి దగ్గర విద్యను అభ్యసించి, తన అమ్మ పార్వతి దేవి దగ్గర శక్తిని పొందాడు స్కందుడు.

**జన్మరహస్యం – యుద్ధం :** తారకాసురుడు రాక్షసుడు. బ్రహ్మ వరం లభించినవాడు. తన అహంకార గర్వంతో దేవతలని పీడించాడు. ఆ రాక్షసుడి నుండి విముక్తి కోసం దేవతలు కుమార స్వామిని సైన్యాధిపతిని చేసి యుద్ధాన్ని ప్రకటించారు.

పూర్వం కథనం ప్రకారం ఇంద్రుడు వజ్రాయుధాన్ని నాశనం చేయడం కోసం స్కందుడు తన శరీరం నుండి విశాఖుడిని పుట్టించాడు. ఆ విశాఖుడు యుద్ధంలో కుమారుడితోపాటు పాల్గొన్నాడు. మొదట రాయబారిగా విశాఖుడు వెళ్ళాడు. ఒప్పందం కుదరలేదు. యుద్ధం ఆరంభమైంది. యుద్ధ వ్యూహాల గురించి సోదరులు చర్చించుకున్నారు. అలా యుద్ధం సాగుతుంది. తారకుడి వైపు బలం తగ్గుతుంది.

మరోసారి శాంతి ఒప్పందం కోసం కుమారస్వామి అగ్నిని రాయబారిగా పంపించాడు. అదే అగ్ని రాయబారం.

**అగ్ని రాయబారం :** అగ్నిని రాయబారిగా పంపించడం కోసం శాంతమూర్తియైన కుమారస్వామి చెప్పే ఘట్టంతో అగ్నిరాయబారం ప్రారంభమవుతుంది.

నీవు (అగ్ని) హవ్యములచేత ప్రకాశించే ముఖం గలవాడవు, దేవ దూతవు కాబట్టి, రాక్షసేశ్వరుడు నీవలన శాంతిస్తాడేమో. నా మాటగా చెప్పిరా! వింటే సరే, వినకపోతే యుద్ధం ఎలాగూ తప్పదు కదా! అని స్కందుడు అగ్నిదేవునితో చెప్పాడు. అగ్నికి రెండు ముఖాలు, తన నాలుగు కన్నులు వినయభావంతో స్వామి చెప్పిన మాటలు విని, తన రథంతో రాక్షసుల శిబిరాల వైపు పయనమైనాడు. ఆ రథం కాంతులు చిమ్ముతూ బయలుదేరింది. రాక్షససేనాపతి సాయంతో అగ్ని తారకుడి దగ్గరకు వెళ్ళి ఇలా అంటున్నాడు.

ఓ రాక్షసరాజా! దేవసేనాపతి అయిన కుమారస్వామి రాయబారిని అని క్లుప్తంగా అగ్ని పరిచయం చేసుకున్నాడు. అగ్ని ఇలా అంటున్నాడు. అన్నింటికీ కారణం కాలం. కాలానికి వ్యతిరేకంగా ఎవ్వడూ పోలేడు. ఇన్నాళ్ళు దేవతలు బలం చాలక వ్యథలు పడ్డారు. ఆ చాలని వంతు ఇప్పుడు నీ సొంతు. కనుక వృథాగా గర్వపడకు, పగ విడిచిపెట్టుకొని శాంతి ఒప్పందం చేసుకో. మనస్సు కోర్కెల రథంపై ఎక్కి పరిగెత్తగలదు. ఇంద్రియాలను అదుపు చేసుకొని ఒప్పుదలయైన నీతిమార్గం చూడు. యుద్ధం వలన నీ కోసం చాలా మంది చావాలి. కుమారస్వామి కాలాతీతుడు. అతడు చావడు, జీవితంలో దుష్టకార్యాలు ఎంత నీచమైనవో నీ మనసులో ఆలోచించుకో. శాంతి, మర్యాద పాటించి సుఖంగా ఉండు. స్వామి రథం కాలానికి చిహ్నం. అతడు నిత్యకుమార రూపుడు. చావనివాడిని చంపడానికి ప్రయత్నించే వాడెంత వెఱ్ఱివాడు?

విశాఖుని రాయబారం రాజనీతితో ఉంటుంది. అగ్ని రాయబారం ఆధ్యాత్మికంగా ఉంటుంది. కుమారతత్త్వ వ్యాఖ్యాత. భగవంతుడి గురించి ఇలా వర్ణిస్తున్నాడు. భగవంతుడు ఆది, మధ్య, అంత రహితుడు. అతని (కుమారస్వామి) రథం కాల చిహ్నం. రథానికి కుక్కుట (కోడిపుంజు) ధ్వజ ముంటుంది. అది కాల చిహ్నం. కాలజ్ఞానం దాని పేరు. కాలంపై ఉన్నాడు స్వామి. ఇక అగ్ని కుమారస్వామి తత్త్వాన్ని ఆవిష్కరిస్తున్నాడు. స్వామిని ధనుస్సుతో పోల్చారు.

ఆ ధనుస్సు చివరి రెండు కొనలూ, లస్తకము అనగా పిడి – త్రేతాగ్నులు అవే గార్హపత్యం, దక్షిణాగ్ని, ఆహవనీయం. ఆ ధనుస్సు యొక్క నారి అధర్వణ వేదం. అది నాల్గవ వేదం. మధ్యలో పల్లం సూచించడానికి నాలుగు లఘువులు, చివరి రెండువైపులా ఉబ్బెత్తులను చూపించడానికి రెండు పక్కల మూడేసి గురువులున్నాయి. ఇది పణవ ఛందస్సు.

**స్వాయత్ సౌమ్యయజన వేదశ్రీ :** ఆ ధనుస్సును ఇప్పుడు ఆధ్యాత్మికమైన యోగవిద్య సంబంధంగా చెప్తున్నాడు అగ్ని. ఆ ధనుస్సు ఆరు కమలాలు కలది. ఇవి మూలాధారం నుంచి క్రమక్రమంగా ఆజ్ఞాచక్రం దాకా చెప్పబడ్డాయి. అవే 1) మూలాధార చక్రం 2) స్వాధిష్ఠాన చక్రం 3) మణిపూరక చక్రం 4) అనాహత చక్రం 5) విశుద్ధ చక్రం 6) ఆజ్ఞాచక్రాలు. ఆధ్యాత్మిక దృష్టికి కనిపించే ఆ ధనుస్సును శత్రుత్వ మనస్తత్వం విడిచిపెట్టి చూడమన్నాడు అగ్ని.

తిరిగి జవాబుగా అగ్నిని చూసి ఇలా అన్నాడు తారకుడు. మూర్ఖుడా! చాలా మాట్లాడినావు! ఇక సహించనని అగ్నిని బంధించి పంపాడు తారకుడు. అగ్నిని తాకి తన బంధం తొలగించాడు స్కందుడు. తారకుడు తన మాటలను ధిక్కరించడమే గాక అగ్నిని అస్త్రబంధం చేయడంతో కోపానికి లోనై యుద్ధాన్ని తిరిగి ప్రారంభించారు.

చివరకు కుమారస్వామి తారకాసురుడిని సంహరించాడు. జయ జయ నాదాలతో కుమారస్వామిని ఇంద్రాది దేవతలు స్తుతించారు. ఏ వెన్నెలతో కథ ప్రారంభమైనదో అదే వెన్నెలతో ముగిసింది.

**ముగింపు :** ఈ కథనం ద్వారా మనం చాలా విషయాలను గ్రహించవచ్చు. కాలం అన్నింటికీ కారణం. కాలానుగుణంగా ప్రవర్తించాలి. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అహంకారం, గర్వం, మనిషి నేత్రాలను (జ్ఞాన నేత్రాలను) మూసేస్తాయి. వాటివల్ల మంచికి, చెడుకి భేదం తెలియదు. శాంతి, మర్యాదలను పాటించడం వలన జీవనం సుఖంగా సాగుతుంది. ఇక్కడ చెప్పబడిన యోగవిద్య సాధనాల ద్వారా మనిషి తన తత్త్వాన్ని తెలుసుకోగలడు. మనిషిలోనే దైవం ఉన్నాడు. దానిని గ్రహించి అంతా సన్మార్గంలో నడుచుకోవాలి. అదే సమాజ శ్రేయస్సుకు తోడ్పడుతుందని నా అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు**

1. కోటీశ్వరరావు, తుమ్మపూడి – కుమార భారతి (పీఠిక) మలయకూట ప్రచురణ, అనంతపురం – 1980

2. నన్నెచోడుడు – కుమార సంభవము

3. పూజారక శిక్షకరు, బి.ఎస్. – సర్వజ్ఞమూర్తియ వచనగిశు

4. రామరాజు, బిరుదరాజు – పారమార్థిక గేయములు

5. రామలింగారెడ్డి, కట్టమంచి – కవిత్వ తత్త్వవిచారము

6. వేంకటరామ నరసింహం కాకర్ల – సాహిత్య దర్శనం

7. శివప్ప, బూద్యాశు – పారమార్థ శరధీ షట్పది గ్రంథవు




8. సుప్రసన్నాచార్య, కోవెల – సహృదయ ప్రకము

9. హనుమంతప్ప, ఆదవాని – తత్త్వ గేయాలు – బ్రహ్మాసారం

10. హనుమంతప్ప, ఆదవాని – కుమార భారతి – రాయబార నిర్వహణం – తెలుగు – జూన్ – 1989

11. శ్రీరామమూర్తి, కొర్లపాటి –ఈశ్వరార్చన కళాశీలుడు – రమణశ్రీ ప్రచురణ, గుంటూరు – 1974

12. ఆర్వీయస్. సుందరం – భాష, జానపదం – తెలుగు సాంస్కృతిక సమితి, వ్యాస సంకలనం, మైసూరు – 1981

13. నారాయణ రెడ్డి.సి – ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు ప్రయోగములు ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు, మచిలీపట్టణం – 1967

14. Andhra Coomar Swamy -- The Transformation of Nature in Art Munsiram Manoharlal -- 1974


15. Hanumanthappa -- Bhakti Movement Tattvas in Telugu and Kannada Folklore (Inprint)

16. Shyama Sastri -- Artha Sastra Woodrofee John -- The Serpent Power Ganesh & Company, Venkata Narayana Road, Madras-17, Tantra Raja Tantra.



# తెనుఁగు వాఙ్మయ వికాసము - పునరుద్ధరణ

బి.ఎన్.శాస్త్రి, మూసీ సంపాదకీయాలు



ఆంధ్ర భాష తేనెలొలుకు తీయని భాష. క్రీస్తు శకారంభము నాటికే వాడుక భాష. ప్రజల భాష. దేశ భాష.

హాలుని 'గాథా సప్తశతి' రచనాకాలము నాటికే తెనుఁగు ప్రాకృత కవితలో స్థానమాక్రమించినది. క్రీ.శ. 10వ శతాబ్దమునాటికి చోడ వంశపు రాజైన నన్నెచోడ మహాకవి 'కుమార సంభవ'మను మహా కావ్య రచనఁ గావించి, ఆంధ్రభాష కెనలేని మహోపకార మొనర్చిన ధన్యుడు. ఇదే మన సాహితీ చరిత్రలో ప్రథమాంధ్ర కావ్యము. జాను తెనుఁగులో శివపార్వతుల చరిత్ర నతి మనోజ్ఞముగా, సుందరతరముగా రసభావస్ఫోరకముగా రచించి, తెలుగు జాతికి, భాష ఔన్నత్యానికి తరతరాలవరకూ శాశ్వతత్వాన్ని ఆపాదించిన మహాకావ్యము. ఇట్టి మహాకావ్యరచన గావించిన నన్నెచోడ మహాకవి మహిమాన్వితుడు, అజరామరుడు.

రాజరాజ నరేంద్రుని సంకల్ప బలమో నన్నయ ధీబలమో, క్రీ.శ. 11వ శతాబ్దము నాటికి తెనుఁగు భాష రూపురేఖా విలాసముల నింపుకొని, సాహితీ రంగముపై మృదుమధుర మంజీర శింజినీ రవముతో సాక్షాత్కరించి నేటివరకూ ప్రజల హృదయాలలో నొక విశిష్టత. శాశ్వతమైన ప్రత్యేకత నేర్పరచుకున్నది. తెనుఁగు భారతికే శిరోభూషణ ప్రాయమైన 'యాంధ్ర మహాభారత' కావ్యావిర్భావమునకు నాంది పలికినది. నన్నయ రచనలోని సంస్కృతపద సమైక్యతతో, పాల్కురికి సోముని వ్యావహారికతతో ప్రజల నాలుకలపై నసియాడి, తిక్కన సమకాలీన సామాజిక దృక్పథ దర్పణంలో, తన సౌందర్యాన్నినుమడింపఁ జేసుకొన్ని సుమధురవాణి మన తెలుగు వాణి.

శ్రీనాధుని శృంగార నైషధాదులు, పోతన భాగవతము, రాయల వారి ఆముక్తమాల్యద, అష్టదిగ్గజ కవుల మహాకావ్యవములు తెనుఁగు భారతి కెనలేని, అమూల్యమైన, అపురూపమైన అలంకారములు ప్రబంధ వాఙ్మయ వికాసానికి మార్గదర్శకములు.

ఈ విధముగా తెనుఁగు భాష కాలానుగుణముగా, ఆయా పరిస్థితుల కనుకూలముగా, ప్రక్రియా వైవిధ్యముచే వినూత్న పంథాలో నడుగిడినది. భాష, భావము, సామాజికత, చైతన్యము నిరంతరం సాహితీ వాహినిలో నూతన సొబగులను సంతరించు కొని, దొరలుచునేయున్నవి. ఇట్టి గమనంలో నుండి, ప్రబంధములు, కావ్యములు, పురాణేతిహాసములు, ధర్మశాస్త్రములు, నాటకములు, గ్రంథములు, ఏకాంకికలు, వీధినాటకములు, యక్షగానములు, శతక వాఙ్మయములు, చాటువులు, స్వీయ చరిత్రలు, మాత్రా ఛందో బద్ధమైన కవితా ప్రక్రియలు. వచన కవిత్వము, పద్య గద్యాత్మకమైన కావ్యములు, ఖండికలు, ఖండకావ్యములు, నవలలు, నవలికలు, కథలు, కథానికలు, గల్పికలు, గేయ కవిత్వము, స్వేచ్ఛాకవిత్వము, కవితలు, మినీ కవితలు, మినీ కథలు, ముక్తకాలు, స్కెచ్‌లు మున్నగునవి యుద్భవించి, భాషకూ, భావానికి, సాహిత్యానికి సామాజిక శ్రేయస్సుకు పరస్పర సమైక్యతను సాధించినవి. నిండైన సాహితీ విలువలను నానాటికీ సుసంపన్నము చేస్తూనే ఉన్నాయి.

ఇట్టి క్రమ క్రమానుగత సాహితీ పరిణామాన్ని ప్రజలకింకా చేరువ కావాలనే సదుద్దేశ్యంతో సాహిత్య ఎకాడమీలు, ప్రచురణ సంస్థలు (కర్తలు) ప్రచార సాధనాలు ఏర్పడినవి.

ప్రాచీన సాహిత్య పఠనాసక్తి, మన భాష సంస్కృతీ పురావైభవము నాకళింపు చేసుకొనవలెనని ఏ కొద్దిమందికో అభిమానము. పాఠ్య గ్రంథములలో ప్రాచీన కావ్య ఖండికలను పరిచయం చేయుటకై 'ఎకాడమీ' లొనరించు కృషి ప్రశంసనీయమే కాని, యిట్టి ఎకాడమీలు ప్రాచీన కావ్యములను పునరుద్ధరించి, ప్రచురించుచున్ననూ, యవి కొందరికి మాత్రమే లభ్యమగుట, వాటి ప్రతులు కూడా తక్కువగానే వేయుట శోచనీయము.

వివాదాస్పదమైన గ్రంథములను, కాలగర్భంలో మరుగుపడిన వెలికిరాని రచయితల, గ్రంథములను, సమగ్ర చారిత్రక పరిశోధనా గ్రంథములను వెలుగులోకి తెచ్చి, వ్రాయించి, పరిష్కరించి, నేటి సాహితీవేత్తలకు గాని, సాహితీ విద్యాసక్తులకు గాని, పరిశోధకులకు గాని, మార్గదర్శకమగునట్లుగా తీర్చి దిద్ది, ప్రచురించవలసిన ఆవశ్యకత, కర్తవ్యము, మరియు నట్టి గ్రంథములను సులభముగా నందరికీ లభ్యమగునట్లు చేయవలసిన బాధ్యత యిట్టి ప్రచురణ సంస్థల ఎకాడమీల సక్రమ నిర్వహణపై యాధారపడి యున్నదని, యీ బృహత్పథకమునకు సాహితీ ప్రియంభావుకులు యితోధిక సహాయ సహకార సంపత్తుల నందించ వలసిన బాధ్యతను గుర్తించగలరని మనవి.

- సంపాదకుడు

# ఒగ్గు – మందెచ్చు కథాగానాలు – సాహిత్యాంశాలు

**కావటి సతీష్ కుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9493264901

**పరిచయం:** పల్లె ప్రజల జీవనాడుల్ని తట్టి లేపే సాహిత్య ప్రక్రియ ఒగ్గు కథ. జానపద కళల్లో ఒగ్గుకథ చాలా ప్రత్యేకమైనది. తరతరాల చరిత్రను పుక్కిటి పురాణాలుగా అందించే అద్భుతమైన జీవకావ్యం. మంచి విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసికోల్లాసాన్ని కలిగించే గ్రామీణ కళారూపం ఒగ్గుకథ. కళల కణాచి తెలంగాణ ఈ నేలలో పురుడు పోసుకున్న కళలెన్నో నేడు సజీవంగా ఉంటూ ప్రపంచ కళారూపాలలో తలమానికంగా మారాయి. అలాంటి కళారూపాలలో ఒగ్గుకథ ఒకటి. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్,ఐ వరంగల్, హైదరాబాద్, నల్గొండ జిల్లాల్లో ఈ కళకు మంచి ప్రసిద్ధి, ప్రచారం ఉన్నాయి. ఒగ్గుకథ గొల్ల, కురుమ కులాల వారు చెబుతారు. వీరు మల్లన్న, బీరప్ప కథలను ఒగ్గుకథగా చెబుతారు. మరియు యాదవులను యాసించే ఆశ్రీత కులాల జానపద కళారూపం మందెచ్చు కళారూపం. వీరినే మందపిచ్చి, మందుచ్చ, మందహెచ్చు అనే పర్యాయపదాలు వీళ్ళకు కానవస్తున్నాయి. కథలు చెబుతూ మట్టిబొమ్మలు లేదా చెక్కబొమ్మలు ప్రదర్శిస్తూ కథగానాలు, చేస్తూ సంచార జీవనం చేస్తుంటారు.

**1. ఒగ్గు కథ స్వరూప స్వభావాలు – చరిత్ర :** జానపద కళల్లో ఒగ్గుకథ చాలా ప్రత్యేకమైనదిగి చెప్పవచ్చు. ప్రస్తుత జానపద కళల్లో ఒగ్గుకథ ప్రజల హృదయాల్లో నిలిచి విశేషంగా ఆకర్షిస్తూ ఉంది. ముఖ్యంగా ఈ ఒగ్గుకథ తెలంగాణ ప్రాంతంలో బాగా ప్రసిద్ధి చెందిన జానపదకళ.

**ఒగ్గుకథ అనే పేరు ఎలా వచ్చింది :** శివుని వాద్యమైన దమరుకాన్ని ఒగ్గు కథకులు 'ఒగ్గు' అని పిలుస్తారు. ఈ కళా ప్రదర్శనలో ఒగ్గుని ఉపయోగించి కథను చెప్పడం వలన దీనికి 'ఒగ్గుకథ' అనే పేరు వచ్చింది. ఒగ్గు కథలను చెప్పేవాళ్ళను ఒగ్గోళ్ళు, ఒగ్గులు అని అంటారు. వీరు ప్రధానంగా గొల్ల, కురుమ కులానికి చెందినవారు.

**మల్లన్న వాళ్ళు :** మల్లన్న (మల్లికార్జున స్వామిని పూజించేవారు మల్లన్నలవారు. వీరు పూర్వం కేవలం మల్లన్న కథలను మాత్రమే చెప్పేవారు. కాని ప్రస్తుతం ఇతర అనేక కథలను చెబుతున్నారు.

**బీరన్నలవాళ్ళు :** వీరభద్రుని పూజించేవారు వీరన్నలవారు. ఈ వీరన్నల పదం కాలక్రమంలో బీరన్నలుగా పరిణామం చెందింది. ఈ బీరన్నలవారు బీరప్ప కథను ఒగ్గుకథగా చెప్పేవారు. అదీ ఒగ్గుదీక్షను స్వీకరించినవారు మాత్రమే ఈ కథలను చెప్పేవారు.

**ప్రముఖమైన ఒగ్గు కథలు :** 1) మల్లన్నకథ 2) బీరప్పకథ 3) ఎల్లమ్మకథ 4) పెద్దిరాజు – పెద్దమ్మకథ 5) మౌనోదరి కథ 6) మాంధాత కథ 7) మైరావణ కథ 8) సువర్ణ సుందరి కథ 9) ఆరు



మల్లెపూవులు కథ 10) హరిశ్చంద్రుని కథ 11) దుర్గమ్మ కథ 12) కీలుగుర్రం కథ 13) బాలనాగమ్మ కథ.

ఈ విధంగా వీటితో పాటు అనేక క్రొత్త కొత్త కథలను చెబుతున్నారు. అంతేగాకుండా భారత, రామాయణాల్లోని కొన్ని ఘట్టాలను ఒగ్గు కథా శైలిలో చెబుతున్నారు.

**ఒగ్గు కథకుల పుట్టు పూర్వోత్తరాలు :** ఒగ్గు కథలు శైవులు, మల్లన్న, బీరన్నలు ఇద్దరూ శివుని అంశవల్ల జన్మించినవారు. మహిమలు కలవారు. అనేక ఘనకార్యాలు చేసినవారు. వీరు చేసిన మహిమలను, ఘనకార్యాలను ప్రస్తుతిస్తూ కథను చెబుతారు. శివాంశతో పుట్టిన వారి కథలను శైవులైన ఒగ్గువారు శివుని వాద్యమైన ఒగ్గుతో చెప్పడం వలన ఈ కథకు "ఒగ్గు కథ" అనే పేరు వచ్చింది.

పూర్వం మల్లన్న, బీరప్ప కథలను వరుసగా పదిహేను రోజులుగా చెప్పేవారు. ఎల్లమ్మ కథ, బాలనాగమ్మ కథ మొదలైన వాటిని మూడు నుంచి ఐదు, ఆరు రోజుల పాటు చెప్పేవారు. కానీ ఈనాడు అంత సుదీర్ఘంగా కథను వినే ఓపిక ప్రజలకు లేకపోవడం మరియు పాశ్చాత్య సంస్కృతి ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం వల్ల అనేక **"ధారావాహిక సీరియల్స్"** ద్వారా మహిళలను టీవీలకు మాత్రమే పరిమితం చేయడం లాంటి కారణం వల్ల సమయ సందర్భాలను బట్టి తాము చెప్పే కథలను కథలను కుదించి ఒకటి, రెండు రోజుల్లో చెబుతున్నారు.

**ఒగ్గు కథ చెప్పు సందర్భాలు :** ఒగ్గు కథను కాపు, గొల్ల, కుర్మలు తమ ఇళ్ళలో వివాహాలు, శుభకార్యాలు జరుగుతున్నప్పుడు చెప్పిస్తారు. కొందరు భక్తులు తమకు మంచి జరగాలని కోరుకుంటూ తమ ఇళ్లలో మూడేండ్లకు, ఐదేండ్లకు, ఏడేండ్లకు, పదేండ్లకు ఒకసారి పట్నం కడుతామని (మల్లికార్జున స్వామి పెళ్ళి) మొక్కుకుంటారు.



ఆ మొక్కును చెల్లించడం కొరకు ఒగ్గు కథను చెప్పిస్తారు. కొంత మంది పండుగలు, జాతర సమయాల్లో ఒగ్గుకథను చెప్పిస్తారు. మల్లన్న పండుగ సమయంలో (ఉగాది, సంక్రాంతి, మహాశివరాత్రి సందర్భంలో మల్లన్న గుడి ముందు ఒగ్గుకథను చెప్పిస్తారు.

అలాగే కుటుంబ సభ్యులలో ఎవరైనా చనిపోయినపుడు కూడా వారి ఆత్మశాంతి కోసం వారికిష్టమైన ఒగ్గుకథను చెప్పిస్తారు. ప్రస్తుత రోజుల్లో వివిధ ఉద్యోగాలలో ఉన్నవారు పండుగల సమయాలలో తమ బంధువులు, మిత్రులను ఆహ్వానించి ఒగ్గుకథను చెప్పిస్తారు. దీని ద్వారా వారికి దైవభక్తిని చాటుకోవడంతో పాటు మర్యాదల కోసం ఈ ఒగ్గుకథను చెప్పిస్తారు.

**ఒగ్గుకథ ప్రదర్శన విధానం :** కథను ప్రారంభించడానికి ముందు ఒగ్గుకథా బృందంలోని ఇద్దరు సహాయకులు ఒకరు ఒగ్గుడోలును, ఇంకొకరు పెద్ద తాళాలను గట్టిగా వాయిస్తూ కథ ఏ ప్రాంతంలో చెప్పబడుతుందో ఆ ప్రాంతం పేరు చెబుతారు. ఈ వాద్యాలు విన్నవెంటనే ప్రజలు ఒగ్గుకథ చెప్పబడే ప్రదేశానికి చేరుకుంటారు. ప్రేక్షకులందరూ వచ్చిన తరువాత మొదట ప్రధాన కథకుడు తరువాత వంతులు వాద్యకారులు వేదిక మీదకు వస్తారు. వేదిక మీద పసుపు, కుంకుమ చల్లి, కొబ్బరికాయలు కొట్టి అగరువత్తులు వెలిగించి కథను ప్రారంభిస్తారు. కథను ప్రారంభించేటపుడు ప్రధాన కథకుడు మరియు ఇద్దరు సహాయకులు అతని ప్రక్కన ఉంటారు. యాదవుల కులదేవత అయిన గంగాదేవిని ఇలా ప్రార్థిస్తాడు. సహాయకులు వంత పలుకుతూ ఉంటారు.

**"శరణు శరణు మాయంబా రాణీ – శంబావోరాణి! శాంబావోరాణి**
**కరుణ జూడు మాకన్నాతల్లీ – గంగా రావమ్మా దేవి మాయమ్మ**
**॥శరణు॥**
**ముందుమ్మా యాదవుల – మూలాలివమ్మా మూలలివమ్మా**
**మందలోన మేల్కొన్న – మాసౌదలమ్మా మా సౌదలమ్మా**
**దోడా పట్నము లేచి – దొనకొండ నిలిపి దొనకొండ నిలిపి**
**దొరకొండ పూజలు కొన్న – దొలవీర గంగా దొలవీర గంగా**
**గంగా రావే గంగా – జాలారి గంగా జాలారి గంగా**
**గంగా నిన్ను కొలిచేటి – ఘనులెవ్వరమ్మా ఘనులెవ్వరమ్మా**
**గనమైన మట్టేవాడా – గంగ చెలికాడు కాటమరాజు ॥శరణు॥**

గంగా ప్రార్థన అయిపోయిన తర్వాత గంగా ప్రార్థనకు గల కారణాన్ని గురించి ప్రధాన కథకుడు ఈ విధంగా చెబుతాడు. **"ఈ గంగనెందుకు ప్రార్థించాలంటే గంగవల్ల రుతుగా వర్షాలు పడ్తున్నాయ్, హనువుగా పంటలు పండుతున్నాయి, గంగా కరుణించక పోయినా రుతుగా వర్షాలు పడకపోయినా అనువుగా పంటలు పండకపోయినా ఏగవర్నమెంటైనా ప్రజల కష్టాల కడతేర్చదు. కాబట్టి గంగ ప్రార్థన అవసరముంది"** అని చెప్పి తరువాత విఘ్నేశ్వరుని – ఇలా ప్రార్థిస్తారు.

**"ఆది గణాధిపతీ ఆనందామూర్తీ ఆనందామూర్తి**
**ఆది గణాధిపతీ ఒనరైన మూలశక్తి**
**ఆది గణాధిపతీ అందమైన మూలశక్తీ ॥ఆది గణాధిపతీ॥**
**ఎలుక వాహన మెక్కితివయ్యా ఏడు లోకములు తిరిగితవయ్యా**
**తొండముతో నీళ్ళు తెచ్చి తొరంబు బొజ్జాలు కడిగి"**
**॥ఆది గణాధిపతీ॥**

ఆ తరువాత కథను ఈ విధంగా ప్రార్థిస్తారు

**"ఆ దేవి దండామా భూదేవి దండామా**
**లోకాల శంకరా పదివేల దండామా**
**మొక్కిన బూదేవతా మోక్షము నీమ్మా – మాదేవుడు మల్లయ్య**
**విద్యానేర్పిన గురువులకు దండామా"**

ఈ విధంగా దైవ ప్రార్థన చేసిన తరువాత తాము తిరిగిన ఊర్ల పేర్లను ప్రస్తావిస్తాను. తాము కథ చెబుతున్న ఊరిని గురించి, కథ చెప్పిస్తున్న వారిని, వారి తల్లిదండ్రుల పేర్లను వారి వంశ గౌరవాన్ని కీర్తిస్తారు. ఆ తరువాత ప్రధాన కథకుడు కథను ప్రారంభిస్తాడు. ఇతడు కథను వచనంలోనూ, గేయరూపంలోనూ చెబుతాడు. గేయరూపంలో రాగయుక్తంగా చెబుతూ ఉంటే వంతలు **"రామ రామ రామా రామా ఓయ్‌రామా"** అంటూ వంత పాడుతుంటాడు.

**ఒగ్గుకథలో ముగింపు :** కథ చెప్పడం పూర్తి అయిన తర్వాత కథకులు మంగళం పాటతో ఒగ్గుకథను ముగిస్తారు. మంగళం పాట కథను బట్టి మారుతూ ఉంటుంది. మల్లన్న కథను చెప్పినపుడు కింది విధంగా మంగళం పాటను పాడుతారు.

**"ఆరతివ్వారే మంగళ హారతివ్వారే –**
**గురుడా శ్రీశైలవాసా ఇదిగో నివాళి**
**పూలేమో పూసినాయి పూజచెయ్యరే**
**వరంబాయి సారికెల్లా చారీచెప్పరే**
**సిత్తారు చాపిన సిరి మేడలమ్మకు సత్యమైన గొల్ల కేతమ్మకు**

**మండలము మండలము మాదేవ మండలము**
**మండలము ఏలేటి మల్లయ్యడు**
**పుట్ట మీది కొమ్మా పూదరించిన కొమ్మ –**
**అండ్లదే ఓ కొమ్మ ఆరతుల కివ్వంగ**
**ఎల్ల పర్వతాల మల్లయ్యకూ – మాయింటి మావురాలెల్లమ్మకూ**
**చిన్న చెంబుతో నీళ్ళు చీకాయ ఉత్కాలు –**
**అల్లాలు, బెల్లాలు, అరటి పండ్లూ**
**జయ మంగళమిస్తూ శోమంగళం జైత**
**మంగళమిస్తూ శో మంగళం" ॥ఆరతివ్వాలి॥**

ఈ విధంగా ఒగ్గు కథను గంగాదేవి ప్రార్థనతో కథను ప్రారంభించి మంగళంతో కథను ముగిస్తారు. ఒగ్గు కథ ప్రధానంగా కథాఖ్యాన జానపద కళ అయినప్పటికీ ఇతర జానపద కళలైన బుర్రకథ, మందెచ్చులకథ కథలో కేవలం వంతల సహాయంతో కథను మాత్రమే చెబుతారు. కానీ ఒగ్గుకథలో ప్రధాన కథకుడు కథను చెబుతున్న సన్నివేశానికి అనుగుణంగా స్త్రీ పాత్రధారి, వంతలుగా ఉన్న సహాయకులు వాద్యకారులు, ప్రధాన కథకుడూ అందరూ తాత్కాలికంగా ఆ సన్నివేశంలో వచ్చే పాత్రలుగా మారిపోయి తమ నటనా కౌశలంతో ప్రేక్షకులకు నాటకం చూస్తున్న అనుభూతిని కలిగిస్తారు.

**2. మందెచ్చు కథ స్వరూప స్వభావాలు – చరిత్ర :**

**మందెచ్చు అనే పేరు ఎలా వచ్చింది** : మందెచ్చుల వారిని గూర్చి ఒక వింత కథ ప్రచారంలో ఉంది. ఒక గ్రామం పొలిమేరల్లో ఒక గొర్రెలమంద ఉండేది. ఆ మందకు ఒక గొల్లవాడు యజమానిగా ఉండేవాడు. ఆ గ్రామంలో ఊరిముందుండే గుడిసెలో నివసించే శారదకాంద్ర స్త్రీకి ఆ గొఱ్ఱెలమంద పెద్దకు రహస్యంగా సంబంధం ఏర్పడింది. ఆమె గర్భం దాల్చింది. ఆమె కులం వాళ్ళు ఆమెను వెలివేశారు. ఆమెకు ఆ మందవద్దే తొమ్మిది నెలలు ఎట్లాగో గడిసిపోగా ఒక పిల్లవాణ్ని ప్రసవించింది. అపుడు మందవద్ద ఉండే గొల్లలు దయతో ఒక పోడలున్న మేకపిల్లను, పోతును ఇచ్చారు. ఆ పిల్లవాడు ఆ మందవద్దే అక్కడుండే ఉచ్చుల్లో, రొచ్చుల్లో పెరిగి పెద్దవాడయ్యాడు. మందుచ్చలో పెరగడం వల్ల మందొచ్చోడని, పొడలున్న పోతును పెంచడం వల్ల పొడపోతుల వాడని అతనికి పేరు వచ్చిందట. అతని సంతతి వాళ్ళకి పొడపోతుల వాళ్ళు, మందొచ్చు అనే పేర్లు కాలక్రమేణా రూఢికెక్కాయని మందెచ్చుల వారి కథనం.

**ప్రముఖమైన మందెచ్చు కథలు :**

**యాదవులకు సంబంధించిన కథలు** : గొల్లలు పుట్టిన కథ – 1) పెద్దిరాజు–పెద్దమ్మ కథ 2) సింహాద్రి రాజు కథ 3) పోలురాజు కథ 4) కాటమ రాజు కథ 5) కళ్యాణరాజు కథ 6) బత్తిరన్న కథ 7) ఎర్రన్న కథ 8) చిలుక పుట్టిన కథ 9) బొల్లావు కథ 10) బసవన్న కథ 11) గంగురాజు కథ 12) బాయమ్మ కథ.



**మందెచ్చు కథ చెప్పు సందర్భాలు :** యాదవుల ఆశ్రితులైన మందెచ్చులు క్రమంగా కథలవల్లనే జీవనం చేస్తూ సంచార జీవులైనారు. తమ గుడిసెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, కోళ్ళు, భార్యపిల్లలు వస్తుసామగ్రి, వాద్యాలు పెట్టెలు అన్నీ ప్రయాసలతో బండ్లమీద చేరవేస్తూ గ్రామ గ్రామం తిరుగుతూ జీవనం గడుపుతారు.

వీరు ఒక గ్రామాన్ని రెండేళ్ళకోసారి దర్శించి, కథలు చెప్పి యాచనం చేయడం వీరికి ఒక నియమం. ఆయా గ్రామాల్లోని చనిపోయిన పెద్దల పేరు మీదుగా బొమ్మలు ప్రదర్శిస్తూ కథలు చెబుతారు. మరియు వారి గొర్రె, మేకల మందలు హెచ్చించాలని యాటలను బలిచ్చి బలి చల్లుతారు. వీరు ఆయా గ్రామాలను ఆస్తిగా పంచుకొని తమకుండే వతన్ (పరిధి) గ్రామాల్లో మాత్రమే తిరుగుతూ ఉంటారు. మందెచ్చు స్త్రీలు కూడా వంతలుగా, వాద్యాల వాళ్ళుగా ప్రదర్శనలో సాయం చేస్తూ ఉంటారు. పురుషులు కథలు చెప్పుతూ ఉంటే స్త్రీలు కమ్మని గొంతుతో పాడుతూ తాళమో, డోలో కొడుతూ కథలో పాల్గొంటారు.

**మందెచ్చు కథ ప్రదర్శన విధానం :** వీళ్ళు కథా ప్రారంభానికి ముందుగా శారదను, గణపతిని, గంగను, శ్రీకృష్ణుడిని వివిధ క్షేత్రాల మల్లన్నలను తదితర ప్రాంతీయ దైవాలను ప్రార్థించి కథ చెప్పడం ప్రారంభిస్తారు.

**ఆ దేవతా నీకు దండామ ॥2 సార్లు॥**
**మా దేవతా నీకు దండామ ॥2 సార్లు॥**
**అయిలోని మల్లన్న నీకు దండామా ॥2 సార్లు॥**
**కొమ్మాల నరసింహా నీకు దండామా ॥2 సార్లు॥**

మందెచ్చు వాళ్ళ దగ్గర కథలకు సంబంధించిన చెక్క, మట్టితో చేసిన బొమ్మలు వంద నుండి దాదాపు వెయ్యివరకు ఉంటాయి. ఒక్కొక్క బొమ్మ చూపిస్తూ సందర్భానికి తగిన పాటలు, వచనం చెప్పటం ఉంటుంది. వీరి బొమ్మలకు నకాశీవాళ్ళు రంగులు వేస్తారు. ఈ బొమ్మలకు ఐదేండ్లకొకసారి రంగులు వేస్తారు. వీరి బొమ్మలకు రంగులు వేసేందుకు సుమారు 500 నుండి 1000 రూపాయల దాక ఖర్చు అవుతుందని చెప్పారు.



**III. సాహిత్యాంశాలు – భాషా మాండలికాలు :** శంకుబియ్యం పాటలో 'అల్లోనేరడల్లా' అను అర్థ రహిత పదం పదే పదే వంతగా వస్తుంది. ఇది పాటకొనసాగింపు కోసం 'ఉయ్యాల' అనే విధంగా కనిపిస్తుంది.

'సువ్వీ సువ్వన్నలారా సువన్నలారా', 'ఓబియల్లా' రేలి రేలా రేలి రేలా' ఈ పాటలన్నింటికి కర్త ఎవరో తెలియదు. జానపద గేయాల విధంగా వ్యాకరణాంశాలు కూడా అంత ప్రత్యేకంగా పాటించడం జరుగదు. అటువంటి వాటిని కొన్నిటిని పరిశీలిస్తే 'మల్లుమేడలదేవి పెళ్లిళ్ళ కొరకు అల్లోనేరడల్లా' అనే పదంలో 'పెళ్ళిల్లు' అనేది ఏక వచనం వాడదలసిన స్థానంలో బహువచనం కనిపిస్తుంది ఆ బహువచనం కూడా 'లు' కారం వాడకుండా 'ల' కారం వాడి బహువచనాన్ని చూపిస్తున్నారు. ఉదా:- పెళ్ళి – పెళ్ళిల్ల

**– అలాగే పదాది 'అ' కారం 'వ' కారంగా మారుతుంది.** ఉదా: పెండ్లాడితివమ్మా / అమ్మా – ఇందులో 'అ' కారం 'వ' కారంగా మారుతుంది.

**– పదాది 'క' కారం 'గ' కారంగా మారుతుంది** ఉదా : కొయ్యలు – గొయ్యలు

**– శ, ష, స, ల మార్పిడి :** ఉదా : సోభానము

**– సంబోధన అక్షరాలు :** ఉదా : ఓనామల్లయ్య, మొరాంద

**– దీర్ఘాధిక్యత :** ఉదా : కుమ్మరి – కుమ్మారి, మంగళగిరి – మంగాళగిరి

**– పదాంతదీర్ఘం :** ఉదా : బాజ – బాజా

కొన్ని సందర్భాలలో కుల సంబంధమైన విషయాల్లో ఈ క్రింది విధంగా పలకడం జరుగుతుంది. ఉదా : వెలగందులను – ఎలగందుల – వెలగందుల అని పిలుస్తారు.

పైవే కాకుండా ఇంకా అలంకారాలు, సామెతలు, అన్యదేశ్యాలు, మాండలికాలు మొదలగు వ్యాకరణ సంబంధమైన విషయాలను గుర్తించవచ్చును.



**ఒగ్గు కథ మందెచ్చుల కథ వలన సామాజిక ప్రయోజనం :**

జీవితాన్ని దర్శింపజేసేదే 'కళ' అని అరవిందయోగి అన్నారు. జానపద ప్రదర్శన కళలు కేవలం ఆనందం కోసమే కాకుండా, బాహ్య ప్రపంచ జీవన విధానంలో వారి ఆలోచనలను ప్రభావితం చేసి అభ్యుదయ పథంలో పయనింపజేయదానికి దోహదం చేస్తాయి. మొదట పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక కథాగానంతో ప్రజలకు ఆనందాన్ని, ఉపదేశాన్ని అందించిన ఈ కళారూపాలు అనేక మార్పులకు లోనయి నిత్య నూతనంగా కొనసాగుతుంది. వీటి ద్వారా సామాజిక జీవనానికి సంబంధించిన పుట్టుక, తొట్టెల, పిల్లల పెంపకం, నగలూ, వస్త్రాలు, పెళ్లి పేరంటాల విశేషాలు, వంటలు–పంటలు, ఆయా వృత్తులకు సంబంధించిన అంశాలు దేవుళ్ళు ఆయా దేవీదేవతల ఉత్సవాలు ఇలా అనేక అంశాలు ఒగ్గుకథలో, కథాకథనంలో బహిర్గతమై కుటుంబ దృష్టిని, సామాజిక దృష్టిని పెంచి మనిషి ప్రవర్తనలో పరివర్తనను తెచ్చిపెడుతుంది.

**ముగింపు :** ఈ విధంగా ఒగ్గుకథ, మందెచ్చుల కథ తెలంగాణ మాండలిక పదాలు కనుమరుగై పోకుండా కంటికి రెప్పలా కాపాడుతూ, జారిపోతున్న జానపదుల ఆచార వ్యవహారాలు పల్లె సంస్కృతిని ఒగ్గుకథ సంరక్షిస్తూ ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక మరియు అభివృద్ధి కార్యక్రమాలను ఒగ్గు రూపంలో ప్రచారం చేస్తుంది. నేటికాలంలో ప్రజోపయోగ అంశాలైన కుటుంబ నియంత్రణ, వరకట్న నిసేధం, అక్షర ప్రభ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూమ్ పథకం, మరుగుదొడ్ల పథకం, స్వచ్ఛ భారత్, హరితహారం వంటి కార్యక్రమాలను ప్రజలకు చేరవయ్యే విధంగా ఈ కళారూపాల ద్వారా ప్రాచుర్యం చేయిస్తుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 (49) UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2023

# తెలంగాణ గిరిజన తెగల కథలు – సామాజిక చిత్రణ

**అజ్మీరా సుజాత,** పరిశోధక విద్యార్థిని, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 99894 07505

ఆధునిక తెలంగాణ కథా సాహిత్యం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. గిరిజన సమస్యలు, గిరిజన స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకొని తెలంగాణ కథారచయితలు గీతాంజలి, జాతశ్రీ, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పి.చంద్, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), గోపిభాగ్యలక్ష్మి మొదలైన వారు స్త్రీల కథా సాహిత్యాన్ని వెలువరించారు. కొంతమంది తెలుగు ప్రాంత రచయితలు తెలంగాణ ప్రాంత గిరిజన స్త్రీల జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు చేశారు. వారిలో ఎ.విద్యాసాగర్, ఫణికుమార్, కేశవరెడ్డి మొదలైన వారు ముఖ్యులు. ఇంకా పూర్తిగా గిరిజన సంస్కృతి, చరిత్ర, సాహిత్యం పైన పరిశోధనలు, రచనలు రావాలి.

తెలంగాణలోని చెంచులు, ఎరుకలు, యానాదులు (అనాదులు) లంబాడీ, గోండులు మొదలైన గిరిజన తెగలు తెలంగాణలో ఎప్పటినుంచో జీవిస్తున్నట్టు ఆదారాలున్నాయి. 20వ శతాబ్దిలో కథా సాహిత్యం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది ఈ నేపథ్యంలో గిరిజనుల సమస్యలు, గిరిజన స్త్రీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని కథా రచయితలు, రచయిత్రులు అనేక కథలు రచించారు. గిరిజన సంస్కృతిలో గిరిజనేతర ప్రమేయం ఏర్పడినప్పటి నుండీ స్త్రీలపై హింస, దోపిడీ, లైంగిక అత్యాచారాలు ఎక్కువైనాయి. ముందుగా గిరిజన కథలు తెలుసుకునేముందు వారి జీవన విధానాన్ని స్థూలంగా తెలుసుకుందాం.

సంచారతెగల జీవనసరళినిబట్టి, ఆదిమానవుని జీవనవిధానం, ప్రాచీన కాలంనాటి మానవతెగల అలవాట్లు, సాంప్రదాయికమైన వారి అలవాట్లు, మానసిక స్థితిగతులు మనకు అర్థమవుతాయి, సంచారజాతులు, ఆదిమ తెగలను గురించి తెలుసుకోవడం అంటే, మన పూర్వీకులను గురించి, మనల్ని గురించి మనం తెలుసుకోవడమే.

పుట్టిన ప్రతిప్రాణికీ, ఒక జీవనక్రమాన్ని ప్రకృతి ఏర్పరచే వుంది. మానవుని జీవికకూడా ప్రకృతిని ఆశ్రయించుకొనే వుంటుంది. జీవన విధానంతో పాటు, బుద్ధివికాసం కొన్ని నమ్మకాలు, అలవాట్లు ప్రకృతి పట్ల అవగాహన జంతుజాలంకంటే, మానవ సంతతిలో అభివృద్ధి చెందాయి. జంతువులకంటే, మనిషి మేధస్సు ఉన్నతమైంది కావడమే యిందుకు కారణం. అయితే ఆదిమకాలం నుంచీ, ఆధునికకాలం వరకూ చారిత్రక పరిణామక్రమంలో బుద్ధి కుశలత అభివృద్ధి చెందుతూ, వివిధ దశల్ని అధిగమిస్తూ వస్తున్నది. అయినప్పటికీ ఆదిమతెగల నమ్మక, విశ్వాసాలే సరికొత్త రూపంలో నేటికీ ఆధునిక కాలంలో ఆచరించబడుతున్నాయి.



కొండల్లో, కోనల్లో, అడవుల్లో సంచరిస్తూ మనుగడ సాగిస్తున్న ఆదిమ తెగలు, కాలం గడిచేకొద్ది ప్రకృతి పట్ల కొంత అవగాహన ఏర్పరచుకుంటూ వచ్చింది. ప్రతి తెగకూ కొన్ని అలవాట్లు, నమ్మకాలు, ఏర్పడినవి. 'తెగ' మనుగడకొరకు కొన్ని పద్ధతులు, సంప్రదాయాలు కూడా అలవడినవి.

తెలంగాణలో గిరిజన సంచార తెగల జీవన విధానంలో వైవిధ్యం వున్నది. అయినప్పటికీ సంప్రదాయాలు, అలవాట్లు, నమ్మకాలు దాదాపు ఒకే విధంగా వుంటాయి. పంచాయితీ పద్ధతి, తెగ పెద్దల తీర్పు మన ఆటవిక తెగలకు శిరోధార్యంగా వుంటాయి. పంచాయితీ తీర్పును వ్యతిరేకించడానికి వీలులేదు. ప్రతి ఒక్కరూ యీ తీర్పును పాటించవలసిందే. లేకపోతే కుల బహిష్కారం జరుగుతుంది. ఈ పంచాయితీ విధానం తదుపరి కాలాల్లో 'గ్రామపంచాయితీ'గా అవతరించిందని చెప్పవచ్చును. ఈశాన్య భారతంలోని శాక్యులు, కోలీలు, లిచ్ఛవీలు, ముండాలు, గ్రామ పంచాయితీ పద్ధతిని అనుసరించేవారు. అటు పిమ్మట మౌర్యుల కాలంలో గ్రామ పంచాయితీ అత్యున్నతంగా తీర్చిదిద్దబడింది. ప్రపంచంలో అతి ప్రాచీన కాలం నుంచీ పంచాయితీ పద్ధతిని ఆటవిక, ఆదిమతెగలు అమలు చేసుకుంటూనే వున్నాయి.

ఆటవికుల పంచాయితీ విధానం కేవలం తగదాలు, నేరాలు విచారించడానికి మాత్రమేకాదు. తెగలోని బలహీనులకు నిస్సహాయులకు తగు విధంగా తోడ్పడటం కూడా జరుగుతుంది. తీవ్రంగా వ్యాధిగ్రస్తులైనవారికి, అనాథలకు పంచాయితీ ఉపయోగ పడుతుంది.

బంజారాల్లో పంచాయితీ విధానం కట్టుదిట్టంగా అమలు పరచ బడుతుంది. ప్రతి తండాకు ఒక నాయకుడు వుంటాడు. ఇతనిని నాయక్ అంటారు. తండాలో జరిగే అన్ని విషయాలలో ఈయన తీర్పు, సలహా శిరోధార్యంగా వుంటుంది.

ఎరుకల తెగలో పంచాయితీ తీర్పులు న్యాయబద్ధంగా వుంటాయి. ఎవ్వరైననూ ఈ తీర్పుకు అంగీకరించి, శిరసావహిస్తారు. పంచాయితీని ఒక దైవంగా భావించి, దాని ముందు నిజం ఒప్పుకుంటారు. చెంచులలో కుల పెద్ద సలహాలతో వ్యవహారాలు నడుస్తాయి. ఈయన తెగకు పెద్ద, బుద్ధికుశలత, సమర్ధతగలవారినే పెద్దగా ఎన్నుకుంటారు.

సంచార జాతుల్లో నీతి నిజాయితీలు ఎక్కువ, ఒకరిద్దగర అప్పు తీసుకుంటే, తరతరాలకు కూడా అప్పుతీర్చే బాధ్యత వుంటుంది. నిజాయితీగా అప్పు తీరుస్తారు. తప్పు చేయడం జరిగితే తప్పుచేసినట్లు అంగీకరిస్తారు. నైతిక ప్రవర్తనకు గిరిజనులు పెట్టింది పేరు. ఎట్టి పరిస్థితుల్లోనూ అబద్ధమాడరు. నైతిక సూత్రాలను విధిగా పాటిస్తారు[1].

ఆదిమ గిరిజనుల్లో స్త్రీకి విశిష్ట స్థానం కలదు. స్త్రీలు కూడా పురుషులతో పాటు కష్టపడి పనిచేస్తారు. తెగలో స్త్రీకి సముచిత స్థానం వుంటుంది. భార్యాభర్తలు అనురాగంతో కలిసిమెలిసి జీవిస్తారు. దాంపత్యం కుదరదని భావించితే, అరమరికలు లేకుండా విడిపోతారు. స్త్రీకి రెండవ వివాహం చేసుకొనే స్వేచ్ఛ వుంది. స్త్రీలు నైతిక ప్రవర్తనను అనుసరిస్తారు.

అతిథులను గిరిజనులు ఆదరంతో చూస్తారు. అతిథిపట్ల గౌరవం, మర్యాద పాటిస్తారు. పశుసంపద కలిగిన గిరిజనులు ఇంటికి రావడంతోనే అతిథికి పాలుగానీ, మజ్జిగగానీ యిస్తారు.

మతపరంగా గిరిజనులకు నమ్మక, విశ్వాసాలు ఎక్కువ. కొండదేవతల్ని, అడవి దేవతల్ని పూజిస్తారు. తమ జీవనం సుఖశాంతులతో గడపడానికి దేవతలు తోడ్పడతారని నమ్ముతారు. జాతర్లుచేసి, ఉత్సవాలు చేస్తారు.

గిరిజనులకు వైద్య పరిజ్ఞానం ఎక్కువ, వీరు సంచరించే అడవుల లోని వనమూలికల్ని సేకరించి, వాటి ద్వారా వైద్యం చేస్తారు. అడవుల లోని ప్రతి చెట్టూ, మొక్క, ఆకు విలువ వారికి తెలుసు, ఎంతటి వ్యాధినైనా వీరు వనమూలికలతో నయం చేసుకుంటారు.

గిరిజనులు సంగీత ప్రియులు, సాంస్కృతిక కార్యక్రమాలన్నీ వీరు బహు ఉత్సాహంతో జరుపుకుంటారు. పండుగలు, ఉత్సవాలు, వివాహాల సమయంలో గిరిజనుల సంప్రదాయకమైన నృత్యాలతో, ఆటపాటలతో ఆనందంగా కాలం గడుపుతారు. 'థింసా' నృత్యం ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. స్త్రీలు పురుషులు కలిసిమెలిసి నృత్య, వినోదాల్లో పాల్గొంటారు. వీరు స్వేచ్ఛాప్రియులు, స్వచ్ఛమైన జీవనం వీరిది. గిరిజన, సంచార తెగల్లో కృత్రిమత్వం మచ్చుకైనా కనిపించదు. వీరికి ఆడంబరాలు గిట్టవు. పటాటోపాలు వీరు పాటించరు, కుట్రలు, కుతంత్రాలు వీరికి తెలియవు, గిరిజనులు నీతి, నిజాయితీకి, స్వచ్ఛమైన జీవనానికి, నైతిక ప్రవర్తనకు ప్రతిబింబంవంటివారు. నిర్మలమైన, నిష్కల్మషమైన గిరిజనుల జీవనవిధానం మెచ్చతగింది. వీరి జీవనవిధానం నుంచి ఆధునిక నాగరికులనుకునేవారు నేర్చుకోవలసింది ఎంతైనా వుంది.

**గిరిజన తెగల కథలు :**

**తెలంగాణ గిరిజన తెగలు- నివసించు జిల్లాలు- భాషలు**

1. నాయక్‌పోడ్లు – ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం- తెలుగు
2. అంధ్, ఆదిలాబాద్ – మరాఠీ, తెలుగు
3. హిల్‌రెడ్డి – ఖమ్మం జిల్లా తెలుగు
4. చెంచులు – మహాబూబ్‌నగర్
5. ప్రధానులు – ఆదిలాబాద్ – మరాఠి, తెలుగు
6. కొండరెడ్ల – ఖమ్మం – తెలుగు
7. ఎరుకలు – తెలుగు రాష్ట్రాలలోని అన్ని మైదన ప్రాంతాలలో నివసిస్తున్నారు – తెలుగు
8. గోండు/ నాయక్, ఆదిలాబాద్ – గోండి, తెలుగు
9. కోయలు – ఖమ్మం, తెలుగు వరంగల్
10. లంబాడీలు – తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాలు
11. కొలామిలు – ఆదిలాబాద్, తెలుగు
12. తోటి – ఆదిలాబాద్ – గోండి, తెలుగు

గిరిజనుల కథా సామ్రాజ్యంలోని సంస్కృతి, సంప్రదాయాలు అవగాహన చేసుకోవడం కష్టమే అయినా అక్కడ జంతువులు మాట్లాడతాయి. పరోపసేవకులుగా పనిచేస్తాయి. పులి, ఎలుగుబంటి మొదలైన క్రూర జంతువులు పరోపకారం చేస్తాయి. పాము, తేలు, స్నేహాన్ని కాంక్షిస్తాయి. అడుగడుక్కి చిత్రాన్నలా కనిపించే అద్భుతమైన పాత్రలు గిరిజన కథలలో కనిపిస్తాయి. హాస్య కథలైనా కథనమే ప్రయోజనంగా గల కథలే అయినా ఏ రకమైన కథయినా మనకు విచిత్రమైన, ప్రగాఢమైన అద్భుతాన్ని చూపిస్తాయి.

శ్రీకాకుళం, తెలంగాణ రైతాంగ ఉద్యమాలకు మరో ముఖం గిరిజన రైతాంగ పోరాటాలు, మైదాన ప్రాంత పోరాటాలకూ జరిగిన పోరాటాలకూ స్పష్టమైన తేడా ఉంది. తరతరాలుగా దోపిడీ, పీడనలకు గురవుతూ కూడా నోట్లో నాలుక లేనట్టే బతుకులీడుస్తున్న గిరిజనులకు గిరిజన రైతాంగ పోరాటాలెంతో మనోధైర్యాన్నిచ్చాయి. బాసటగా నిలిచాయి. శ్రీకాకుళ రైతాంగ పోరాటాలను గిరిజన పోరాటాలనే అనవచ్చు. ఈ పోరాటాల ప్రభావంతో తెలుగులో అంతకుముందు దాదాపుగా జోలికి కూడా పోని గిరిజనుల గూర్చి చక్కని కథలొచ్చాయి. వస్తు సేకరణలో పోరాటాలు గొప్ప మార్పును తీసుకొచ్చాయని చెప్పడానికి ఇటీవలికాలంలో గిరిజనుల గూర్చి వచ్చిన కథలు గొప్ప ఉదాహరణలు.

గిరిజనుల గూర్చి తెలుగులో వచ్చిన మొట్టమొదటి కథ చింతా దీక్షితులు రాసిన సుగాలీ కుటుంబం. ఇతడే రాసిన మరి రెండు

కథలు దాసరి పాట, చెంచురాణి. ఇవి ఉద్యమ కథలు కాకున్నా గిరిజన కుటుంబం అనుభవించే దుర్భర పేదరికాన్ని గూర్చి చెప్పిన మంచి కథలు. శ్రీకాకుళ గిరిజన పోరాటాల గూర్చి రాసిన, తెలుగులో దీక్షితులు తర్వాత గిరిజన కథలు రాసిన రచయిత భూషణం. ఈతడు రాసిన అడివంటుకుంది, పులుసు, కొండగాలి కథలు శ్రీకాకుళ గిరిజన పోరాటాలకు దర్పణాలు. అప్పల్నాయుడు రాసిన పువ్వుల కొరడా, పోడు-పోరు, ప్రజాకోర్టు, వంట కథలు గిరిజన బతుకుల్లోని వెతలను, వాళ్ళపై మైదాన ప్రాంతాలవారి దౌర్జన్యాన్ని, అడవిదొరల జులుంను, గిరిజనుల పోరాట పటిమను తెలిపే కథలు.

సంఘ చైతన్యంతో సాయుధులై ప్రతిఘటించి భూమిని దక్కించుకున్న విషయాన్ని చిత్రించిన కథ సాహు రాసిన 'మనం తుడుంగొట్లాలె..' గిరిజనబంధు సాహు గిరిజనుల జీవితాలను చిత్రించే రేఖాచిత్రాలనదగిన చక్కని కథలు రాసాడు. గిరిజనుల నేతికథ కూడా కన్నీటికథ ఎలా అయిందో వివరించే నేటికథ – కన్నీటి కథ, గిరిజనుల్లోని ఆచారవ్యవహారాలను, మూఢనమ్మకాలను, అప్పుల స్వభావాన్ని చిత్రించే కథలు పెళ్ళికావాలి, వాయిదా, అయిదు రూపాయల కథ. సాహు రాసిందే మరో ప్రసిద్ధ కథ రక్తపింజర, గిరిజన రైతాంగ పోరాటంలోని భాగమైన కొన్ని యథార్థ సంఘటనలను చిత్రించిన కథ రగల్ రాజ్జెంమైనాసివాకట్. దీని రచయిత తొడసం జంగు. విప్లవ పోరాటంలో తలమునకలవుతున్న వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచే కథ కొమురంభీం, చుదూర్ రాసిన 'తేనెటీగలు'. సంస్కరణోద్యమ కాలంనాటి కథల్లో వీరేశలింగం నాయకుడుగా చిత్రింపబడితే, శ్రీకాకుళం గిరిజన పోరాటకథల్లో సత్యం మాస్టారు, ఆదిలాబాద్ జిల్లా గిరిజన పోరాట కథల్లో పొరకల సారు నాయకులుగా చిత్రింపబడ్డారు. గిరిజనులపై వచ్చిన కథల్లో బి.యస్.రాములు రాసిన అడవిలో వెన్నెల కథ ఉత్తమోత్తమమైనది. ఈ కథ ఆదిలాబాద్ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను, జీవితాలను, పోరాటాలనుగూర్చి చెబితే ఈ రచయితే రాసిన మరో కథ అడవిలో వెన్నెల-2 మన్యం ప్రాంత గిరిజనుల గూర్చి చెప్పే కథ. గిరిజన స్త్రీ బతుకులోని విషాదాన్ని తెలిపే కథ గోపి భాగ్యలక్ష్మి రాసిన జంగుబాయి. తెలంగాణ నుంచి సాహు, బి.యస్.రాములు, కోస్తా నుంచి భూషణం, అప్పల్నాయుడు గిరిజనులపై గిరిజనోద్యమాల ప్రభావంతో చక్కని కథలు రాసారు. రాయలసీమ నుంచి గిరిజనులపై కథలు వచ్చిన దాఖలాలు లేవు. బెంగాలీలో మహాశ్వేతదేవిలా గిరిజన సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేయాల్సిన అవసరముంది.

**ఆకలి :** కరువు కోరల్లో చిక్కుకున్న గిరిజనులు ఆకలిమంటలతో అల్లాడుతూ ఉంటారు. పోరాటం చేస్తేనే తప్ప ప్రభుత్వం న్యాయం చేయదని నిర్ణయించుకున్న తీరును సాహు 'ఆకలి' కథలో చిత్రించారు. ఈ కథలో కొడుకుని కొమరంభీం దారిలో నడువమని



తల్లి బోధిస్తుంది. పోరాటం చేస్తేనే ఆకలిమంటలు చల్లారుతాయని, చైతన్యంతో తల్లి కొడుకుకి పోరాట స్ఫూర్తిని రగిలిస్తుంది. తల్లి బోధనలతో ప్రభావితుడై తిరుగుబాటు చేయాలని ఈ కథలో కొడుకు గట్టిగ సంకల్పించుకుంటాడు.

**పనిపిల్ల :** దారిద్ర్యంలో మునిగి తేలుతున్న గిరిజనులు వారి పిల్లలు భూస్వామిక వర్గంపై తిరుగుబాటు చేసి తిండి గింజలు సంపాదించుకున్న తీరు చిత్రించిన కథ 'పనిపిల్ల' రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి.

**బియ్యం :** ఈ కథ ఎరుకల తెగకు చెందిన కథ. తాగుడుకు బానిసైన భర్త చాలీచాలని సంపాదనతో కుటుంబ భారాన్ని మోస్తున్న స్త్రీ పూట గడవటానికి పడుతున్న కష్టాన్ని ఉప్పల నరసింహం 'బియ్యం' కథ చిత్రించింది.

**రక్తపింజెర :** రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా తక్కువ కూలీరేట్లు, చెల్లించే సమయానికి ఇంకా తగ్గింపు, స్త్రీ పురుషుల వేతనాల్లో తేడా. ప్రశ్నించిన అమాయకులపై లంచాలకోసం తప్పుడు కేసులు బనాయించే పోలీసు యంత్రాంగం, గిరిజనుల శ్రమను దోచుకునే తీరు సాహు 'రక్తపింజెర'లో వివరించారు.

**యాడి :** యాడి కథను గీతాంజలి రాశారు. పేదరికం కారణంగా ఒక లంబాడీ కుటుంబం పదేళ్ళ పాపనై చిట్టిని ఉద్యోగస్తుల ఇంట్లో పనిచేయడానికి పెట్టడంతో ఆ పాపపడే కష్టాలు, తల్లిని చేరుకోవడానికి చేసే ప్రయత్నాలు మనకు కంటతడి పెట్టిస్తాయి.

**హత్య :** పి.చంద్ రాసిన 'హత్య' కథలో మానభంగానికి గురై హత్య చేయబడిన ఆదివాసి జంగుబాయి కన్నీటి కథ. గిరిజనులపై జరుగుతున్న హత్యలు ఎవరు చేశారో, ఎందుకు చేస్తున్నారో తెలియని పరిస్థితులను ఈ కథ వివరిస్తుంది. హత్యకథ 'భూ నిర్వాసితులు 'కథా సంపుటిలోనిది.

**బురద :** కొండమీదకి పెట్టుబడిదారి పరిశ్రమ విస్తరించి, కృత్రిమ కరువుని సృష్టించాయి. అడవిలో నివసించే మనుషులు అడవిపై

ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల అడవి అంతరిస్తుందని అక్కడున్న గిరిజనుల్ని బయటకు తరిమారు. ఫలితంగా పట్టణాలకు వలస వచ్చిన గిరిజనుల జీవితాన్ని చిత్రించిన కథ 'బురద' అల్లం రాజయ్య రచించారు. ఇది గోండులకు సంబంధించిన కథ.

**బేరం :** పట్నంలో పని ఉంటుంది, డబ్బు బాగా సంపాదించు కోవచ్చు అని నమ్మబలికిన వ్యక్తితో వెళ్ళిన కొత్తజంట, భార్య వ్యభిచార గృహం పాలయిన తీరును ముదిగంటి సుజాతరెడ్డి 'బేరం' కథలో చిత్రించారు.

**బిగిసిన ఆ పిడికిళ్ళు :** కోయల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని భూమిని గిరిజనేతరులు కాజేస్తారు. భూమిని తిరిగి సంపాదించుకోవాలన్న చైతన్యాన్ని, భూస్వాములపై తిరుగుబాటుని శిరంశెట్టి కాంతారావు "బిగిసిన ఆ పిడికిళ్ళు" కథలో చిత్రించారు. కోల్పోయిన భూమిని తిరిగి పొందేవరకు పిడికిళ్ళు బిగిస్తామని పోలీసులకు, అచ్యుతరామయ్యకు చెప్తారు. ఇందులో గిరిజన చైతన్యం కన్పిస్తుంది.

**వెలుగుదారి :** కరువు కోరల్లో చిక్కుకొని పొట్టకూటికోసం కన్నబిడ్డలను వ్యభిచారం చేసి డబ్బులు సంపాదించడానికి పూణెకు పంపే తల్లిదండ్రులు, తదనంతరం విలాస వస్తువుల కోసం బిడ్డలను నరక కూపాల్లోకి నెట్టే విధానాన్ని సుంకోజి దేవేంద్రాచారి 'వెలుగుదారి' కథలో చిత్రించింది.

శ్రమకు తగిన ఫలితం లేదని రిక్షా శ్రామికుడి శ్రమని **"మర్మజలానికి.. ఖరీదు కట్టే షరాబు"** కథలో కాలువ మల్లయ్య స్పష్టం చేశారు. ఒకతను రిక్షాలో మర్చిపోయిన బ్యాగ్ని తిరిగిచ్చి నందుకు, రతన్ దొంగతనం చేసాడని పోలీస్ స్టేషన్లో అప్పగిస్తాడు. ఇరవై రూపాయలు చెల్లించి విడుదలవుతాడు. రిక్షాలో ముగ్గురు ప్రయాణికుల్ని ఎక్కించుకొని చెమటలు కారుస్తూ ప్రమాదాలు తప్పించుకుంటూ వెళితే, ఐదు రూపాయిలకు మూడున్నర రూపాయలు ఇస్తాడు. ధర్మంగా చిందించే ఘర్మ జలానికి సరైన ఫలితం ఎవరు చెల్లించగలరు?. నిజాయితీకి విలువలేదని వాపోతూ నిరాశతో వెళ్లిపోతాడు.

గిరిజనేతరుల చేతిలో మోసపోతూ జీవనం సాగిస్తున్న వైనాన్ని గోపిభాగ్యలక్ష్మి "బతుకు పయనం"లో చిత్రీకరించారు. గోండుల్లో వెనుకపడిన పరదాన్ల తెగకి చెందిన సోము ఎద్దుల బండి నడుపుతాడు. గిరిజనేతర సమాజం చేతిలో మోసపోతూ సాగిస్తున్న అడవి బిడ్డల జీవన యానమే "బతుకు పయనగాథ". కష్టపడుతున్నా ఫలితం లేకపోవడం, గోండులు నివాసముంటున్న ప్రాంతంలో గిరిజనేతరులైన మరాఠాలు, దళితులు వచ్చి కొంత భూమిని సంపాదించుకొని షావు కార్లుగా చలామణి అవుతుంటారు. జగ్గయ్య షావుకారుగా ఈ ప్రాంతంలో గోండులనే పాలేర్లుగా నియమించుకొని ముగ్గురు భార్యలతో, ధనధాన్యాలతో తులతూగుతుంటాడు. ఆదిలాబాద్ అడవుల్లో ఉన్న గోండు తిరుగుబాటు వారి జీవితంలో తిరిగిన మలుపుచుట్టు పక్కల వ్యాపించింది అని గోండు తెగల గురించి డా॥అల్లం రాజయ్య మలుపు కథలో స్పష్టం చేశారు.

కష్టాల నుండి బయట పడటానికి తిరుగుబాటు ధోరణి పరిష్కారంగా భావించిన తీరు బి.ఎస్.రాములు "అడవిలో వెన్నెల"లో చూపించారు. రిజర్వు ఫారెస్టులో ఫారెస్టు అధికారులు ఇస్రూ ఇంటిపై దాడి చేస్తారు. ఇస్రూ కుర్దూని ఆశ్రయిస్తాడు. కుర్దూ కామ్రేడ్ అన్నని ఆశ్రయిస్తాడు. కామ్రేడ్ అన్నల చేతిలోని తుపాకి అడవి జంతువుల్నే కాదు, పీడించే మనుషుల్ని చంపగలదని గిరిజనులందరు అనుకొంటారు. ఇదే అడవిలో ఎదురౌతున్న సమస్యలు ఎదుర్కోడానికి వారికి పరిష్కారం దొరికినట్లేతుందని రచయిత వివరించాడు. తండాలోని లంబాడీలను పోలీసులు చితకబాదిన వైనాన్ని "ముట్టడి" కథలో ముదిగంటి సుజాత రెడ్డి చిత్రించారు. మెగ్యానాయక్, తండా నివాసులందరూ పోలీసులు చేసిన గాయాలతో బాధపడుతుంటారు. రాత్రి తుపాకులతో వచ్చిన వాళ్ల ఆచూకీ చెప్పమని పోలీసులు వేధిస్తారు. అందరు వాళ్ళు ఎక్కడుంటారో తెలియక మౌనంగా ఉంటారు. లంబాడీల నుండి సమాధానం రాకపోయేటప్పటికి గుడెసెల్లోని వస్తువులు, ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తారు. అడ్డువచ్చిన వారిపై లాఠీలు ఝుళిపించన వైనాన్ని రచయిత్రి వివరించారు.

ఆదివాసీలు గిరిజనులు అడవుల్లో ఉండి అపార సంపదను సేకరించిన దాన్ని దళారుల బారిన పడకుండా ప్రభుత్వం కొని వారికి ఆసరాగా నిలుస్తుంది. ప్రస్తుతం కొన్ని భాషలకు లిపి లేదు. ఆ ప్రయత్నము ప్రస్తుతం జరుగుతుంది సాహిత్య సంపద, వారి ఆచారాలు పద్ధతులు జీవనవిధానం ప్రత్యేకంగా 'రికార్డు' చేయవలసిన అవసరం ఉంది. వాళ్ళు గొప్ప కళాకారులు వాళ్ళ కళలను కూడా భద్రపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. భారతదేశం సహజ సిద్ధమైన ఆయుర్వేదానికి ప్రసిద్ధి. ఈ ఆకుల పసరులు, ఆహారపు గింజలు ఔషధ గుణాలు ఆదివాసీలకు తెలిసినంతగా మనకు తెలియదు. ఈ నేపథ్యంలో ఆటవిక వైద్యవిధానాన్ని, ఆయా మొక్కల జాతుల వైద్య లక్షణాలను ప్రస్తుతం 'ఆయుష్' సంస్థ సేకరించి గ్రంథస్థం చేస్తున్నా ఇంకెంతో మిగిలే ఉంది. దీనికి స్వచ్ఛంద సంస్థలు, పరిశోధకుల అవసరం ఉంది. గిరిజనుల సంస్కృతి, గిరిజన పోరాటాలు, గిరిజన సమస్యలు తెలంగాణ కథా సాహిత్యంలో గిరిజన జీవితాలను చిత్రించిన కథల ఇతివృత్తాలను పరిశీలనచేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు, భాష రోజు రోజుకి అంతరించి పోతున్నాయి. ఈ సంస్కృతిని సాహిత్యాన్ని పరిరక్షించుకోవడం కొరకు గిరిజనులు ప్రజా ప్రతినిధులు మరియు ఇతర సమాజాలు నడుం బిగించాయి.

# డి.కె. చదువుల బాబు బాల కథా సాహిత్యం – బాలవికాసాంశాలు

**జి. అశోక్ కుమార్,** పరిశోధక విద్యార్థి, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. ఫోన్ : 95424 14559

నేటి బాలలే రేపటి పౌరులు. నేటి బాలల ఆలోచనలు, మానసిక వికాసాలే రేపటి దేశ అభివృద్ధి దోహదకాలు. అందుకే బాలల యొక్క ఆలోచనా శక్తిని, నైతిక విలువలను మానసిక వికాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. పిల్లలకు అందించాల్సిన మంచి విషయాలను పద్యాలు, కథలు, కవితలు, గేయాలు ద్వారా ఆకర్షణీయంగా చెప్పడం వలనవారు ఎక్కువ కాలం గుర్తుంచుకుని మార్పుచెందే అవకాశం ఉంది.

బాలసాహిత్యం విజ్ఞానానికి సోపానం. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు ఉండేవారు. పిల్లలకు అనేక విషయాలు కథల రూపంలో చెప్పేవారు. నేడు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి. ఉరుకు పరుగుల జీవితం అయ్యింది. మరి పిల్లలకు మంచి జీవితానికి ఉపయోగపడే మంచి విషయాలు చెప్పి, వారి నడవడికను, అలవాట్లను ఎవరు తీర్చిదిద్దుతారు? మంచి విషయాలు పిల్లల మనసులో బలంగా నాటుకుపోవాలంటే, పిల్లల్లోని అంతర్గత శక్తులను బయటకుతీసి మనోవికాసాన్ని కల్గించాలంటే, వారి ఆలోచనలు జీవితాన్ని మంచి దారిలో నడిపించాలంటే బాలల సాహిత్యం ఒకటే మార్గం.

బాలలను దేశాభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దడంలో, మంచి సమాజాన్ని రూపొందించడంలో బాలసాహిత్యం ప్రముఖ పాత్ర వహించింది. ఏ దేశంలో బాల సాహిత్యం ఉన్నత ప్రమాణాలు సంతరించుకుంటుందో ఆదేశ భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది. సమాజం సన్మార్గంలో నడవాలంటే బాలల నడవడికను మంచిగా తీర్చిదిద్దాలి. ఈ ఆలోచన నేటికాలంలోనే కాదు ప్రాచీన కాలం నుంచే ఉంది. క్రీ.శ. 6వ శతాబ్దంలోనే అమరా శక్తి అనే రాజు తన పిల్లల యొక్క శక్తిసామర్థ్యాలు, ఆలోచనా విధానాలు మార్చేందుకు విష్ణుశర్మ అనే పండితుని చేత 'పంచతంత్ర కథలు' బోధించి విద్యాబుద్ధులు నేర్పించారు. నేటికి పంచతంత్ర కథలు పిల్లలకు పాఠ్యపుస్తకాలుగా ఉన్నాయి. ఇంకా భేతాళ పంచ వింశతి కథలు, తెనాలి రామకృష్ణ కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, ఈసపు కథలు మొదలైనవి బాలల సాంఘిక వికాసానికి తోడ్పడినవే.

ఆధునిక కాలంలో చాలామంది రచయితలు బాలసాహిత్యం మీద కృషి చేసి బాలల గేయాలు, బాలల కథలు, బాలల కవితలు రచించారు. వారిలో కడపజిల్లా ప్రొద్దుటూరుకి చెందిన డి.కె. చదువుల బాబు గారు తెలుగు ఉపాధ్యాయుడిగా ఉంటు 700లకు పైగా బాల కథలు రచించారు. వీరు 'బాలల కథలు' విజయ రహస్యం, బంగారు రెక్కలు, అప్పు–నిప్పు, చిన్నారి మనసు, రాజన్న తెలివి, దేశభక్తి, బహుమతి, గజ్జెల గుర్రం మొదలైన కథా సంపుటాలు ప్రచురించారు.

ఈయన చదువంటే చదవటం, వ్రాయటం, బట్టీ పట్టి పరీక్షలు వ్రాయటం మాత్రమే కాదు, పిల్లలని నైతిక విలువలతో సమాజానికి కీడు చేయని బాధ్యత కల్గిన వ్యక్తిత్వం కలవారిగా, ఆత్మస్థైర్యంతో జీవించాలని తెలుపుతూ కథలు రాశాడు.

**విలువైనది – కథ**

ఈ కథలో బాగా చదివే రవీంద్ర అనే విద్యార్థి సెల్‌ఫోన్‌కి బానిసయ్యి చదవకపోవడం వలన పరీక్షల్లో మార్కులు సరిగా రాకపోవడంతో రవీంద్రని ఉపాధ్యాయులు మీ తల్లిదండ్రులను తీసుకురావలసినదిగా చెప్తారు. రవీంద్ర తన తాతయ్యను తీసుకొని పోయి ప్రధానోపాధ్యాయుడికి పరిచయం చేస్తాడు. తాతయ్య రవీంద్ర సెల్‌ఫోన్‌కు బానిస అయ్యాడు అని తెలియజేసి, విద్యార్థులకు కొన్ని మంచి విషయాలు చెప్తానని ప్రధానోపాధ్యాయుడితో అనుమతి కోరి పిల్లలకు సమయం విలువ గురించి నీతికథ ద్వారా బోధించడం ఈ కథ ముఖ్య ఉద్దేశం. ఈ కథ నేటి కాలానికి అచ్చంగా సరిపోతుంది. పిల్లలు సెల్‌ఫోన్స్‌లో గేమ్స్, సినిమాలు చూస్తు సమయం వృథా చేయడం ద్వారా వారు కోల్పోయే బంగారు భవిష్యత్తు గురించి తెలుపుతుంది.

**మాస్టారు తెలివి**

ఈ కథలో అమల అనే విద్యార్థి యొక్క కథల పుస్తకం తరగతిలో ఎవరో దొంగిలిస్తారు. గోపాలరావు అనే తెలుగు ఉపాధ్యాయుడు తెలివితో కథల పోటీలు నిర్వహిస్తాడు. అందులో గోపి అనే విద్యార్థికి మొదటి బహుమతి వస్తుంది. ఉపాధ్యాయుడికి అనుమానం కలిగి గోపిని పిలిచి అమల కథల పుస్తకం తీసింది నువ్వే కదా నాకు తెలుసు. ఎవరికి చెప్పను నీవు కూడా ఎవరికి తెలియకుండా అమల బ్యాగులో ఆ పుస్తకం పెట్టు అని చెప్పి వెళ్ళిపోయాడు. మరుసటి రోజుకి అమల తన కథల పుస్తకం దొరికిందని మాస్టారుకి చెప్పి సంతోషపడింది. అలా ఉపాధ్యాయుడు తెలివిగా ఆలోచించి వ్యవహరించడం వలన గోపి దొంగ అయినా అతడిపేరు బయటకు రాకుండా తోటి విద్యార్థుల ముందు అవమానం పొందకుండా చెప్పాడు. పిల్లలు తెలిసో, తెలియకో తప్పులు చేస్తారు. వాటిని తప్పు అని సున్నితంగా మందలించి వాటి పర్యావసానాలు తెలియజెప్తే వారు భవిష్యత్తులో అలాంటి పనులుచేయకుండా ఉంటారు.

**విజేత కథ**

సమీర వర్మ, ఉగ్రసేనుడు అనే రాకుమారులు విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి ఒక గురుకులంలో చేరారు. అన్ని విద్యలలో ఆరితేరి ఎవరి రాజ్యానికి వారు వెళ్లి రాజులుగా పరిపాలన చేస్తున్నారు. చాలా

రోజుల తర్వాత ఉగ్రసేనుడు సమీరవర్మ రాజ్యానికి వచ్చాడు. స్నేహితున్ని ఆత్మీయతతో ఆహ్వానించి యోగక్షేమాలు చర్చించుకున్నారు. ఉగ్రసేనుడు సమీర వర్మతో 'నేను నా చుట్టుపక్కల ఉన్న రాజులను జయించి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాను. బలప్రయోగం ద్వారా శత్రురాజులు లేకుండా చేసుకున్నాను. నీవు కూడా శత్రురాజులు లేకుండా చేసుకున్నావా?' అన్నాడు.

సమీర వర్మ నవ్వి "నాకు చుట్టు రాజ్యాల్లో శత్రువు లెవరూ లేరు. అందరు మిత్రులే. చర్చల ద్వారా సరిహద్దు వివాదాలు లేకుండా పరిష్కరించుకున్నాను. అనేక రంగాల్లో ఒకరికొకరం సహకరించుకుంటూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాం. నేను శత్రువును జయించిన విజేతను కాను. ప్రేమతో శత్రుత్వాన్ని జయించిన విజేతను" అన్నాడు.

అందరితో మంచిగా, ఆత్మీయంగా కలసి మెలసి ఉండేవారికి శత్రువులు ఉండరు. ప్రేమతో శత్రుత్వాన్ని జయించవచ్చని పిల్లలు గ్రహించి తోటిపిల్లలతో కలిసిమెలిసి తిరిగేలా ఉండాలని కథ బోధిస్తుంది.

**సన్మార్గమే ఉత్తమ లక్షణం**

నిత్యానందుడనే గురువు సమీర రాజ్యంలో రాజు అయిన జయేంద్రుడు సాయంతో గురుకులం నడుపుతూ తన దగ్గరకు వచ్చే విద్యార్థులకు విద్యాబద్ధులు నేర్పేవాడు. విద్యాభ్యాసం అయిపోయాక విద్యార్థులను పరీక్షించి వారిని రాజు కొలువులో ఉన్నత కొలువుల్లో నియమించుకునేవారు రాజుగారు. అలా ఒకసారి పవనుడు, దమనుడు, సమీరుడు, విక్రముడు అనే నలుగురు విద్యార్థులను

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

పరీక్షించదలచిన గురువు గారు, తన భార్యకు అనారోగ్యంగా ఉంది, అందుకు చాలా ధనం కావాలి. మీరు నాకు గురుదక్షిణగా వైద్యంకు సరిపోయే ధనాన్ని తెచ్చివ్వండి అని చెప్పి పంపిస్తాడు.

వారు 2 నెలల తరువాత ధనంతో తిరిగొచ్చారు. అందులో పవనుడు దొంగతనం చేసి తెస్తాడు. దమనుడు బంధువులు దగ్గర అడిగి తీసుకొస్తాడు. సమీరుడు రాజాస్థానంలో అతని పాండిత్యాన్ని ప్రదర్శించి రాజుగారు ఇచ్చిన ధనంతో తిరిగివస్తాడు. విక్రముడు ఒక జమీందారు వద్ద ఆర్థిక విషయాలు చూసే పనిలో 2 నెలలు పనిచేసి ధనం తెస్తాడు.

గురువు నిత్యానందుడు, పవనుడు, దమనుడి వైపు కోపంగా చూసి దొంగతనం చేయడం, సంపాదించే వయసు వచ్చాక ఇతరుల దగ్గర అడుక్కోరాదని చాలాసార్లు బోధించాను. నా మాటలు పెడచెవిన పెట్టి కష్టపడకుండా ధనం సంపాదించాలని మీరు తప్పుడు మార్గాలు ఎన్నుకున్నారు' అన్నాడు.

ఇదంతా మారువేషంలో ఉండి గమనిస్తున్న రాజు జయేంద్రుడు తన మారువేషం తీసేసి వచ్చాడు.

సమీరుడుకి రాజాస్థానంలో కవిగా, విక్రముడిని కోశాధికారిగా ఉద్యోగాలు ఇచ్చి తీసుకెళ్ళాడు.

గురువు చెప్పిన మంచిమాటలను పెడచెవిన పెట్టి తప్పుడు మార్గాన్ని ఎన్నుకోవడం వల్లనే తాము రాజకొలువులో ఉద్యోగాలను కోల్పోయామని చింతిస్తూ భవిష్యత్తులో సన్మార్గంలో జీవించాలని అనుకుంటూ బాధపడుతూ వెళ్ళిపోయారు.

ఎలాంటి పరిస్థితులు ఎదురైన సన్మార్గంలోనే నడవాలని ఈ కథ బోధిస్తుంది.


పిల్లలతో బాలసాహిత్యం పుస్తకాలు చదివించటం, వారికి మంచి విషయాలు తెలియజేయడం ద్వారా మంచి గుణాలను కల్గించవచ్చు. సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దవచ్చు. ఈ స్పృహ తల్లిదండ్రులకు, పెద్దలకు ఉండాలి. పిల్లలను చక్కటి వ్యక్తిత్వం కలవారిగా, ఆత్మస్థైర్యం, సమస్యా పరిష్కార శక్తి, విచక్షణా శక్తి కలవారిగా తీర్చిదిద్దే బాలకథలను చెప్పడం ద్వారా, చదివించడం ద్వారా పిల్లలను మంచి సమాజాన్ని నిర్మించగల పౌరులుగా తీర్చిదిద్దవచ్చు. ఇలా డి.కె. చదువుల బాబు గారు కొన్ని వందల కథలు బాలల కోసం రాసారు. బాలల ఆలోచనల్లో మార్పు వచ్చేవిధంగా, జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి బాలసాహిత్యంపై చాలా కృషి చేశారు.

**ఆధార గ్రంథాలు**

1. బహుమతి కథల సంపుటి – డి.కె. చదువుల బాబు
2. గజ్జెల గుర్రం కథల సంపుటి – డి.కె. చదువుల బాబు

## మౌనస్వామి పీ.వీ. అంతరంగ వివేచనం

డా. వెలుదండ నిత్యానందరావు, ఫోన్ : 9441666881



'జాతిరత్న' పీవీ నరసింహారావు
ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి
వెల – 319 /-
పుటలు : 545
ప్రతులకు :
తెలుగు అకాడమీ,
హిమాయత్ నగర్, హైదరాబాద్.

ఈ మధ్య నేను చదివిన గొప్ప/ మంచి పుస్తకాలలో ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి గారి జాతిరత్న పీవీ నరసింహారావు జీవిత చరిత్ర ఎంతో ముఖ్యమైంది. గతంలో పీవీ నరసింహారావు మీద వినయ్ సీతాపతి, జయరాం రమేష్ లు ఆంగ్లంలో ఎన్నో ఆధారాలను సేకరించి ప్రామాణికంగా రాసిన గ్రంథాలున్నాయి. మరికొన్ని ఇంగ్లీషులో, తెలుగులో రాకపోలేదు. పీవీ ప్రధానిగా ఉన్న రోజుల్లో అప్పాజోస్యుల, విష్ణుభొట్ల ఫౌండేషన్ వారు ఒక బృహత్ సంచికను వెలువరించారు. కరోనా లాంటి మహమ్మారి చెలరేగి భయభ్రాంతులకు గురిచేస్తున్న కాలంలో, ఆ గృహనిర్బంధ వాతావరణాన్ని గ్రంథరచనకు అందివచ్చిన అవకాశంగా ఎంతో ఒడుపుగా మలుచుకొన్న విజ్ఞులు, చతురమతులు ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి గారు.

**ఇది చదివిన పిమ్మట మతి**
**యెదియేనియు జదువుబుద్ధి యేలా వొడమున్**
**బదపడి గ్రంథము లన్నియు**
**వెదకి వెదకి సారమెల్ల వివరింపంగన్ ...** అని కాకునూరు అప్పకవి చెప్పుకొన్నట్లే ప్రధాని పి.వి నరసింహరావు గురించి వెలువడ్డ సర్వగ్రంథాలను, వ్యాసాలను వెతికి వెతికి వాటి సారాన్నంతా పిండి పిండి మరో పుస్తకం చదవాల్సిన అవసరం లేకుండా సమన్వయ పూర్వకంగా ఈగ్రంథాన్ని రచించి చరితార్థులయ్యారు చెన్నకేశవరెడ్డి గారు.

ఎంతో దూరదృష్టితో, విజ్ఞతతో తెలుగు అకాడమీకి వ్యవస్థాపక అధ్యక్షులుగా రూపరేఖలను కల్పించి దిశానిర్దేశం చేసినవారు ఆనాటి ముఖ్యమంత్రి పీ.వీ.నరసింహారావుగారు. తెలుగు అకాడమీలో పీ.వి.సంతకంతో తాను నియమితులు కావడం, పదోన్నతి పొందడం ఆనందదాయకంగానూ, గ్రంథరచనకు ప్రేరణాత్మకంగానూ ఉందని "ప్రవేశిక"లో చెన్నకేశవరెడ్డి చెప్పుకొన్నారు. పీ.వీ. శతజయంతి సందర్భంగా ఈ జీవితచరిత్రను తెలుగు అకాడమీ ప్రచురించి తనను తాను గౌరవించుకుంది. పీ.వీ కాలంలో, తదనంతర కాలంలో ఒక వెలుగు వెలిగిన తెలుగు అకాడమీ కాలగతిలో, మారిన వివిధ ప్రభుత్వాల అనాసక్తత హేతువుగా నిస్తేజం అయిపోయింది. దానికున్న ఆర్థిక వనరులు సైతం నేడు ప్రభుత్వ కాళేశ్వరంలో కలిసిపోయాయి.

ఈనాడు ప్రతిదీ రాజకీయమే. ఎత్తుకు పైఎత్తులే. రాజకీయ నాయకుడు వచ్చే ఎన్నికలను చూస్తాడు. ఎలా గెలవాలని ఆలోచిస్తాడు. లాభనష్టాలను బేరీజు వేసుకొని తనవారినయినా వదిలించుకోవడానికీ, ప్రత్యర్థులనయినా ఆలింగనం చేసుకోవడానికీ, క్షణానికో మాట చెప్పడానికీ ఏమాత్రం సంశయించనివాడు రాజకీయ నాయకుడు. కానీ పీ.వి లాంటి రాజనీతిజ్ఞుల సంగతి వేరు. వచ్చిన ప్రతి అవకాశాన్ని అది మంత్రి పదవి కావచ్చు ముఖ్యమంత్రి కావచ్చు. ఏకంగా ప్రధాని కావచ్చు. వ్యక్తిగత, పార్టీగత ప్రయోజనాలే లక్ష్యాలు కాకుండా వాటిని కాపాడుకోవడానికి యత్నిస్తూనే దేశప్రయోజనాలే అంతిమ ప్రయోజనమని నిరూపించిన రాజనీతిజ్ఞుడు పీ.వి. ఒకానొక ఆపత్ సమయంలో, విలవిలలాడుతున్న భారత దేశాన్ని సముజ్జ్వలంగా నిలబెట్టినవాడు అపరచాణక్యుడు ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అన్నది నిర్వివాదాంశం.

ఆయన ప్రధానిగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు ఈరోజు సర్వ భారతాన్ని సమూలంగా మార్చివేశాయన్నది అనుభవైకవేద్యం. వాచాలుర మాటలకు అర్థాల పరిమితులు ఉంటాయేమో కానీ పీవీ లాంటి "మౌనస్వాముల" అంతరంగాలకు సమగ్ర వ్యాఖ్యానాలు ఉండవు. రామ జన్మభూమి విషయంలో నిందించినవారే అధికం. కానీ, మాటతప్పిన అద్వానీ, ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్, గవర్నర్ మంచివారయ్యారు. కొన్ని వేలమంది ఒకే లక్ష్యంతో వచ్చినపుడు రాష్ట్ర ప్రభుత్వమంతా వారిదిక్కే ఉన్నపుడు ఏ రాష్ట్రపతిపాలనో విధిస్తే, మూకుమ్మడిగా ఓ ఐదారువందలమంది చనిపోతే ఎవరిని నిందించేవారు? ఇదే కాంగ్రెసువారితో సహా అందరూ పీ.వి నే నిందించేవారు. పీవియే కాదు, అప్పుడు ఆ సీట్లో ఎవరు కూర్చున్నా సరే నింద పడవలసిందే. వ్యక్తులప్రమేయం లేకుండా కాలమే శాశ్వతంగా ఆ విషయాన్ని పరిష్కరించి భరతదేశాన్ని రక్షించింది. అందుకే రకరకాల అన్వయాలు. **"ఎగదీస్తే బ్రహ్మహత్య, దిగదీస్తే గోహత్య లాంటి పరిస్థితి"**(పుట.323) అని చెన్నకేశవరెడ్డి చేసిన వ్యాఖ్య ఎంతో సముచితమైంది. 12 అధ్యాయాల్లో చెన్నకేశవరెడ్డి ఎంతో పూజ్యభావంతో పీవీ సమగ్ర మూర్తిమత్వాన్ని ఆవిష్కరింప ప్రయత్నించారు. అందులో కృతకృత్యులై అభినందనీయులయ్యారు. రాష్ట్ర రాజకీయాలలో ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధాన మంత్రిగా, ఆర్థిక సంస్కరణల విజేతగా, రామజన్మభూమి పరిష్కర్తగా, చిట్టచివర పదవి నుండి దిగిపోయాక ఏకాకిగా పీవీ వ్యవహరించిన తీరుతెన్నులను, సాధకబాధకాలను కూలంకషంగా చర్చించారు. కుటుంబ జీవితం, సాహిత్య సాంస్కృతిక విశేషాలను విశ్లేషణాత్మకంగా విషయాత్మకంగా వివరించారు చెన్నకేశవరెడ్డి గారు.



ఆవగింజంత పనిచేసి కొండంత ప్రచారం చేసుకునే రోజుల్లో ప్రచార పటాటోపాలకు దూరంగా ఉండే సహజ ప్రవృత్తి కారణంగా పీ.వి చేసిన ఎన్నో మంచి పనులకు తగిన ప్రాచుర్యం లభించలేదు. నీలం సంజీవరెడ్డికాలంలో మొదటిసారిగా జైళ్ళశాఖ మంత్రిగా పీ.వి పని చేశాడు. ఖైదీలకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం, ఆరుబయటజైలు నెలకొల్పడం, బాల నేరస్థులకు సంస్కరణ పాఠశాల లేర్పాటు చేయడం లాంటి వాటికి ఆద్యులయ్యారని ఎంతమందికి తెలుసు? నీలం సంజీవరెడ్డి దాష్టీకానికి బలయిన మంత్రి కూడా పీవీ కావడం భవిష్యత్తులో ఎంతో జాగ్రత్తగా మసులుకొనే క్రమశిక్షణ నిచ్చిందేమో! పీ.వి పని మాత్రమే చేసి మాట్లాడకపోవడంవల్ల ప్రధానిగా ఐదేండ్లుండగలిగాడు. పీ.వి శిష్యుడు మన్మోహన్ సింగ్ పనీ, మాటా రెండు వదిలేయడంతో పదేండ్లు ప్రధానిగా ఉన్నాడు.

విద్యాశాఖ మంత్రిగా "ఫ్రెంచ్ అకాడమీ" స్థాయిలో తెలుగు అకాడమీ స్థాపించి నిర్వహించాలని కలలుగన్నాడు. **"ఆధునికభాష కాలేజీ పాఠ్యపుస్తకాల్లోకి ఎక్కడానికి పీ.విగారి పాత్ర ప్రధానమైనది. మేమంతా ఉపకరణాలమే"** (పుట.66) అని భద్రిరాజు కృష్ణమూర్తి లాంటి వారే ప్రస్తుతించారు. విద్యాశాఖ మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలలకు శ్రీకారం చుట్టిన సంగతి ఎంతమందికి తెలుసు? ముఖ్యమంత్రిగా భూసంస్కరణలు తెచ్చి భూస్వామ్యవర్గాలకు కంటగింపుగా మారి పదవిని కోల్పోయిన సంగతి చరిత్ర ప్రసిద్ధమే. కానీ బీసీలకు అధిక సీట్లు ఇవ్వడం, జనరల్ సీట్లల్లో దళితులను నిలపడం, తిరుపతి నియోజకవర్గం నుంచి క్రిస్టియన్ అభ్యర్థిని గెలిపించడం లాంటి సరికొత్త అంశాలు దీనిలో ప్రస్తావితమయ్యాయి. (పుట.77 ) ఇందిరా గాంధీకి నమ్మిన అనుచరునిగా పూర్తి ఢిల్లీ రాజకీయాలతో మమేకమైపోయారు. విదేశాంగమంత్రిగా ఆయన వేసిన ముద్రను చెన్నకేశవరెడ్డి గారు చక్కగా వివరించారు.(పుటలు. 105- 121). హోంశాఖ, రక్షణ శాఖ, మానవవనరులు ఇలా ఇంచుమించు అన్ని శాఖల్లో అనుభవం గడించారు. రాజకీయాలను విరమించి ఇంటికి వెళ్ళిన తరుణంలో "విధి" ఆయనను ప్రధానమంత్రిని చేసింది. ప్రధానమంత్రిగా ఆయనకంటూ ఒక ప్రత్యేకవర్గం లేకపోవడమే ఆయన బలమైంది. ఆర్థిక సరళీకరణలను బలోపేతం చేశాడు. వాటిఫలితాలను నేడు దేశం అనుభవిస్తుంది. బ్యాంకింగ్, సాఫ్ట్ వేర్ రంగాల అభివృద్ధి, పారిశ్రామిక నియంత్రణల తొలగింపు, విదేశీ వాణిజ్యానికి పూర్తి స్వేచ్ఛ, సౌర విద్యుత్తు ప్రాముఖ్యం, జాతీయ రహదారుల అభివృద్ధి, విదేశాలతో స్నేహపూరిత దౌత్య సంబంధాలు, అణ్వాయుధనిర్మాణం మొదలైన ఎన్నో విషయాలను చెన్నకేశవరెడ్డిగారు ఈ గ్రంథంలో సవరంగా పేర్కొన్నారు. అన్నదమ్ములు, సంతానం, బంధుత్వాలు, వారితో పీ.వి సంబంధాలను "కుటుంబ జీవనం"అనే అధ్యాయంలో చర్చించారు.

పీ.విలోని మరో విశిష్టాంశమైన సాహిత్య పార్శ్వాన్ని- రచనా వ్యాసంగాన్ని, అనువాదాల్ని సాకల్యంగా వివరించారు. చివరలో ఓ పిచ్చి కేసులో ఆయన బాధపడిన తీరు, స్వతంత్రంగా వ్యవహరించడం వల్ల సోనియాగాంధీ ఆగ్రహానికి గురై, చివరికి అంత్యక్రియల్లో జరిగిన అగౌరవం తీరు అందరికీ తెలిసిందే. **"ఆఖరికి పాముల, తేళ్ల బాధపడలేకుండా ఉన్నాం"** అని జి.సి. కొండయ్య అంటే **"పాములతో, తేళ్లతో కొండలకు, బండలకు బాధేమిటి"** (పుట.506) అని పీ.వి సద్యఃస్పందనగా ఇచ్చిన జవాబు కూడా ఈ గ్రంథంలో చోటుచేసుకుంది. ఈ చమత్కారంలోని స్వారస్యం, నేపథ్యం, **"సంసారజీవితంలో అసంతృప్తితంత్రీస్వనమేదో అధశ్చేతనలో ఘూర్ణిల్లిన సంగతీ"** (పుట.488) ఆనాటివారి కందరికీ తెలుసు. పీ.వి చమత్కారాలను, ఛలోక్తులను కూడా విడిచిపెట్టకుండా గ్రంథస్థం చేశారు. పీ.వి చేతిరాత, ఫోటోలు వగైరాలు సముచితంగా పొందుపరచబడ్డాయి. ఎనభైఏళ్ళ వయస్సులో కరోనాతో అతలాకుతలం అవుతున్నవేళ చెన్నకేశవరెడ్డి గారు ఎంతో శ్రమతో, ఓపికతో ఇంత సమాచారాత్మక బృహద్గ్రంథం వెలువరించడం యువతరానికి స్ఫూర్తిదాయకం. అందరూ చదవదగిన గ్రంథం.

మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177

# శ్రీరంగస్వామి 'కావ్యావలోకనం'

**డా. గుమ్మా సాంబశివరావు**

ఫోన్ : 98492 65025

విహారిగా సాహిత్యలోకంలో ప్రసిద్ధులైన శ్రీ జె.ఎస్.మూర్తిగారు కవిగా, కథా రచయితగా, నవలారచయితగా, విమర్శకునిగా, ఎంతో ప్రసిద్ధులు. వారి కలం నుంచి శ్రీపద చిత్ర రామాయణమనే బృహత్ పద్యగ్రంథం వెలువడే వరకూ వారిలో అంత పద్య నిర్మాణ ప్రతిభ ఉన్నదనే విషయం సాహిత్య లోకానికి తెలియదు. ఆ గ్రంథం వచ్చిన తర్వాత దాన్ని గూర్చి ప్రత్యేక సదస్సులు జరిగాయి. డా. వేమూరి సత్యవతిగారు బాలకాండను గూర్చి పరిశోధన చేసి డాక్టర్ పట్టా పుచ్చుకున్నారు. ఇంకా మాకినీడి సూర్యభాస్కర్, గుమ్మా సాంబశివరావులు ప్రత్యేక గ్రంథాలు రచించారు. ప్రస్తుతం డా.టి. శ్రీరంగస్వామిగారు విహారిగారి శ్రీపద చిత్ర రామాయణాన్ని గూర్చి 'కావ్యాలోకనం' గ్రంథాన్ని వెలువరించటం సంతోషించదగిన అంశం.

డా. టి. శ్రీరంగస్వామిగారు మంచి సాహిత్య కార్యకర్త. బహుగ్రంథ రచయిత. సౌమ్య స్వరూపి. ఎక్కడ ప్రతిభ ఉన్నా గుర్తించే ఉదార గుణ సంపన్నులు. విశ్వనాథ వారి సాహిత్యమంటే 'ఇంత' అని చెప్పటానికి వీలులేని అభిమానం గల సహృదయులు. అలాంటి స్వామిగారు విహారి గారి శ్రీపద చిత్ర రామాయణంలోని 'కిష్కింధ కాండ'ను గూర్చి 2015 ఏప్రిల్‌లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన సాహిత్య సదస్సులో ఒక పరిశోధన పత్రాన్ని సమర్పించి, అంతటితో ఆగలేక విహారి గారి రమాయణంలోని అన్ని కాండల్ని అనుశీలనం చేస్తూ 'కావ్యాలోకనం' గ్రంథాన్ని వెలువరించటం అభినందనీయనం.

శ్రీ రంగస్వామిగారు తమ గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించారు. బాలకాండము, అయోధ్యాకాండము, అరణ్యాకాండము, విహారి 'ఇష్టి', కిష్కంధ, 'సుందర' మారుతీయం, యుద్ధకాండము అనే శీర్షికలతో శ్రీపద చిత్ర రామాయణమనే పర్వతాన్ని 'కావ్యాలోకనము' అనే అద్దంలో చూపించే ప్రయత్నం చేశారు. శ్రీరంగస్వామిగారు కాలస్వభావాన్ని గుర్తించిన రచయిత. వారు ఎన్నో సదస్సులు నిర్వహించారు. పుస్తకాలు ప్రచురించారు. ఇప్పటి తరానికి పెద్ద గ్రంథాలు చదివే తీరిక, ఓపిక లేవని అనుభవపూర్వకంగా గ్రహించినవారు కాబట్టి విహారిగారి రామాయణ రచనా మహత్త్వాన్ని సంక్షిప్త సుందరంగా, సహృదయ పాఠకలోకానికి పరిచయం చేశారు. మూల గ్రంథం మొత్తాన్ని చదివిన అనుభూతిని కలిగించారు.


గ్రంథ రచయిత శ్రీరంగస్వామిగారు ముందుమాటగా "చిత్రవర్ణాల పదసోయగం" అనే శీర్షికలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. "విశ్వనాథ వారు అన్నట్టుగా ఈ పదచిత్ర రామాయణంలో విహారిగారి 'జీవుని వేదన' కూడా ఉంది. ఆ జీవుని వేదననే నాతో ఏప్రిల్ 2022 నుండి జులై 2022 వరకు ఈ కావ్యాన్ని అనుశీలనం చేయించింది. అని తెలియజేశారు.

శ్రీరంగస్వామిగారు కవి హృదయాన్ని బాగా అర్థం చేసుకోవటం వల్ల, కవిగారి కవితా హృదయాన్ని విశేషంగా పసిగట్టటం వల్ల, శ్రీపద చిత్ర రామాయణ కావ్య వైశిష్ట్యాన్ని గ్రహించటం వల్ల 'కావ్యాలోకనము' గ్రంథాన్ని రచించగలిగారని చెప్పవచ్చు. విహారి పద్యాలు వ్యాఖ్యానం అవసరం లేని సరళ సుందరమైన పదాల పోహళింపుతో స్పష్టమైన భావాలతో ఉంటాయి. కాబట్టి స్వామిగారు సందర్భోచితంగా ఆయా పద్యాలను ఉట్టంకించారు. అవసరమైన సందర్భంలో చిన్న చిన్న వివరణలు అందించారు. ప్రతి కాండలోను విహారిగారు రచించిన విశిష్ట పద్యాలను పేర్కొనటమే కాకుండా, ఆయా కాండల్లో విహారగారు ప్రయోగించిన విలక్షణ ఛందస్సుల పట్టికను కూడా ఇవ్వటం బాగుంది. అంతటితో ఆగకుండా ఆయా కాండల్లో ప్రసక్తమైన తెలుగు నానుడుల్ని, సామెతల్ని ఏర్చి కూర్చటం స్వామిగారి పరిశీలనాశక్తికి, భాషానురక్తికి తార్కాణం.

స్వామిగారు ఆయా కాండల్ని వివరించిన తీరును విపులీకరిస్తే ప్రతి శీర్షిక అంటే ప్రతికాడమును గూర్చిన పరిశీలన ఒక్కొక్కటి ఒక్కక లఘుసిద్ధాంత వ్యాసం అవుతుందని చెప్పటంలో అతిశయోక్తి లేదు. రామాయణ కథ అందరికీ తెలిసిందే కావటం, రామాయణ పద్యకావ్యాలు ఎన్నో రావటం కారణంగా స్వామిగారు విహారిగారి రామాయణంలోని పద్యరచనా ప్రతిబను ప్రకటించటానికి మచ్చుకు కొన్ని పద్యాల్ని మాత్రమే ప్రస్తావించారు.

విశ్వనాథవారి 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము' కావ్యం తర్వాత ఇన్ని విలక్షణమైన ఛందస్సుల్ని ప్రయోగించిన మరొక కవి లేదని చెప్పటానికే స్వామిగారు విహారిగారు రచించిన వైవిధ్యభరితమైన ఛందస్సుల్ని గూర్చి చెప్పారని భావించవచ్చు. కవి జాతీయాల్ని, నానుడుల్ని ప్రయోగించాలంటే కేవలం బహుగ్రంథ పరిచయం చాలదు. ఆ కవికి విశేషమైన లోకజ్ఞత కూడా ఉండాలి. విహారిగారు లోకజ్ఞుడైన కవి అని నిరూపించటానికే స్వామిగారు అనేక జాతీయాలను, నానుడుల్ని పట్టికగా ఇచ్చారు.ద దీన్నిబట్టి వారి నిశిత పరిశీలనాశక్తి స్పష్టమవుతుంది.


విహారిగారు రచించిన శ్రీపద చిత్ర రామాయణమనే జలధిని శోధించి అందులోని పద్యరత్నాల్ని పాఠకులకు అందించిన శ్రీ రంగస్వామిగారు అభినందనీయులు. వీరి రచన మరికొంతమందికి ప్రేరణ అవుతుందని భావిస్తున్నాను. స్వామిగారి కలం నుంచి మరిన్ని రచనలు రావాలని ఆశిస్తున్నాను.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 2 (58) హైదరాబాద్ డిసెంబర్ : 2023

# పలు భావాలు! పసందైన కవితలు!! ఎన్నో వర్ణాలు...!!!

దేవ కాటమరాజు నరసింహులు, ఫోన్ : 7981581967




ఫేస్బుక్‌ల అనేక సమూహాలు సాహిత్య సేవ చేస్తున్నాయి. అలా సేవ చేస్తున్న సమూహాలలో శాంతికృష్ణ గారి సారథ్యంలోని 'తెలుగు సాహితీవనం' కూడా ఒకటి. ప్రతి నెల ఒక సాహిత్య పోటీ, కవి అంతరంగం, జూమ్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఒక వార్షికంలో నిర్వహించిన పోటీలలోని విజేతలందరికి కవితలను కార్యనిర్వాహక బృందం కవితలను కలిపి సంకలనంగా వెలువరించడం హర్షణీయం. ఇప్పటివరకు 'పాడవే కోయిల', వసంత వీచిక, సమరధీర సంకలనాలు వెలువడగా 2023 జులై చివర్లో జరిగిన ఆరవ వార్షికోత్సవంలో "ఎన్నో వర్ణాలు..." కవితా సంకలనంతో పాటు అంతర్వాహిని కథల సంకలనం కూడా వెలువరించారు.

"ఎన్నో వర్ణాలు.." కవితా సంకలనం ఆ వార్షికంలో నిర్వహించిన 9 పోటీలలో విజేతలయిన 42 మంది కవితలు, కార్య నిర్వాహక బృందం 10మందివి వెరసి 52 కవితలతో చక్కగా ముస్తాబైన కలర్‌ఫుల్ వచన కావ్యం! ఇందులోని ప్రతి కవిత కూడా ప్రామాణికత సంతరించుకున్నదే!

**"..... ప్రతి భావమూ కవి గుండెలో ఓ వర్ణమై / ప్రతి అక్షరమూ తానొక ఇంద్రధనుస్సు సోయగమై / కవుల కలం నుండి ఎన్నెన్నో ఆవిష్కరణలు / కవులు మానస సరోవరంలో విరబూసిన / ఎన్నెన్నో అద్భుతాలు...."** అంటూ ఎన్నో వర్ణాలు పరిచయాన్ని కవితాత్మకంగా వ్యక్తీకరించారు సంపాదకులు శాంతికృష్ణగారు.

ఇందులోని 9 పోటీలలో కవితాంశాలు వరుసగా ఉగాది, కల, ఐచ్ఛికం (ఏదేని), స్వాతంత్ర్య సమరయోధులు, గురువు, ఐచ్ఛికం (ఏదేని) పండుగ, మాతృభాష, ప్రేమ.

'ఉగాది' అనే కవుల హృదయాలు వసంతాగమన మనోహర దృశ్యహేలా విలాస సందోహమే! మచ్చ రాజమౌళి గారు వంసతాగమనాన్ని ప్రకృతి ధర్మాన్ని కవిత్వీకరిస్తే, **ఆరు రుచులతో హరి విల్లుకి ఏడు రంగులద్ది / శుభాల పల్లకినెక్కి శుభకృత్‌లో సంతోషంగా విహరిద్దాం!** అంటూ ఆర్. రెడ్డి ఈశ్వర్ ఆదిత్య ఆకాంక్షించారు. **"మనమందరం గుండెల మీద చెయ్యేసుకొని / హాయిగా నిదురోయిన నాడే కదా / నిజమైన యుగాది"** అంటున్నారు అప్సర్ వలీసాగారు! అనంతలక్ష్మిగారు 'కోకిల గానం'లో చైతన్య గీతమాలపించుమని కోకిలను అభ్యర్థిస్తున్నది.

'కల' కవితాంశాన్ని స్వీకరించిన కవుల కలాలలోంచి కమ్మని సుమధుర కవితా సుమాలు పూచినవి. **"కలవరిస్తే కాసేపు కమ్మని పులకింత / కల వరిస్తే రంగుల హరివిల్లే జీవితమంతా"** సత్య చాగంటి గారి "రస ధ్వన్యాత్మక కవిలే!" "కల వరమా? కలవరమా?" అనే శీర్షికతో బంధకవి శ్రీనివాస రామారావుగారు అంత్యప్రాసలతో కవితను కదును త్రొక్కించారు! **"ప్రతిరోజు కలలో కవ్విస్తున్న / ఓ స్వప్నసుందరీ!/ అసలు నువ్వెవ్వరు?"** అంటూనే ఓ అద్భుత రూప లావణ్య సుందరిని మనముందు సాక్షాత్కరింపజేశారు వారణాసి భానుమూర్తి రావుగారు!

50వ పోటీలో నిర్ణీత అంశము లేకుండా కవుల ఇచ్ఛకు వదిలేశారు. చాలా రసవత్తరమైన, భావస్ఫోరకమైన కవితలు ఎంపికైనవి. మనిషిలోని స్వార్థాన్ని, అనైతికతను ఎండగడుతూ భౌతికం నుండి ఆదిభౌతికం దిశలో ప్రయాణింపజేసే లీలా కృష్ణ గారి "మనగలనా" ప్రబోధాత్మక కవిత! మమతానురాగ బంధాలను త్రెంచుకున్న కన్న కూతురికై తల్లడిల్లిన "తండ్రి హృదయం" చాలా హృదయ విదారకమైన కవిత ప్రసాదరావు రామాయణం గారిది. "నన్ను మరిచిపోకండి" అంటూ ఆచంట సుధా కళ్యాణి గారి మాతృభాష మాధుర్యపు కవిత!

"స్వాతంత్ర్య సమరయోధులు" అంశంపై లాక్కొండ కుళ్ళాయప్ప, భాగ్యధామ, జె.వి. కుమార్, చేపూరి గారు చక్కని సందేశాత్మక కవితలు అందించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారి ఆకాంక్షలు, స్వతంత్ర భారతంలోని ప్రస్తుత పరిస్థితి, సామాజిక బాధ్యతలను తెలియజేస్తూ మంచి సృజనాత్మకంగా రచించారు.

'గురువు' కవితాంశంగా 'సకల శాస్త్రాలకు, జీవితాలకు సదా గురువు ప్రకతి విశ్రమీగే మనిషికి బుద్ధి చెప్పగలిగే గురువు ప్రకృతే. గొడుగు యాదగిరి రావుగారి ప్రకృతి ఆరాధన, ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థియై, అక్షర పిపాసుడై విద్యార్థులకు మార్గదర్శకుడౌతాడని షేక్ రహీమ్ సాహెబ్‌గారు ఆదర్శ గురువును సాక్షాత్కరింపజేశాడు. **"అతనెందుకో తపోవనంలో ఋషిలా / చీకటి రెక్కలు విరిస్తూ / మస్తిష్కాలకు మందిస్తున్నాడు"** సాంద్రత నిండిన కవితా పంక్తులు మల్లాది శ్రీనివాస్‌గారు గురువొక ఋషిగా, శిలను శిల్పంగా మలిచే అక్షర బ్రహ్మగా కీర్తించారు.

53వ పోటీ (ఐచ్ఛికం)లో **"నాలో అజ్ఞానాన్ని తొలగించి / మానవతా విలువలు పెంచిన / ఆచార్య దేవోభవ! తస్మై గురవే నమః"** అంటూ ఎం.ఎన్. చారిగారు గురువుకు అంజలి ఘటించారు. **"ప్రపంచ పర్యావరణంలో మానవుణ్ణే మొక్కగా నాటుతున్న / మంచితనపు నీటిని పోసి మానవ మహావృక్షంగా మలుస్తా / వసి వాడని మానవతా కుసుమాలను గుత్తులుగా విరబూయిస్తా...."** అంటూ రాయపురెడ్డి సత్యనారాయణగారు వర్తమాన జీవన విధానం కవిత్వీకరిస్తూ గట్టి సంకల్పం వెలిబుచ్చారు. చక్రవర్తి వేనంక ప్రేమానురాగాలు వెల్లివిరిసే అన్యోన్య దాంపత్యాన్ని, చిలుక గోరువంకల లాంటి ఆదర్శజంటను అక్షరీకరించారు. ఆవేదనా భరితమైన అన్నదాతల ఆత్మహత్యలను కవితా వస్తువుగా స్వీకరించి కంట తడి పెట్టించారు ఇంద్రగంటి మధుసూదనరావుగారు! కుమారి గాయత్రీదేవి గారు **"..... ఆమె నా ఇంటి మనిసి పనిమనిషి / మనసున్న పనిమనిషి"** అంటూ ఒక మంచి "పనిమనిషి" గురించి బంధువు గాని బంధువుగా అభివర్ణించారు.

54వ అంశం 'పండుగ'ను ప్రకృతి ప్రసాదాలుగా మహేశ్ వూటుకూరి స్వీకరిస్తే సంక్రాంతి పండుగ వాతావరణాన్ని తన కవితావరణంలో నింపేశారు వనితారాణి నోములగారు! మంథా అనురాధ గారు రంగవల్లుల హరివిల్లును కనులముందు సాక్షాత్కరింప జేశారు. అరుణ ధూళిపాళగారు రొటీన్‌కు భిన్నంగా 'పండుగంటే' కవిత కాస్త నిష్ఠూరంగా చెప్పినా నిజమేననిపిస్తుంది. **".... కలిసి వుంటున్నామన్న కలను / వాస్తవమని భ్రమింపజేస్తూ / కలవడమేనా పండుగంటే?...** అనే ప్రశ్నతో మొదలెట్టి **"మానవత చెట్టు నీడన / మనసుతో అల్లుకున్న బంధాలకు / అనురాగంతో ప్రాణమిస్తే / పచ్చని పండుగలే రోజులన్నీ....!"** అనే సందేశంతో ముగిస్తారు.

55వ పోటీ 'మాతృభాష' అంశాన్ని స్వీకరించిన కొత్త భానుప్రియగారు మాతృభాష తెలుగు వైభవాన్ని ఆత్మాశ్రయంగా చక్కగా వర్ణించారు. **"..... ఎన్నటికీ ఎప్పటికీ మరుపురాని మధుర కావ్యమై నిలుస్తున్న అఖండ ప్రస్థానాన్ని నేను....!"** అంటున్నారు. **"ఆంగ్లభాష మోజులో పడి మరువద్దు మాతృభాష / అలసత్వం వహిస్తే కనుమరుగువుతంది అమ్మ భాష"** పానుగంటి శ్రీనివాసరెడ్డిగారు హెచ్చరిస్తున్నారు. కొత్తపల్లి గారు 'మాట్లాడాలనుంది' కవితలో ఆర్ద్రత, ఆగ్రహ పూరిత స్వరాన్ని అక్షరీకరించారు డా. హనీశ్చంద్రగారు. **'భవహరుడె మెచ్చి ఇచ్చె తల్ల పాల భాష... "** అంటూ మాతృభాషా ప్రాశస్త్యాన్ని కొనియాడారు. 'అమ్మ భాషకు వందనం' అంటూ శ్రీనిజగారు మాతృభాష ఔన్నత్యాన్ని వివరించారు. **".... భాషలు యెన్ని నేర్చిన సరే మన తెలుగు భాషపై పట్టును వీడకు....!"** అంటూ మన భాష కవితలో తెలుగు ప్రాముఖ్యాన్ని 'గాదె రమేశ్' విశదపరిచారు. **"అమ్మను మరువకురా / అది ఏ భాషైనా తల్లి భాషను విడువకురా!"** అంటూ డా. చదలవాడ ఉదయశ్రీగారు 'అమ్మ భాష' మాధుర్యాన్ని చవిచూపారు. తరతరాలకు వారసత్వ సంపద మాతృభాష అంటూ అమ్మ భాష అమృతధారలు అమ్మ భాష చైతన్యంలో డా. కొమురవెల్లి అంజయ్యగారు విశదపరిచారు. పిళ్ళా కుమారస్వామిగారు "మధువనం"లో తెలుగు భాష హృదయాన్ని ఆవిష్కరించారు.

56వ కవితల పోటీగా 'ప్రేమ' అంశము నిర్దేశించనైనది. అనంతమైన అనుబంధాలు అనుభూతుల్లో ప్రేమ ఒక అమూల్యమైన, అనిర్వచనీయ భావన. ప్రకృతిపరంగా సహజసిద్ధంగా జనించే అవ్యక్తానురాగ ప్రేమ చిరస్మరణీయం. ఇది తెలియని కొందరు వయస్సు తొందరలో స్వార్థ చింతనతో మానసిక వికార విషయ వాంఛలతో కామ, మోహాంధులై 'ప్రేమ'ను కలుషితం చేస్తున్నారు. ఈ అంశాల నేపథ్యంలోనే డా. పాతూరి అన్నపూర్ణగారి 'ప్రేమ', శాస్త్రి జి.ఎల్.ఎన్.గారి 'ఆమె ప్రేమ', రత్నయ్యగారి 'ఫైవ్ స్టార్ చాక్లెట్‌లా', వసుధాదేవి తిరుమలగారి 'ప్రేమామృతం' సాగి అనిల్‌కుమార్‌గారి 'నీ ప్రేమలో కడవరకూ' శశికిరణ్ కొమాండూరి గారి 'ప్రేమ వింటున్నావా!' రామ్‌గోపాల్ కొమ్ములగారి 'ప్రేమతో', యస్. బసవయ్య గారి 'ప్రేమను గూర్చిన నిజం' కవితలు ప్రేమ జగత్తులో రసవాహినులై ప్రవహిస్తున్నవి.

సాహిత్య సేవా దురంధరులు, సాహితీమూర్తులైన తెలుగు సాహితీవనం కార్యనిర్వాహక బృందం వారి 10 కవితలు కూడా యిందులో చేరి ఉన్నవి. చాలా అద్భుతంగా ఉన్నవి. మొదటగా వ్యవస్థాపక అడ్మిన్ శాతికృష్ణ ఎం.ఎస్‌గారు తన 'అత్యున్నత శిఖరం' కవితలో **"ప్రతి దారెంట నీ గమనం / సుగంధాలు అద్ది వెళ్ళాలి.../ ప్రతి వేదికపైనా నీ కవిత కావ్యమై మెరవాలి..."** అంటూ కవి మిత్రులకు ఆశీవాచక కవితగా అభిలషించారు. డా. కృష్ణారావు రెడ్నం (అమెరికా) గారు ప్రముఖ నేత్రవైద్యులు వారి కవిత 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'లో వారి రంగాన్నే ప్రతిబింబించేలా మలిచారు. కంటి ప్రాధాన్యత చెప్పారు. "అనాయాస మరణం వినా దైన్య జీవనం" అనే ఆర్యోక్తి స్ఫూర్తిగా 'యాచించను' తాడిమేటి సూర్యప్రకాశరావుగారి కవిత ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. వీరి కవితలో శ్రీశ్రీ మెరుపులు కనిపిస్తాయి. విజయగోలి గారు 'ఒంటరితనం'లో ప్రకృతి పారవశ్యంతో భావకవిత్వం అమోఘంగా పలికించారు. శ్రీధర్‌రెడ్డ బిల్లా గారు నీటికుండను ప్రతీకగా ఒక మానవీయ కోణంలో కథనంగా కవిత్వీకరించారు. "పాలు గారవలసిన చెంపలపై పసివాడి స్వేదం" కరుణ రసాత్మక వాక్యం! బాల కార్మికుని గురించి చాలా గొప్పగా చెప్పాడు. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నారు మన ఆలంకారికులు.

**"నేనింకా శూన్యాన్ని కప్పుకున్న మనిషినే / నాదింకా దైన్యాన్ని వీడని జన్మమే"** – ఇవి నవీన్‌చంద్ర హోతా గారి అసంపూర్ణ కావ్యంలోని మార్మిక కవితా శకలాలు.

# ప్రాణ ధాతువులు

ఎన్ని వన్నెల వాక్యాలు అల్లినా
ఈ చేయి
నేలను దున్నే నాగలి మేడిపట్టుకున్న
నీ చేయికి సాటి వస్తుందా?

ఎన్ని వర్ణాలు ఏర్చి పదచిత్రాలు కూర్చినా
ఈ చేయి
సన్నని దారాలను సుకుమారంగా సుతారంగా నేసిన
నీ చేతికి దాటవుతుందా?

ఎన్ని కథల కలశాలు నింపినా
ఈ చేయి
మట్టి ముద్దను మంచి పాత్రలుగా మలిచిన
నీ చేతికి పోటీ అవుతుందా?

ఎన్ని సుందర భావాల నందనాలు సృష్టించినా
ఈ చేయి
చిలుకలు తుమ్మెదలు వాలే నీవు పెంచిన
చిన్ని తోటకు సాటియవుతుందా?

అద్భుత కల్పనలతో ఊహలతో
అందాల నాయికానాయకుల బంధాలను
అక్షరబద్ధం చేసిన నేను
ఆచ్ఛాదనం లేని అర్ధశరీరాన్ని
ఎండకు వానకు చలికి ఎదురిచ్చి
నీలమేఘశ్యాముడివైన నీతో పోటీ పడగలనా?

నా రాతలు
తెల్లని కాగితంపై నల్లని సిరాచుక్కలు
జ్ఞాన బీజాలే, అయినా
నీ చేతలు
నల్లని చీకటి తెరపై ఉదయాన్ని ప్రకటించే
వేగుచుక్కలు
ప్రాణధాతువులు

('శతద్రు' వచన పద్యాల నుండి)

**డా. గంద్ర లక్ష్మణ రావు**
**ఫోన్ : 98393 28036**


కాలం నిత్య నదీ ప్రవాహం లాంటిది. దానికి పురోగమనమే కాని తిరోగమనము తెలియదు. **"కాలం ఎపుడూ యుద్ధమే / అది నేర్పే పాఠం చరిత్రల సంకలనమే / విజేతలను ఊరేగిస్తూ పరుగెత్తమని / మనకు ప్రబోధించే కావ్యమే... / పరాజితులను పరాజితులను పలకరించని కఠినత్వమే"** సుమన్ ప్రణవ్‌గారు 'కాలం'పై చాలా లోతైన పరిశీలనాత్మక కవిత సృజియించారు. కాలంపై వ్రాసిన గొప్ప కవితల్లో ఒకటిగా నిలుస్తుంది. 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్' శిక్షణలో టైమ్ మేనేజ్‌మెంటు సెషన్‌కు స్వీకరించదగిన గొప్ప కవిత.

"మహిళ..." శీర్షికతో అరుణకుమారి సందడిగారు స్త్రీ ఔన్నత్యాన్ని ఆవిష్కరించారు. **"సప్త స్వరాల ఇంద్రధనుస్సు నీవు / వర్ణమై ప్రేమను పంచే చిత్రమే నీవు / సుస్వరాల మధుర రాగం నీవు / హృదయాను రాగాల పల్లవి నీవు"** అంటూ మహిళా చైతన్య గీతాన్ని పలికినారు.


"ఓ యువతా మేలుకో" కె.వి.ఎన్. మూర్తిగారు యువతకు స్ఫూర్తిదాయకమైన కవితను అందించారు. **"నీలోని నిస్తేజ మేఘాలకు చలనం రావాలంటే / పోటీ ప్రపంచాల పవనాలను ఢీకొనక తప్పదు / అపజయాలకు క్రుంగిపోకు / ఆటంకాలకు ఆగిపోకు /... శిఖరాలను చేరాలంటే ఆగకుండ ముందుకు సాగు / ఏరోజుకైనా శిఖరం నీ కాళ్ళకింద ఉంటుంది...."** ప్రయత్నించకుండా ఉండే బదులు ప్రయత్నించి ఓడిపో.. ఫర్వాలేదు కదూ గొప్ప సందేశమిది.

చివరగా శ్రీనివాస్ తొడుపునూరి (అమెరికా)గారు అనురాగ ఆప్యాయతల గొడుగైన 'అమ్మ కొంగు' గురించి అద్భుతమైన కవితను అందించారు. అమ్మ గురించి అమ్మ వస్తువుల గురించి ఎవరు వ్రాసినా అది అద్భుతమే. అమ్మ కొంగు పిల్లలకెలా అవసరపడుతుందో దివ్యమైన కవితగా మలిచారు. ఈ అత్యాధునిక సమాజాల్లో 'కొంగు' 'అవుట్ డేటెడ్' కావొచ్చు. కానీ పల్లె బ్రతుకుల్లో, శ్రమ జీవన వనితల్లో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. వీరిని దృష్టిలో వుంచుకొని వ్రాసిన గొప్ప రచన. వీరి కవితలోని ముక్తాయింపు చూస్తే **'కొంగున్న అమ్మకు కొంగొకటే చాలు! లేని అమ్మ మోయాలి పనిముట్లు పదివేలు'** నిజంగా ఇది అనుభూతి కవిత్వమే.

ఎన్నో వర్ణాలు... వచన కవితా సంకలనం చక్కని, చిక్కని కవితల సమాహారం. పదుగురు కవుల హృదయ స్పందనల మేళం. సామాజిక స్పృహ, నిబద్ధత గల కవికుల కలయిక. ఇందులో ఎన్నో భావచిత్రాలు, పదచిత్రాలు తొణికిసలాడుచున్నవి. వ్యాస విస్తరణ భీతిచే వాటినన్నిటిని ఏర్చి కూర్చలేకపోయాను.




## స్వ'కృతి'





**కాకతీయ పంచవింశతి – ఓరుగల్లు కథలు**
డా. గుంజి వెంకటరత్నం ఫోన్: 9951907390
వెల : 150 /- ప్రచురణ: ఎమెస్కో, హైదరాబాద్.
**ప్రతులకు :** 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్, హైదరాబాద్ – 29. ఫోన్ : 040- 23264028





**జాగృతి తేజాలు (దేశభక్తి కావ్యం)**
– కర్నాటి రఘురాములు గౌడ్, వెల : 150 /-
**ప్రతులకు :** రచయిత, గ్రా. గుండ్లగంటపల్లి, మం. ఊర్కొండపేట, వయా. మర్చాల, నాగర్‌కర్నూలు జిల్లా – 509 320
ఫోన్: 628151 9576




**నీతి పద్య రత్నావళి (తెలుగు బాల మహా శతకము)**
డా. గుంజి వెంకటరత్నం ఫోన్: 9951907390
వెల : 200 /- ప్రచురణ: ఎమెస్కో, హైదరాబాద్.
**ప్రతులకు :** 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్, హైదరాబాద్ – 29. ఫోన్ : 040- 23264028




**స్వేచ్ఛాకవిత్వం .. సంపుటాలు 7 మరియు 8**
మాదిరాజు రంగారావు
వెల : 100/- పుటలు : 810
**ప్రతులకు :** నవోదయ మరియు విశాలాంధ్ర పుస్తక విక్రయ కేంద్రాలు, హైదరాబాదు.




**చారుచర్య గోరుముద్దలు**
– ప్రాచార్య శలాక రఘునాథ శర్మ
ఆంగ్లం : డా. పిరాట్ల బాలసుబ్రహ్మణ్యం
వెల : 99 /-
**ప్రతులకు :** శ్రీమతి శలాక రాజేశ్వరి, ఆనంద వల్లీ గ్రంథమాల, 75-1-3/ఎ5, 'జ్ఞానపూర్ణిమ' బ్లూ మూన్ అపార్ట్‌మెంట్స్, ప్రకాశం నగర్, రాజమహేంద్రవరం – 533103
ఫోన్ : 098660 68542

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ – 27560616**

1. భారతదేశ చరిత్ర – సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 – 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 – 00
3. నల్లగొండ జిల్లా కవులు – పండితులు రూ. 350 – 00
4. మల్యాల వంశ చరిత్ర – శాసనములు రూ. 100 – 00
5. శాసన సంపుటి రూ. 150 – 00
6. కందూరు చోడుల శాసనములు – చరిత్ర – సంస్కృతిరూ. 100 – 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 – 00
8. విజయనగర శాసనములు – సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 – 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 – 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 – 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 – 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 – 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 – 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 – 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 – 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# జయహో 2024..




కేలెండర్ మారుతున్న వేళ
మనసుపొరల మసకను తొలగిద్దాం!
సస్నేహ సౌజన్య పోషాకుల్ని
మేను తరువులకు అతికిద్దాం!
అనుబంధపు చిగుళ్ళను
మానవ మ్రోదులకు మొలిపిద్దాం!
ఆత్మీయతా సరాగాల విపంచికకు,
తంత్రులమై విజయనాదమాలపిద్దాం!
చీలికలతో కలబడడం కన్నా,
సంఘటితమై కలిసి నిలబడడం మిన్న!
అన్న భావన హృదయాలకు పులిమేద్దాం!
అవును... ఇప్పుడు...
కేలెండర్ మారుతన్న వేళ...
మన ఆలోచనలను ... ఆచరణను
అభివృద్ధి పథంవైపు మళ్ళిద్దాం!
కారాలు మిరియాలు నూరడం మాని,
సహకార భావనతో పయనిద్దాం!
సూర్యునిలా అందరికీ చైతన్యం పంచేద్దాం!
చంద్రునిలా చంద్రికలను వెదజల్లేద్దాం!
నదులమై మదులను ప్రక్షాళన చేద్దాం!
అన్నిటికీ మించి...
నిష్కల్మష భావనతో,
మనుషుల్ని మానవత్వంతో నిలబెడదాం!
మనసుల్ని అతికించి
సుమనస్కులుగా మలుద్దాం!
కేలందర్ మారతున్న వేళ ...
మనం కార్యాచరణకు నడుం బిగిద్దాం!
ఆశావహ దృక్పథంతో అడుగేద్దాం!
నవ శకానికి నాందీగీత మాలపిద్దాం!
ఆంగ్ల నూతన సంవత్సర
శుభాభినందనలతో...










.....అవ్వసుల భానుప్రకాశాచార్య
ఫోన్ : 96032 04507

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

State Bank of India, Nallakunta Branch,

A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma